సింహాగిరి వచనములు

కృష్ణమాచార్య ప్రణీతము

సంపాదకుడు - పరిష్కర్త

డాక్టర్ ఎమ్. కులశేఖరరావు, ఎమ్. ఏ., పిహెచ్. డి.



ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి

కళాభవన్ - సైఫాబాదు

హైదరాబాదు 4

C1

BLANK PAGE

సింహాద్రి వచనములు

కృష్ణమాచార్య ప్రణీతము

సంపాదకుడు - పరిష్కర్త
డాక్టర్ ఎమ్. కులశేఖరరావు, ఎమ్. ఏ., పిహెచ్. డి.



ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి
కళాభవన్ - సైఫాబాదు
హైదరాబాదు 4

SIMHAGIRI VACHANAMULU - A Telugu Prose Classic
by Krishnamacharyulu of 14th century A.D.
Edited by Dr. M. Kulasekhara Rao, Reader, Department of Telugu, Osmania University, Hyderabad.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
హైదరాబాద్ - 500 004

ప్రచురణ : 314

ప్రథమ ముద్రణ : 1980
ప్రతులు : 2,000

వెల : రూ. 2-50

ప్రతులకు :
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్, సైఫాబాద్,
హైదరాబాద్ - 500 004.

ముద్రణ :
శ్రీ సిద్ధి వినాయక ప్రింటర్స్,
జమిస్తాన్‌పూర్, హైదరాభాద్.

Paper used for the Printing of this book was made available by the Government of India at Concessional rate.

తొలిపలుకు

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి వచనైకరచన కృష్ణమాచార్యుల "సింహగిరి వచనములు." 1968 వరకు ఇది ప్రాతప్రతిగానే ఉండిపోయింది. ఆంధ్ర రచయితల సంఘంవారు 1968లో దీన్ని తొలిసారిగా ముద్రించి పాఠకలోకానికి అందజేసినారు. ఇప్పుడు ప్రతులు లభ్యం కావడం లేదు. పండితులు ఎందరో ఈ గ్రంథాన్ని అకాడమి తిరిగి ప్రచురించాలని సూచించినందుకు, ఇప్పుడు అలభ్యంగా ఉన్న గ్రంథాలను అందించాలనే అకాడమి పూనుకున్నందుకు ఈ గ్రంథాన్ని మేము ప్రచురిస్తున్నాము.

14వ శతాబ్దమునాటి తెలుగువచనాన్ని, తెలుగు సమాజాన్ని, తెలుగు భాషను ఆవగతం చేసుకోవడానికి ఈ పుస్తకం ఎంతో ఉపకరిసుంది.

ప్రాతప్రతిని చక్కగా పరిష్కరించి ప్రామాణికమైన పీఠికను రచించి ఈ పుస్తకం విలువను ఎంతగానో పెంచినవారు డాక్టర్ ఎం. కులశేఖరరావు గారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో రీడరు. అకాడమి పక్షాన వారికి కృతాజ్ఞతాభివందనములు అర్పిస్తున్నాను.

హైదరాబాదు.
30-12-1980.

ఖండవల్లి కృష్ణమూర్తి
కార్యదర్శి

BLANK PAGE

ఉపోద్ఘాతము

ఆంధ్ర సాహిత్యమున కాలక్రమము చేతను, ఔన్నత్యము చేతను, మహా భారతము ప్రథమమున పేర్కొన దగియున్నది. దీనిలో తత్కర్తలైన కవిత్రయము వారు శాంతమును ప్రధాన రసముగా పోషించి, కావ్య నిర్మాణము గావించిరి. మరి కొంతకాలమునకు ఆంధ్రభాషలో వెలువడిన ప్రబంధములనెడు వర్ణనా ప్రధానములైన కథాకావ్యము లందు శృంగారము ప్రధాన రసమైనది. శాంత శృంగారాది రసముల నాంధ్ర సాహిత్యకులు అభిమానించి నట్లుగానే, భక్తి భావముకూడ కొందరు సాహిత్యకులకు కావ్యరచనమున ప్రోత్సాహ కారణమైనది. భరతుడు మున్నగు ప్రాచీన లక్షణకారులు భక్తిని రసములుగా స్వీకరించక పోయినను, తెలుగువారు మాత్రము భక్తిని అభిమానించి, తత్ప్రధానముగా గ్రంథ రచనమును గావించిరి. వీరు, భక్తి, రసమగునా, కాదా, యను వివాదమును పరికించినవారు కారు. భక్తికి రసస్థితిని కల్పించి, దానికి ప్రామాణికత్వమును గూర్చిన పోతనామాత్యుని ఆంధ్రమహా భాగవతము ఆంధ్రులకు అత్యంత ఆదర పాత్రమైనది. పోతనవంటి కావ్యకర్తలే కాక, తాళ్ళపాక అన్నమాచార్యులు, రామదాసు, త్యాగరాజు మొదలైనవారు, భక్తిమార్గము నవలంబించి సంకీర్తలని వ్యవహరింపబడు రచనలు గావించిరి. కావ్యకర్తలను, సంకీర్తనాచార్యులను ప్రోత్సహించి నట్లుగనే, భక్తి, వచన రచయితలకు గూడ కావ్యరచనా హేతువైనది. తమ యిష్టదైవముపై గల భక్తి భావములే ప్రభావితులై, తన్మయులై పల్లువు రాంధ్ర వచన రచయితలు భక్తి ప్రధానములైన రచనలు గావించిరి. సింహగిరి వచనములు, శతకోప విన్నపములు, గంగాధరయ్య వచనములు, భవానీ మనోహర వచనములు మున్నగునవి యిట్లు వెలువడినట్టివే.

ఆంధ్ర వాఙ్మయావిర్భావమునకు తరువాత కొంతకాలమునకు, ఆంధ్ర రచయితలు తామభిమానించిన మతమును దృష్టియందుంచుకొని కావ్యరచన గావించి యున్నారు. పాల్కురికి సోమనాథాది శివకవుల రచనములును, రంగ నాథరామాయణాది కావ్యములును, ఈ ఉద్యమములకు ఉదాహరణములుగా నున్నవి. కావ్యకర్త లట్లు మత ప్రభావమునకు లోనై నట్లుగానే, వచన రచయితలు

గూడ కావ్యరచనకు మతము నాధారము చేసికొనిరి. ఈ వచన రచయితలు భక్తి ప్రధానమైన రచనలు చేయువారు కాబట్టి, ఆ భక్తి ప్రభావము వీరి రచనలలో అధికముగా నుండును. ఈ విశేషమును దృష్టి యందించుకొని చూచినచో, ఆంధ్ర వచనైక గ్రంథములను రెండు విభాగములు చేయవలసి యుండును. 1. వైష్ణవమత ప్రతిపాదక భక్తివచనములు. 2. శైవమత ప్రబోధక భక్తి వచనములు. సింహగిరి వచనములు, వెంకటేశ్వర వచనములు, శఠకోప విన్నపములు, శేషగిరినాథ విన్నపములు మొదలైనవి మొదటి విభాగమునకును, భవానీ మనోహర వచనములు, గంచాధరయ్య వచనములు మున్నగునవి రెండవ విభాగమునకును ఉదాహరణములగును. భక్తిచేత ప్రేరితులై రచయితలీ రచనలు చేసినను, ఇట్టి రచనలకు సాహిత్య పరముగా గాని, మత పరముగాగాని, ఎట్టి సంప్రదాయములు వారిని ప్రభావితము చేసినవి, అనునంశమును పరిశీలించ వలసి యున్నది.

ప్రారంభమునుండియు, ఆంధ్ర వాఙ్మయముపై సంస్కృత భాషాసాహిత్యముల ప్రభావము స్పష్టముగానే కాన్పించును. నన్నయాదులు ఛందస్సు, పదజాలము మున్నగువానిని గూర్చు సందర్భమున చాల వరకు సంస్కృతమునైననే యాధారపడిరి. దేశి కవితా మార్గము ననుసరించిన కొందరు కవులు ఈ ప్రభావమునకు దూరముగా నుండుటకు ప్రయత్నించిరి. కాని ఆ ప్రయత్నము కొద్ది కావ్యములకు మాత్రమే పరిమితమైనది. వారు రచించిన శతకము సంస్కృత కావ్య ప్రక్రియమే కదా: ఇట్లితర ప్రక్రియలను ప్రభావితము చేసినట్లుగానే, సంస్కృతము ఆంధ్ర వచన రచనా మార్గమును కూడ తన వైపే నడిపించినది. ఈ వచనములు తెలుగులో రచిత మగుటకు మత సంప్రదాయము కూడ కొంత కారణమే. వైష్ణవ మతోద్ధారకులు, వైష్ణ మతాచార్యులునగు శ్రీ రామానుజాచార్యులు సంస్కృతమున విష్ణుభక్తి ప్రతిపాదకములైన గద్యములను రచించిరి. అవి 'గద్యత్రయమ్' అని ప్రఖ్యాతినందినవి. వానికి శ్రీరంగ గద్యమ్, శరణాగతి గద్యమ్, శ్రీ వైకుణ్ఠ గద్యమ్, అని వ్యవహారము. వైష్ణవమతానుయాయులలో నీగద్యత్త యమునకు చాల ప్రచారము కలదు. వీని నామతావలంబకులు కంఠస్థముచేసి నిత్యపఠనీయముగా భావించుచుందురు. ఇక నా కాలమున నీ మత ప్రధానమైన వచనముల కధిక వ్యాప్తియు ప్రాభవమును నుండి యుండును. వైష్ణవ మతాభిమానులైన యాంధ్ర రచయితలనీ వచనము లాకర్షించి యుండును.

తెలుగులో కూడ నిట్టి ఛందో రహితమైన రచనలు చేయవలెనని వారు భావించిరి. భక్తియందును, వైష్ణవ మత సంప్రదాయమునందును, రచనా సంప్రదాయము నందును వారు శ్రీ రామానుజుల యడుగు జాడలలో నడచినవారేకదా. ఇట్లు మతసాహిత్య సంప్రదాయములు సమ్మేళనము కాగా, ఛందోరహితమై భక్తి ప్రధాన ముతైన వచనము తెలుగున నావిర్భవించినవి.

సాహిత్యపరముగా చూచినచో, పద్యమున కెంతటి గౌరవము కలదో వచనమునకుఁ గూడ నంతయే కలదు. నన్నయాదులు తమ కావ్యములందు వచన రచనకు సముచిత స్థానము కల్పించియున్నను, వచనైకరచనలపై వారి దృష్టి ప్రసరించినట్లు కాన్పించదు.* శివకవులు జాను తెనుఁగు, వస్తు కవిత యను నంశములను ప్రస్తావించిరే కాని, వచన రచనము కావ్యమునకు ప్రశస్తమైన దనియు, పాఠకులకు సుబోధకమయినదనియు, గుర్తించినవారు కాదు. అందుచేత తెలుగు భాషలో, మనకు తెలిసినంతవరకు కృష్ణమాచార్యులే కేవలము వచన రచనము చేయుటి కాద్యుఁడైనాఁడు. నన్నయాదులను పద్యరచన మాకర్షించినట్లు గానే, యీతనిని వచన రచన మాకర్షించినది. ఛందో బద్ధమగు పద్యరచన మీదనే రచయితల కందరికిని యభిమాన ముండవలెనను నియమము లేదు కదా. కొందరికి పద్యమెంత సుందరముగా భాసించునో, మరికొందరికి వచన మంతటి యానంద మును కలిగించును. ఇది రచయితలకు గల వైయ్యక్తికాభిమానముపై నాధారపడి యుండును. కృష్ణమాచార్యులు మొదలైన రచయితలు వచపము నభిమానించి తమ భక్తి వచనములగు స్తోత్రవచనములను వెలయించిరి.

కావ్యములందు శతకము బహుళ ప్రచారమును పొందిన ప్రక్రియ. భక్తి ప్రధానములైన తెలుగు స్తుతి వచనములో శతకములను బోలిన కొన్ని లక్షణము లున్నవి. శతకమునందలి పద్యములందు సంబోధనతో గూడిన మకుటమున్నట్లు గానే, యీ స్తుతి వచనములందు ప్రతిదాని యంతమందు సంబోధనాత్మక మకుట ముండును. శతకమున ఏ పద్యమున కాపద్యమే స్వతంత్రము. ఒక పద్యమునకు, తరువాతి పద్యమునకు భావగతమైన సంబంధముండదు. సరిగా నిదే పద్ధతి యీ వచనములందును కాన్పించును. ఏ వచనమున కావచనమే స్వతంత్రమైన భావముతో

---

*నేను ప్రాసిన 'ఆంధ్రవచన వాఙ్మయము-ఉత్పత్తి వికాసములు' అను గ్రంథములో విపులముగా నీయంశమును చర్చించితిని.

నలవారు చుండును. శతకమునందు, తత్కర్త, ఒక కథకుగాని, వృత్తాంతమునకు గాని ప్రాధాన్యమీయక, అనేక విషయములను సందర్భోచితముగా గూర్చుచుండును. స్తుతి వచన కర్తలును నట్టి విధానమునే యవలంబించిరి. పరోక్షముగా శివభక్తియో, విష్ణుభక్తియో యందు చెప్పబడును. కాని, ఒక కథమ చెప్పవలయునను నియమ మేదియు లేదు. శతకమునందలి పద్యములందు తత్కర్త భావమును కుదించి మనోహరముగా చెప్పిన రీతినే, యీ వచన కర్తలు భావస్ఫుటీకరణము చేసి చెప్పు చుందురు. దీనివలన వాక్యములలో భావగాంభీర్య మేర్పడుచున్నది. ఆవి యన్నియు శతకములకును, స్తుతి వచనములకు ను ంల సామ్యములు. ఈ రెండింటికి కొన్ని భేదములు కూడనున్నవి. శతకములకు సంఖ్యా నియమములు ప్రధానముగా భావింప బడుచున్నది. వేమన శతకము వంటివి కాన్ని యీ నియమమునకి క్రమించినను, శతక సాహిత్యములో నధికాంశమీ నియమమునకు కట్టువడియే యున్నవి. అనేక విషయములందు శతకములతో బోలియున్న స్తుతిబచనములు, సంఖ్యా విషయ మున వానితో భేదించుచున్నవి. మనకు లభించిన వచనములందు, నూరు గాని, నూటొనిమిదియు కాని యున్న వచనములు లేవు. కృష్ణమాచార్యులు 'చాతుర్లక్ష' వచనములను రచించెనట ! ఇక మిగిలిన రచయితలలోను నెవ్వరును సంఖ్యా నియమమును పాటించినట్లు కాన్పించదు. శత సంఖ్యతో సంబంధముగల శతక మను పేరీ వచనములకు లేకుండుట కిదియే కారణము. ఇదికాక, శతకములకును, ఈ వచనములకును ప్రధానమైన భేదమింకొకటి కలదు. శతకములలో మనకు వస్తు వైవిధ్యము కాన్పించును. శతక కర్తలు, భక్తి, వైరాగ్యము, శృంగారము, అధిక్షేపము మొదలగు విషయములను గ్రహించి రచన చేయుచుందురు. కాని, స్తుతి వచన కర్తలకు కేవలము భక్తియే ప్రధాన విషయమైనది. భగవత్స్తుతియే పని పరమార్థముగా నుండును. ఇట్లు కొన్ని భేదములున్నను, నీ రెండు ప్రక్రియ లకు సామ్యములే యధికములనుటలో సందేహము లేదు.

వైష్ణవ మత ప్రాధాన్యమును ప్రబోధించు వచనములను శ్రీరామానుజా చార్యుల గద్యములు మార్గమును చూపించినవని చెప్పితిని. మరి, శైవ ప్రాధాన్యము నుగ్గడించు వచనములకు మార్గదర్శకములైనవేవి ? అను ప్రశ్న వెలువడక మానదు. కాలక్రమము ననుసరించి కృష్ణమాచార్యులే యిట్టి వచనముల కాద్యుడు. ఈతని తరువాత శైవ మత ప్రధాన వచనములను వ్రాసిన యాంధ్ర రచయితలు ఈతనినే యనుసరించి రనవలసి యుండును. అన్ని విషయములందును విభేదము

వహించిన శైవ గ్రంథకర్తలు ఈయంశమున నీ వైష్ణవాగ్రేసరుని యనుసరింతురా యను సందేహము కలుగును. శైవ సంబంధమగు వచనములు తెలుగున నెట్లు ప్రవేశించెను అను ప్రశ్నము వచ్చును. ఈ ప్రశ్నకు సమాధానము కలదు. వైష్ణవ మతాచార్యులగు రామానుజులు సంస్కృతమున గద్యరచన చేసినట్లుగానే, దక్షిణ భారత దేశమును వీరశైవ మతమును ప్రచారము చేసి, శైవాచార్యులం దగ్రేసరుడని ప్రఖ్యాతిని వహించిన బసవేశ్వరుడును కొన్ని వచనములను రచించెను. భక్తి ప్రధానములైన యీవచనములు కన్నడ భాషయందున్నవి. ఇవి 'షట్ స్థలవచన', 'కాలజ్ఞాన వచన' అను పేర్లతో విఖ్యాతిని బొందినవి. శైవులయందీ వచనములకు బహుళ ప్రచారము కలదు. షట్ స్థల వచనమునుండి కొద్ది భాగమిదాహరింతును.

'నరకెన్నెగె, తెరగల్లకె, శరీరగూత వగచమున్న, హల్లు హూగి చెన్న బాగి, అన్వరిగె హంగావమున్న, కాలుమేలే కయ్యనూరి కోలహడియ మున్న ముప్పిందొప్ప వళియవమున్న, మృత్యు ముట్టవ మున్న, పూజనమ్మ కూడలి సంగమ దేవా!'

మతమునందు వలెనే, సాహిత్యమునందును శివకవులు కొన్ని సంప్రదాయములను పాటించిరి. పాల్కురికి సోమనాథుడు ద్విపద రచన చేయుట యిట్టి సంప్రదాయాను సరణమే. బసవేశ్వరుడు చేసిన వచన సంప్రదాయము, శైవమును పాటించిన వారికి మార్గదర్శకమునైనది. రామానుజాచార్యుల సంస్కృత గద్యములు వైష్ణవులకు అనుసరణీయములైనట్లుగనే, బసవేశ్వరుని కన్నడ వచనములు శైవులకు అనుగమ్యములైనవి. బసవేశ్వరుడేకాక, కన్నడమున అక్క మహాదేవియను రచయిత్రి యిట్టి వచన రచన చేసియున్నది. ఆమె రచనములు కూడ నాంధ్ర రచయితలకు దోప చూపియుండును. ఈ విధముగా శైవ వైష్ణవ మతములు తెలుగున వచన రచనమునకు దోహదములైనవి.

భక్తి ప్రధానములై స్తోత్ర రూపములుగా నుండి, సంకీర్తనాత్మకముగా నున్న వచనములలో కాలక్రమము ననుసరించి కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి వచనములు మొదటివి. స్వతంత్రమైన యాంధ్ర వచనరచనకు కృష్ణమాచార్యులే యాద్యుడు. ఈ వచనములే కృష్ణమాచార్య సంకీర్తనములనియు, కృష్ణమాచార్య పదములనియు వ్యవహారమును బొందినవి. తాళ్ళపాక పెద తిరుమలాచార్యుల కుమారుడు తాళపాక చిన తిరుమలాచార్యుడు. ఈతడు

క్రీ. శ. 16 వ శతాబ్దమున జీవించెను. ఈతడు తన సంకీర్తనలక్షణమును గ్రంథమున నిట్లు వ్రాసియున్నాడు.

"మఱియు చూర్ణాఖ్య పదం బెట్టిదంచేని,
ధర కృష్ణాచార్యాదిక
పరికల్పిత పదము తాళబంధ చ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యున్
బరగునది నిరుక్త నామ భాసితమగుచున్.

మఱియుఁ దచ్చూర్ణం బెట్టి దనిన,
ఛందో గణముల నియతిం
బొందక తాళ ప్రమాణమునఁ గడుఁజెలువై
కొందటిచేఁ దచ్చూర్ణం
బందముగాఁ దాళ గంధి యనఁ బొగడొందున్.

ఇవి వచనములైనను వీనిని 'కృష్ణాచార్యాదిక పరికల్పిత పదము'లని చిన్నన్న పేర్కొని యుండుటచే, వీనికి పదనామము వ్యవహారమున నుండెననియే చెప్పవలెను. ఈ పదములు 'ఛందో గణముల నియతిం బొందక'యుండు వచనములే కాని వేరుకావు. ఈ వచనములను రచించిన కృష్ణమాచార్యులకు వచన వాఙ్మయ ప్రథమాచార్యుడను గౌరవము కలదు. సంకీర్తన ప్రథమాచార్యుడను ఖ్యాతినిగూడ నీతడు పొందియున్నాడు. కృష్ణమాచార్యులకు ముందు ఆంధ్రభాషయందు ఛందో రహితములైన వచన కావ్యములు వెలువడక పోవుటయు, సంకీర్తన మార్గమున నీతడే ప్రథముడగుటయు, నీ వ్యవహారములకు సార్థకత కలుగుచున్నది.

కృష్ణమాచార్యులు రచించిన సంకీర్తనము అనబడు వచనములు మనకిప్పుడు కొన్ని మాత్రమే లభించుచున్నవి. అవి తంజావూరు నందలి సరస్వతీ మహలు గ్రంథాలయమున తాళ పత్రములందు నిక్షిప్తములై యున్నవి. అవి మాత్రమే యీ గ్రంథమున పరిష్కరించి కూర్పబడినవి. కృష్ణమాచార్యులు జీవించిన కాలమును గురించి యీ వచనములు స్పష్టముగా తెలియ జేయుటలేదు. కాని, యాతని జీవిత విశేషములు కొన్ని యందున్నవి. ఈతని జీవిత కాలమును గురించి ప్రతాప చరిత్రయను వచన గ్రంథమున తత్కర్త ఏ కామనాథు డిట్లు లిఖించియున్నాడు.

"మఱియు నొక్కనాఁడు సంతూరను గ్రామంబునఁ గృష్ణమాచార్యుల తమ్ముఁడనంతాచార్యులు రజక స్త్రీతోఁ గూడెను. ఆ రజకుడిద్దరిని బొడిచెను. అంత వారు మరణించిరి. ఆ పురి విప్రు లిది శూద్ర పీనుగుతోఁ గూడియున్నది. కనుక మేము మొయ్యమనిరి. అదివిని కృష్ణమాచార్యులు తన మదిని విచారించి వాసుదేవ మూర్తిని కీర్తచేసెను. శవంబు తనంత తానే కాష్ఠంబు వరకు జరిగిపోయెను. ఇదిగని సకలజనంబు లేతెంచి కృష్ణమాచార్యుల పాదంబులకుం బ్రణమిల్లి క్షమింపుఁడని వేడుకొనిరి. ఆ యయ్యా, నాకు రాగద్వేషంబులు లేవు. మీరు వెరవకుఁడని వచించెను. ఆవార్త ప్రతాప రుద్రుఁడు చారులచే విని కృష్ణమాచార్యుల రావించి, పూజించి, కనకగిరి సీమలో నాల్గవ భాగంబును, ౫౦ గ్రామంబుల కధికారంబును, నొక్క యూరగ్రహారంబుగ నొసంగి పంపెను.

కృష్ణమాచార్యులు సంతూరు ప్రవేశించి సకల ధనంబులు పంచి పెట్టెను. కల్లూరను గ్రామంబు గట్టించెను. మూడు వర్షంబు లధికారంబు సేసి గ్రామంబులకు గలుగు పదార్థంబులు దెప్పించి తామ్ర పత్రికలు చేయించెను. ఆ పత్రికలమీద, తాను రచయించిన చాతుర్లక్ష గ్రంథంబుల చెక్కించెను. వాటిని శకటంబులపై నిడికొని శ్రీరంగబునకుఁ బో నుద్యోగించెను.

అంతఁ గొందఱు ధూర్తులు గూడి రాజు సముఖంబునకుఁ బోయి కృష్ణమాచార్యులు మీర లధికారంబు లిచ్చిన గ్రామంబుల పదార్థములు దెప్పించి, తామ్ర పత్రంబుల జేయించి, శ్రీరంగంబునకుఁ గొని పోవుచున్నాఁడని యెఱిం గించిరి. ప్రతాప రుద్రుండది విని, యతఁడు మహాత్ముఁడు. అతనికేమి యిష్టమో నాకునదే యిష్టంబని వచించి యూరకుండెను.

ఆవార్తను నిష్టజనులచే కృష్ణమాచార్యులు విని తన మనంబున వాసుదేవుని నారాధించి యొక్క వచనంబు రచియించిన, మెచ్చి, యే కశిలా నగరంబున గనక వృష్టిఁ గురిపించెను. ఇది గని ప్రతాప రుద్రుండచట జనంబులను గృష్ణమాచార్యులను బూజించి వారిచే వీడ్కొనెను. కృష్ణమాచార్యులు శ్రీరంగంబున కరిగిరి.' (ప్రతాప చరిత్ర)

ఇందు కృష్ణమాచార్యులకు సంబంధించిన పెక్కు చారిత్రక విశేషములున్నవి. శవ వృత్తాంతము, కనక వర్షము, అను రెండద్భుత సంఘటనములను వదలినచో, ఇతరములు చారిత్రక ప్రాముఖ్యము కలిగినట్టివే. ఓరుగంటిని పరి

పాలించిన ప్రతాపరుద్రుడు, పాల్కురికి సోమనాథుడు మొదలైన కవులను గౌర
వించినట్లు ఐతిహ్యములున్నవి కదా. సాహిత్యాభిమానియగు నాతడట్లే కృష్ణమా
చార్యులనుగూడ సన్మానించి యుండవచ్చును. దీని పరిణామముగా, కృష్ణమా
చార్యులు సంపన్నుడై గ్రామాధికారము వహించెను. స్వాభావికముగా నీతడు
భక్తుడై యుండుటచేత, ధనధాన్యములు, అధికారము, అతని భక్తి భావమునకు
లోపమును గలుగనీయలేదు. ఇతడు రాజధనమును వ్యయించి, రాగి రేకులను,
చేయించి, తాను రచించిన వచనములను వానిపై చెక్కించెను. దానిలోను చిత్ర
మేదియు కాన్పించదు. పరమ భక్తుడగు రామదాసు, రాజధనముతో భద్రాచల
క్షేత్రమున దేవాలయ నిర్మాణము చేసినట్టిదే యిదికూడ. రాగిరేకులపై వచనము
లను (సంకీర్తనములను) చెక్కించు సంప్రదాయము కృష్ణమాచార్యులే స్థాపించి
నట్లున్నది. ఈతని తరువాతి వాడగు తాళ్ళపాక అన్నమాచార్యులు తన సంకీర్తనము
లను రాగిరేకులపై వ్రాయించి భద్రపరచెను, దీనివలన, కృష్ణమాచార్యుల యీ
తామ్ర పత్ర వృత్తాంతము సత్యమనియే తెలియును. మహాభక్తుడగు కృష్ణమా
చార్యులు రాగద్వేషముల కతీతుడని శవవృత్తాంతము నిరూపించుచున్నది. ఇతని
శ్రీరంగ ప్రయాణమునను అవిశ్వసనీయ విషయముకాదు. వైష్ణవ మతాను
యాయు లందరును తమ జీవితమున నొక్కసారియైనను శ్రీ రంగనాథుని దర్శించుట
జన్మ సార్థక్యమునకు కారణమని భావింతురు. వైష్ణవాగ్రేసరుడగు కృష్ణమా
చార్యులట్లు చేయుటలో విచిత్రమేమి ? తన రచనములైన వచనములను శ్రీ రంగ
నాథునికి నివేదించుటకే యీతడా ప్రయాణమును తలపెట్టి యుండెనని యూహింప
వచ్చును. ఇంకొ విశేష మీతడు రచించిన గ్రంథ పరిమాణమునకు సంబంధిం
చినది. ఇది 'చాతుర్లక్ష' గ్రంథమట: గ్రంథమనగా ఒక వచనమని - ప్రతాప
చరిత్ర కర్త యభిప్రాయము కాబోలు. గ్రంథమనగా ముప్పది రెండు మాత్రలు
గల యక్షర సమూహమను నొక యభిప్రాయమున్నది కాని యది యిట సమన్వ
యించదు. ఈ వచనముల నీతడు నాలుగు లక్షల సంఖ్యలో రచించి యుండెనా
యను సందేహము కలుగకపోదు. కాని, యీ సంఖ్యను విశ్వసించుటకు
'చాతుర్లక్ష' ప్రశంస ఈతడు రచించిన వచనములలో చాల సందర్భములందు
కాన్పించుచున్నది. పౌతకమూరి వృత్తాంతము చెప్పిన వచనమున 'చాతుర్లక్ష'
వచనముల కింకను లక్షయేబదివేలు కొదువయని చెప్పియున్నాడు. ఆతని జీవిత
శేషమున నవికూడ పూర్తిచేసియే యుండును. ప్రతిదినము కొన్ని వచనములు
నియమముగా వ్రాసినను అధిక సంఖ్యలొనే వీనిని రచించి యుండును. మహా

భక్తులును, కవులును నగు అన్నమాచార్యులు, త్యాగరాజు అధిక సంఖ్యాక పద రచనము చేయుట నిట్టిదిగానే భావించవలసి యుండును. కనక వర్షమునకు ముందు వాసుదేవుని ఆరాధించుచు కృష్ణమాచార్యులు 'ఒక్క వచనంబును' రచించెనట. అనగా ఒక వచనమున విష్ణుమూర్తిని స్తుతి చేసెననుట. మిగిలిన వచనములును స్తుతి వచనములే. కృష్ణమాచార్యులు తన జీవిత కాలమున గొప్పఖ్యాతిని బొందెననియు, రాజగౌరవ సమ్మానముల నందెననియు ప్రతాప చరిత్ర లోని యీ కథనము విశదీకరించుచున్నది.

ఇక కృష్ణమాచార్యుల జీవితకాలమును గురించి తెలిసికొన వలసియున్నది. కాకతీయ ప్రతాపరుద్రుని కాలము తెలిసికొన్నచో నితని కాలము తెలిసినట్లే. ఇప్పటివరకు లభ్యములైన చారిత్రకాధారము లన్నిటిని సేకరించి, విశేషముల నన్నింటిని చర్చించి, ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం గారు తాము రచించిన సిద్ధేశ్వర చరిత్ర పీఠికలో ప్రతాపరుద్రుని జీవిత కాలమును నిర్ణయించిరి. దీనివలన ప్రతాపరుద్రుడు క్రీ. శ. 1254–1323 మధ్య కాలమున జీవించినట్లు తెలియవచ్చు చున్నది. *The Early History of Decca*$_n$ అను గ్రంథమున డా. నేలటూరి వేంకట రమణయ్య గారు, శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, అనేక విషయముల నాధారము జేసికొని, యిదేకాలము సరియైనదని భావించిరి. క్రీ.శ. 1295 మొదలుకొని 1523 వరకు ప్రతాపరుద్ర చక్రవర్తి కాకతీయ సామ్రాజ్యమును పరిపాలించెననియు వీరి యభిప్రాయము. ప్రతాపరుద్రుని దర్శించి, యాతనిచే మన్ననలను పొందిన కృష్ణమాచార్యులు క్రీ. శ. 13 శతాబ్ది ఉత్తరార్ధమున జన్మించి 14వ శతాబ్ది పూర్వభాగము ముగియు వరకు జీవించి యుండును. ఈతడు ప్రతాపరుద్రుని దర్శించిన వృత్తాంతము సిద్ధేశ్వర చరిత్ర యందును గలదు. ఈ వృత్తాంతము ప్రతాప చరిత్రతో సంవదించుచున్నది కూడ. కృష్ణమాచార్యులు క్రీ. శ. 1290 సంవత్సరమున జన్మించియుండెనని కృష్ణమాచార్యులు-ఆంధ్రప్రదేశము, అనువ్యాపమున శ్రీ నిడదలోలు వేంకటరావుగారు వ్రాసియున్నారు. ఈ కాలము ప్రతాపరుద్రునికి సమానమే యైనను. నాటికి కృష్ణమాచార్యులు పిన్న వయస్కుడగును. అతడు అగ్రహారాదికములను, అధికారమును వహించుట సమంజసముగా కాన్పించదు. అందుచేత 1265–70 ప్రాంత సంవత్సరములం దీతడు జన్మించి యుండెననుట సముచితముగా నుండును.

కృష్ణమాచార్యుల జన్మస్థలము సంతూరను గ్రామము. ఈ గ్రామమును గురించి సింహగిరి వచనములందును, ప్రతాప చరిత్రయందును ప్రస్తావన

యున్నది. ఈ గ్రామము దక్షిణ భారతదేశములోని దనియును, తిరునల్వేలి జిల్లాలో కలదనియు, శ్రీ నిడదవోలు వేంపట్రావు గారు వ్రాసియున్నారు. అట్లయినచో ఈ వచనక ర్త తమిళ దేశమునకు చెందిన వాడుగా చెప్పవలసి యుండును. కాని, యిది సరిగా కాన్పించదు. సంతూరు అనుపేరునకు శాబ్దికముగా సమీపముగానున్న సంతపూరు అను గ్రామము తెలంగాణము నందలి మహబూబునగరం జిల్లాలో కలదు. ఈ గ్రామము ప్రాచీనమైనదని స్థానిక చరిత్రవలన తెలియుచున్నది. సంతపూరు ఇంటిపేరుగా గల వైష్ణవ కుటుంబములు మహబూబునగరం జిల్లాలో ఇప్పటికిని ఉన్నారు. ఇదియు నా గ్రామ ప్రాచీన స్థితినే తెలుపుచున్నది. ఇదికాక, కాకతీయులు వ్రాయించిన శాసనములు ఈ గ్రామమునకు సమీపముగానుండి, మహబూబునగరం జిల్లాలోనివే యగు బూదపురము, వడ్డెమాను (వర్ధమానపురము) అను గ్రామములందు లభించినవి. ఇవి చాల ప్రఖ్యాతమైనవి కూడ. ప్రతాప చరిత్రోదంతమునుబట్టి చూడగా, ఏబది గ్రాముల కధికారము వహించిన కృష్ణమాచార్యులు సంతూరన ప్రవేశించినట్లున్నది. అనగా తన స్వగ్రామమునకు వెడలినాడన్నహాట. అచటనే ధనములు పంచిపెట్టెనట. ఇట్టి సందర్భమున ఆంధ్రదేశములోనున్న, సమీపముగానున్న, తన గ్రామమునకు పోయినాడనుట సమంజసముగా నుండునుగాని, ఎచ్చటనో దక్షిణ భారత దేశమునకు వెళ్లియుండెననుట పొసగదు. ఇవన్నియు, సంతూరు ఆంధ్రదేశస్థ మనియు, కాకతీయ సామ్రాజ్య మందలిదే యనియు భావించుటకు సుసాధ్యముగా నున్నవి. సంతూరను గ్రామమిపుడు లేకపోవుటచే, సంతపూరు అనునుదే సంతూరు కావచ్చునని చెప్పుట సమంజసముగా నుండును. ఈ విశేషమును రూఢిపరచుటకు మఱియొక ఆధార మున్నది. సంతూరను నివసించిన కృష్ణమాచార్యులు కల్లూరను గ్రామము నిర్మించెను. ఈ కల్లూరు కూడ మహబూబునగరం జిల్లాలోనే యున్నది. ఇప్పుడది యీ పేరుతోనే వ్యవహరింపబడు చున్నవి. ఇవన్నియు పరిశీలించి చూడగా, కృష్ణమాచార్యులు నివసించిన గ్రామము సంతూరను నామాంతరము కలిగియుండిన సంతపూరనియే రూఢియగుచున్నది. ఆంధ్రభాషయందు వచన రచనము చేసిన కృష్ణమాచార్యులు, అన్యదేశీయుడు కాక ఆంధ్ర దేశవాసియే యగుచున్నాడు.

కృష్ణమాచార్యులను ప్రతాపరుద్రుడు 'కనకగిరి సీమ'లో ఏబది గ్రామముల కధికారిని చేసెనని ప్రతాప చరిత్ర తెలుపుచున్నది. కనకగిరి సీమ కాకతీయ సామ్రాజ్యమున నెచటనుండెనో తెలియరాదు. కాని, యాంధ్రదేశమున నొక

భాగమునకు కనిగిరిసీమ యను నామము ప్రఖ్యాతముగా నుద్దది. ఈ కనిగిరి సీమనే ప్రతాప చరిత్రకారుడు కనకగిరి సీమయరి వ్యవహరించి యుండును. కృష్ణమాచార్యులు, చివరన శ్రీ సంగమునకు వెడలినాడు. పరమ విష్ణుభక్తాగ్రేసరుడైన కృష్ణమాచార్యులు శ్రీరంగేశ్వరుని దర్శించి తరించుటకు వెళ్లుట ఎంతయో సముచితము.

ప్రస్తుతము పరిష్కృతమైన యీ గ్రంథమందలి కొన్ని వచనములలో కృష్ణమాచార్యుల జీవిత విశేషములు కాన్పించుచున్నవి. సంగ్రహముగా వాని నిట నుల్లేఖింతును.

సంతూరను గ్రామమున కృష్ణమాచార్యులు ఒక వైష్ణవ కుటుంబమున జన్మించెను. దుష్ట నక్షత్రమున, వ్యతీపాత యోగమున, నీతడు పుట్టియుండుట చేతను, పుట్టుక తోడనే అంధుడుగా నుండుటచేతను, తల్లిదండ్రులకీతడు ప్రీతి పాత్రుడుకాలేదు. వారీ యంధబాలుని యొకనాడు కూపమున బడవేయించిరి. కృష్ణమాలుర్యులా కూపమున బాధలనుభవించు చుండగా, నృసింహ స్వామియే కువ్వారు అనునొక సన్న్యాసి రూపమున నచటికి వచ్చెను. అతడా బాలునిమీద జాలిగొని యతనిని కాపాడెను. అతనినొక మఠమునకుంచి కొంతకాలము సంరంక్షించెను. తరువాత నతనిని సింహాచలమునకు చేర్పించెను. కొంత కాలమునకు కువ్వారెటకో వెడలిపోయెను. సింహాచల క్షేత్రమందుండగా, కృష్ణమాచార్యులపై స్వామి దయావీక్షణములు తిరిగి ప్రసరించెను. ఒక బాలుని రూపమున నృసింహ స్వామి యేతెంచి యాతనికి స్వామి తీర్థమగు క్షీరమును ప్రసాదించెను. అంధబాలుడా క్షీరమును ఉపయోగించి. యా క్షీరముతోడనే కన్నులు తుడుచుకొనెను. వెంటనే యద్భుతముగా నా బాలునికి కన్నులువచ్చి యంధత్వము మాసినది. అతడు స్వామిని భజించి తన కృతజ్ఞతను తెలుపుకొనెను. ఆ రాత్రి నృసింహస్వామి స్వప్నమున నాతనికి వరాహరూపమున సాక్షాత్కరించి తనకు చాతుర్లక్ష వాక్యాజలు గావింపుమని కోరెను. కృష్ణమాచార్యులు తన యశక్తతను వెల్లడించెను కాని, భగవదనుగ్రహమున నాతనికి కావలసిన విజ్ఞానము సంప్రాప్తించెను. అతడు ఆషాఢ శుద్ధ ద్వాదశినాడు దండెము చిటితాళంబులు పూని స్వామిని సంకీర్తన చేయుటకు ప్రారంభించెను. అప్పటికాతనికి పదునేడు సంవత్సరముల ప్రాయము.

ఇట్లు కొంతకాలము జరుగగా, నతనికి తన మేనమామ యగు శ్రీరంగాచార్యుల కుమార్తెతో వివాహము జరిగినది. ఈ వివాహమును తిలకించుటకు

సింహాద్రినాథుడు నిత్యుని రూపమున వచ్చి అలజడి కలిగెంచనట. అయినను. అతని అనుగ్రహముచే అన్నియు శాంతించెను. ఈ దంపతుల కొక కుమారుడు కలిగెను. కాని యా బాలుడెడవ యేటనే మరణించెను. భక్తుడై, వచన ములచేత నిరంతరము స్తుతిచేయు కృష్ణమాచార్యులు క్రమముగా భక్తి మార్గమును దప్పెను. లౌకిక శృంగార మాతనిని యాకర్షించెను. అతడు వేశ్యాలోలుడై మోహనాంగి యను వారకాంత యింట నుండజొచ్చెను. ఇట్లుండగా, అహోబల క్షేత్ర సమీపమున నుండిన పొతకమూరు అను గ్రామమునకు చెందిన భాగవతోత్త ములు, అహోబలేశుని భక్తులై నాట్య వినోదులైన సోదరులార్గురు; వైష్ణవ శిఖామణి యని ప్రఖ్యాతిని వహించిన కృష్ణమాచార్యులను దర్శించుటకు సింహాచలమునకు వచ్చిరి. వారాయూరిలో కృష్ణమాచార్యుల తిరుమాళిగ కొరకు వెదకుచు, మోహనాంగి యింటియందున్న కృష్ణమాచార్యుని చూచి యాతనిని గుర్తించ లేక వివరము లడిగిరి. ఆ భాగవతోత్తముడు విష్ణుమూర్తి పదునొకండవ యవతారమనియు, అతనిని దర్శింప వచ్చితిమనియు వారు విన్నవించిరి. పొతకమూరి భాగవతసోదరులు బహు ప్రఖ్యాతులు. వారు భక్తి పారవశ్యమున 'పటము పన్నించి' పాడుచుండగా, స్వామివారు స్వయముగా వేంచేసి యానందించెడి పాడని కృష్ణమాచార్యులు వినియుండెను. వారి రాక తన కొరకేయని కృష్ణమాచార్యులు తెలిసికొనెను. వెంటనే పశ్చాత్తప్తుడయ్యెను. తన మనస్సు మార్చుకొని యథాపూర్వకముగా జ్ఞానమును పొందెను. కాని తన స్వరూపమును మాత్రము వారికి తెలియనీయ లేదు. కృష్ణమాచార్యుల తిరుమాళిగ చూపింతునని వారిని తీసికొని వెడలి, తాను మరియొక మార్గమునబోయి, తలవెండ్రుకలు. మీసములు తీయించుకొని భక్తుడగు కృష్ణమాచార్యులుగా వారికి సాక్షాత్కరించెను. సంప్రదాయాను సారముగా పొతకమూరి సోదరు లాతనికి నమస్కరించిరి. కాని, తామింత దనుక చూచిన శృంగారమూర్తి యాకృతి విశేషమునే యాతని యందును కానవచ్చుటచే, భయము, భక్తి కలుగగా చెంపలు వాయించుకొని, తామొనరించిన యపచారమును క్షమించుమని ప్రార్థించిరి. వారే తన విరాగము నకు కారణమై భక్తిమార్గమునకు తిరిగి మరలించి రనియు, తానంతటి యోగ్యుడు కాడనియు కృష్ణమాచార్యులు తిరిగి విన్నవించుకొనెను. తరువాత వారు ఒకరి నొకరు సంభావించుకొనిరి. పొతకమూరి సోదరులు పటము పన్నించి నాట్యము చేసిరి. కృష్ణమాచార్యులు సంకీర్తనము చేసెను. వీరిని దర్శించిన భాగవతు లానందించిరి. వీరి యానందమును నరసింహస్వామి కూడ పంచుకొనెను.

కృష్ణమాచార్యులు సంకీర్తనముల నాలపించు చుండగా, బాలుని రూపమున స్వామి విచ్చేసి యానందముతో తాండవము చేసెను. పొతకమూరి భాగవతులు ఆ బాలుని మొదట కృష్ణమాచార్యుల కుమారుడని భావించిరి. కాని సత్యము తెలిసికొని కృష్ణమాచార్యుల మహిమ చేతనే భగవంతుడు సాక్షాత్కరించెనని భావించి యాతనికి అభివాదము చేసిరి. తళియ ప్రసాదముల నారగించి, కొంత కాలమునకు భాగవతులు స్వస్థానమునకు వెడలిరి. ఈ సందర్భమున తాను చాతుర్లక్ష సంకీర్తనములు వ్రాయవలసి యున్నదనియు, అందు లక్షయేబదివేలు కొదువ యున్నదనియును, స్వామికి విన్నవించుకొనెను. స్వామి సాక్షాత్కరించి యభయ మిచ్చెను. మిగిలిన వచనములను కూడ కృష్ణమాచార్యులు స్వామి యనుగ్రహాముతో రచించియే యుండును. ప్రతాప చరిత్రయందలి యుదంత మును బట్టి యావచనములు తామ్ర పత్రములపై చెక్కించెననియు తెలియుచున్నది. ఈ నాలుగు లక్షల వచనములలో మనకు లభించినవి యివి మాత్రమే. ఇట్టి వచనములలోని విశేషములను బట్టియు, ప్రతాప చరిత్రయందలి వృత్తాంతమును బట్టియు, నీ వైష్ణవ శిఖామణి, విష్ణుభక్తుడు సంతూరున జన్మించి, సింహాచల క్షేత్రమునను, ఓరుగంటియందును నివసించి, చివరన శ్రీరంగమునకు చేరెనని తెలియుచున్నది. చరను దశయందతడు తెలుగు దేశమునకు తిరిగి వచ్చెనో, లేక శ్రీరంగమున్ననే పరమపదించెనో సరిగా తెలియదు.

కృష్ణమాచార్యులు రచించిన యా వచనములందు, నైష్ణవుల యొక్కయు, విష్ణుభక్తి యొక్కయు ప్రాశస్త్యమును దెలుపు కొన్ని గాథలు వర్ణింపబడి యున్నవి. వీనిలో నచ్చటచ్చట అద్భుత సంఘటనలు కూడనున్నవి. అయినను, వైష్ణవులలో పరంపరగా వచ్చు కథలగుటచేత కాబోలు, కృష్ణమాచార్యులు వానిని గ్రహించెను. పాల్కురికి సోమనాథాది శివకవులును తమ గ్రనథములందు కూర్చిన కథలలో అతిమానుష ఘట్టములును, శైవసారమ్యమును తెలుపుకథలును కలవు కదా! ఇదియు నట్టిదే. విష్ణుభక్తులకు సంబంధించిన ఒకటి రెండు గాథలుదాహరింతును.

రత్నముల వ్యాపారము చేయు నొక విష్ణు భక్తుడుండెను. అతడు విష్ణువు ఆలయమును ప్రతినిత్యము దర్శించనిదే భోజనాదికములు చేయువాడుకాడు. ఒకప్పుడాతడు శైవులగు తన భావమరదులతో వ్యాపారమునకై ప్రయాణము చేయుచుండెను. అప్పుడధికముగా వర్షము కురియుచుండెను. ఈ వైష్ణవునికి

ఆలయ సందర్శనమున కవకాశము లేకపోయెను. అందుచే, అన్నోదకముల గ్రహించక ఎనిమిది దినములుపవాసము చేసెను. అతని బావమరది లాతని స్థితికి జాలిగొని, ఎటులైనను నాతనిచే భుజింపచేయ వలెనని, గుడారు కంబము నొకదానిని కొద్దిదూరమున నాటి, దానికి తిరుమణి తిరుచూర్ణము లలది, విష్ణు ప్రతిమగా భాసింపజేసిరి. బావమరదుల వలన వైష్ణవుడు అచటికి సమీపములో విష్ణుమూర్తి ప్రతిమ యున్నట్లు తెలిసికొని, దానిని దర్శించి, దండము సమర్పించి అన్నపానములను గ్రహించెను. తరువాత బావమరదులు నిజమును తెలియజెప్పి హాస్యము చేసిరి. కాని వైష్ణవుడు తత్తరపడలేదు. అది గుడారు కంబమైనచో తిరిగి తెండని యనెను. బావమరదులు దానిని పెకలింపబోయి, ప్రయత్నించి, విఫలులైరి. దానిని ఖండించబోగా నది యదృశ్యమయ్యెను. వారికప్పుడు జ్ఞానోదయమైనది. ఆ వైష్ణవుని తమ కాచార్యునిగా భావించి గౌరవించిరి. ఒకరి విశ్వాసమును పరిహసించుట సముచితము కాదను విషయమునీ కథలో కృష్ణమాచార్యులు ప్రతిపాదించెను.

(ఏక) శిలానగరమున నొక యగసాల వాడుండెను. అతడు పరమ శైవుడు. అతడు జీవయాత్ర ముగించెను. అతని భార్య యాతని శవము నలంకరించుకొని, దానిని సమాధిచేయుటకు, తానును దానితో సమాధి పొందుటకు రాజమార్గమున వెడలుచుండెను. మార్గమధ్యమున కృష్ణమాచార్యులు కనిపించగా నాయగసాల సతి గౌరవముతో ననుస్కరించెను. దీర్ఘాయుష్మంతురాలకై యుండుమని కృష్ణమాచార్యులు దీవించిరి. కాని యా వనిత జరిగిన వృత్తాంతమును చెప్పి, తాను సమాధికి వెడలుచున్నట్లును నివేదించెను. కృష్ణమాచార్యులు విచారించిరి. తాను పలికిన పలుకులు వృథ కాకూడదని, దండెయు, చిటితాళంబులు గ్రహించి విష్ణుమూర్తిని భజించెను. శవాకారమున నున్న అగసాలెవాడు దిగ్గసలేచి కూర్చుండెను. కైలాసనాథుడు కృష్ణమాచార్యుల ప్రార్థనమును,విని తిరిగి పంపించగా వచ్చితినని విన్నవించెను.

ఈ రెండు కథలయందును వైష్ణవేతరులైన శైవులను గురించి కృష్టమాచార్యులు ప్రస్తారించి యున్నాడు. కాని, యిందెక్కడను శైవ దూషణము కాని, శైవ విరోధము కాని కాన్పించదు. ఈ కథలు వైష్ణవ ప్రాశస్త్యము బోధించుచున్నవి. వైష్ణవాభిమాన మీతనికి గలదు కాని, శైవ ద్వేషము కాన్పించదు. ఇంతటి సహనశీలుడగుటచేతనే కాబోలు, శైవమతాభిమాని యగు ప్రతాపరుద్రు డీతని

చేరదీయుట, అధికారాదికములచేత సన్మానించుటయు, సంభవించినది. ఈ వచనము లందు ఇంకను ఒకటి రెండు వైష్ణవ గాథలున్నవి. అనియు పైనుదాహరించినట్టివే.

కృష్ణమాచార్యులు సింహగిరి వచనములు రచించు కాలమునకు, అనగా, క్రీ. శ. 14వ శతాబ్దినాటికి, తెలుగు భాషయందు కేవల వచన రచనము జరిగి యుండలేదు. అందుచేత వచనైక రచనమునకు కృష్ణమాచార్యులే యాద్యుడగు చున్నాడు. ఆంధ్ర వాఙ్మయమున నీతని రచనకు మంచి ప్రాచుర్యము కలిగినది. ఈతని వచన రచనను పోలిన రచనములు తరువాతి కాలమున తెలుగులో వెలు వడినవి. కేవల రచన కర్తలేకాక, చంపూకావ్య కర్తలును ఈతని ననుసరించి యుండుట ఈతని మహత్వమునే వ్యక్తము చేయును.

కృష్ణమాచార్యుల సింహగిరి వచనములలోని రచనా విశేషములను పేర్కొన వలసియున్నది. ఈ వచనములన్నియు 'దేవా' అను సంబోధనముతో ప్రారంభమగును. వచనముల యంతమందును సంబోధన ఉండును. కాని యిది అంతటను సమానముగా లేక కొద్ది భేదమును కలిగి యుండును. 'అనాథ పతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ' అను మకుట మధిక వచనములందు కలదు. 'మా యతిరామానుజముని వరము, దాతారు. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ' యనియు, 'నృష్ణ కువ్వారుస్వామీ, సింహగిరి నరహరీ', యనియు మకుటములు కొన్ని వచనములందు గలవు. ఇందు మొదటిది కృష్ణమాచార్యుల యిష్టదైవమైన సింహగిరి నాథునకు సంబంధించినది. వైష్ణవులకు పరమ భాగవతుడగు రామానుజులు భగవత్స్వరూపులు. వారు ప్రసాదించిన వరమే శ్రీ వైష్ణవ సంప్రదాయము. వైష్ణవ మతానుయాయులగు కృష్ణమాచార్యులు శ్రీ రామానుజులను స్మరించి తన భక్తిని ప్రకటించుకొని యున్నాడు. ఇది రెండవిధమగు మకుటములో కాన్పించును. ఇక మూడవది 'కృష్ణ కువ్వారు' అనునది. కువ్వారు అనువాడు కృష్ణమాచార్యుల నుద్ధరించిన వాడు. గురువు. వైష్ణవ మార్గమును చూపించి సింహాచలమునకు చేర్చినవాడు. తన వచనములందాతని పేరు చేర్చి తనకుగల కృతజ్ఞతను కృష్ణమాచార్యులు ప్రకటించుకొనెను. 'కువ్వారు' అను పదమును కుమారుడు అను పదమునకు రూపాంతరముగా నేను భావించుచున్నాను. హిందీ భాషలో కుమార్ అను మాటను 'కువార్' (వా తరువాత అనునాసిక్య ధ్వని చేర్చి) ఉచ్చరింతురు. అదియే తెలుగున కువ్వారుగా మారియుండును. కృష్ణమాచార్యుల కథనమును

బట్టి యా కువ్వారు సర్వసంగ పరిత్యాగిగాను, పరదేశీయుడు గాను కొన్పించును. బహుశ: ఉత్తరదేశమునుండి యీ ప్రాంతమున్నకు వచ్చినవాడనుటయు సాధ్యమే. తన గురువగు కువ్వారును విష్ణు స్వరూపుడుగా భావించుకొచి, అతనిపేరు తన వచనాంతములలో కొన్నిట కృష్ణమాచార్యులు చేర్చియున్నాడు.

ఈ రచయిత రచించిన 'చాతుర్లక్ష' వచనములు లభించినచో, అందలి విశేషము లన్నియు తెలియ వచ్చెడివి. ఈ యధిక సంఖ్యలో నుండిన వచనములలో అతడెన్ని విషయములను చేర్చియుండెనో ? కాని, మనకు లభించిన యీ పరిమిత సంఖ్యాన్విత వచనములలో వస్తువుకూడ పరిమితముగానే యున్నది. ఈ వచనము లందంతటను, మణిహారమున సూత్రమువలె, భక్తి యిమిడియే యున్నది. అయి నను విషయ విభాగము చేయుటకీ వచనములను నాలుగుగా విభజింప వచ్చును. 1. వైష్ణవమత సిద్ధాంత ప్రతిపాదకములు. 2. పురాణ సంబంధములు. 3. వేదాంత పరమ్ములు. 4. నీతి బోధకములు. ఈ విభాగముల నొకొక్కటియిట్లుండును.

"దేవా, శ్రీ రామానుజ సిద్ధాంతమునకు ద్వైతాంతరమే హాని. చిత్స్వరూపంబునకు కావ్యమే హాని, పదభక్తికి మోహ విలంబమే హాని. మనస్సునకు చలనమే హాని. వితత విద్యోన్నత్యమునకు స్వర కళంకమే హాని. స్వామీ, సింహగిరి నరహరీ, మీ దాసుల కాచార్య కటాక్షము లేకుండుటయే హాని. ప్రాణహాని సమయమందు భగవద్భక్తి మఱువక విష్ణు పురాణములు, హరికథలు దలంచి, పరమ పదాన కేగుమా చిత్తమా, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!"

"దేవా, విష్ణుభక్తిలేని విద్వాంసునికంటె హరి కీర్తనము సేయు నతడే కులజుండు. శ్వపచుండైన నేమి? ఏ వర్ణంబైన నేమి? ద్విజునికంటె నతడె కులజుండు. దృష్టింజూడగా విద్వజ్జన దివ్యభూషణము. సింహగిరిం దలంచిన యాతండే కులజుండు. సంధ్యాది నిత్యకర్మానుష్ఠానంబులు దప్పక నడిపిననేమి? చతుర్వేద షట్భాస్త్రములు సదివిన నేమి? మా సింహగిరి నరహరి దాసులకు దాసులెసం గాని లేదు గతి! స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!"

శ్రీ రామానుజులు ప్రతిపాదించి ప్రచారము చేసిన విష్ణుభక్తి, వర్ణాశ్ర ధర్మ రాహిత్యము, భాగవత కైంకర్యము, ఆచార్య సేవానిరతి, యను వైష్ణవ మత సూత్రములనే కృష్ణమాచార్యులు పునశ్చరణ చేసియున్నాడు.

పురాణ సంబంధియైన పవనముల కీవచనములు తమోదాహరణము లగును.

"దేవా, పెద్దతనంబునఁజేసి మిమ్ము మెప్పించెదనంటినా, జాంబవంతుండు మీ సన్నిధినే యున్నాఁడే. దేవా, బంటు తనంబు సేసి మిమ్ము మెప్పించెదనంటినా, అంజనీదేవి సుతుండు హనుమంతుండు మీ సన్నిధినే యున్నాఁడే. దేవా, తీర్థంబు లాడిమిమ్ము మెప్పించెదనంటినా, గంగా భవాని మీ యంగుష్ఠంబునం దుద్భవించి యున్నదే. దేవా, ప్రదక్షిణములు సేసి మిమ్ము మెప్పించెదనంటినా, సూర్య చంద్రాదులు మీ సన్నిధినే యున్నారే. దేవా, వేద వేద్యుండనై మిమ్ము మెప్పించెదనంటినా, బహ్మ మీనాభి కమల మందుద్భవించి యున్నాడే. దేవా, గీత ప్రబంధములచేత మిమ్ము మెప్పించెదనంటినా, కిన్నర కింపురుష గరుడ గంధర్వ సనకసనందన సనత్కుమార పరమ భాగవతులు, నారదాదులు మీ సన్నిధినే యున్నారే. దేవా, సత్యంబుల మిమ్ము మెప్పించెదనంటినా, శ్రీ మహాలక్ష్మి మీ యురమందే యున్నదే. దేవా, శాంత శమ దమాది గుణంబులచేత నోర్చి గలిగి యుండెదనంటినా, భూదేవి మీ సన్నిధినే యున్నదే. దేవా, విందులు వెట్టి మిమ్ము మెప్పించెదనంటినా, విదుర భరద్వాజ శబరి మొదలైనవారు మీ సన్నిధినే యున్నారే. దేవా, ఏకాదశీ వ్రతాదుల మిమ్ము మెప్పించెద నంటినా, రుక్మాంగదుఁడు మీ సన్నిధినే యున్నాఁడే. భక్తి వైరాగ్యంబులఁజేసి మిమ్ము మెప్పించెదనంటినా, ప్రహ్లాదుఁడు మీ సన్నిధినే యున్నాఁడే. దేవా, వాహన రూపుఁడనై భరింతునంటినా, గరుత్మంతుఁడు మీ సన్నిధినే యున్నాఁడే. దేవా, మీ పాద పద్మములు నా కన్నులఁజూచుకొని మీ ద్వారంబు కాచుక నుండెదనంటినా, ద్వారపాలకులు మీ సన్నిధినే యున్నారే. దేవా, నేనా మిమ్మునుతించఁ గల వాఁడను? ఎనుబది నాలుగులక్షల కోట్ల జీవజంతువులలో నేనొక నరజీవుండను. దేవా, మిమ్ము వేయి శిరస్సులు, రెండువేల జిహ్వాలు గల శేషాహి నుతియించి కొనియాడవలె నంతేకాక. యతిరామానుజా, సింహగిరి నరహరీ, నమోనమో నయానిధీ!"

"దేవా, శ్రీ మన్నారాయణా, పరబ్రహ్మ స్వరూపా, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా, వేదవేదాంతవేద్యా, పురాణపురుషోత్తమా, పురందర వంద్యా, దేవా, కపటనాటక సూత్రధారీ, మాయావినోదా, అగణిత మహిమావతారా, ఆశ్రితజన మందారా, సకల కల్యాణ గుణోన్నతా, సకల జగదంతర్యామీ, శ్రీమదయోధ్యాపురవరాధీశ్వరా, దశరథ రాజనందనా, కౌసల్యా గర్భ ముక్తి

ముక్తాఫలా, భరతాగ్రజా, సౌమిత్ర మిత్రా, శత్రువశీకరా, శరణాగత వజ్రపంజరా, కారుణ్యవారాన్నిధీ, భక్తిముక్తి ఫలప్రదాయకా, శంఖచక్రగిదాధరా, కోదండ దీక్షాగురూ, భక్త పరాధీనా, ఇక్ష్వాకు కులతిలకా, రాక్షసకుల సంహారా, పక్షీంద్ర వాహనా, దేవాదిదేవా, తాటకీ ప్రాణాపహారా, విశ్వామిత్ర యజ్ఞస్వరూపా, యజ్ఞ భోక్తా, సర్వవ్యాపకా, సురనికర సేవితా, అహల్యాశాప విమోచకా, పురహర చాపఖండనా, సీతాపతీ, పరశురామ బాహు పరాక్రమాప హరణా, పిత్రవాక్య పరిపాలకా, మారీచమృగ వేటకారా, త్రికూటాద్రినిలయా, కాకాసుర విదళనా, విరాధ దైత్యహరణా, సుగ్రీవానుగ్రహా, వాలినిగ్రహా, మాల్యవంత ప్రవేశా, లవణాబ్ధి గర్వాహల్ల కల్లోలా, విభీషణ స్థాపనాచార్యా, దక్షిణ సింధురాజబంధనా, దీనరక్షణా, ధూమ్రాక్ష విరూపాక్షాతికాయ మహాకాయ రావణ కుంభకర్ణాది రాక్షస కుల సంహారకా, ఇంద్రజిత్తు తలగుండు గంటా, రావణగిరి వజ్రాయుధా, పంక్తికంధర శిరఃపక్తి ఖంతనా, విభీషణ స్థాపనాచార్యా, జానకీప్రియా, పుష్పకా రూఢా, అనుజసేవితా, మైథిలీ సమేతా, ఆనందమయా, జయజయ రాఘవేశ్వరా, మాయతి రామానుజముని వరము. దాతారు. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!"

సంబోధనాత్మకమైన యీ వచనమున రామాయణగాథ సంగ్రహముగా వర్ణితమైనది. ఇట్లే మరియొక వచనమునందు శ్రీ కృష్ణావతార కథావిశేషములు సంబోధనాత్మకముగా సూచితములై యున్నవి.

వేదాంత పరమగు వచనములకు నీ వచనము చక్కని ప్రాతినిధ్యము వహించునట్టిదిగా నున్నది.

"దేవా, పరమ రహస్యకారియగు పురుషకార ప్రభున్నని దప్పు లెన్నుదురు. లౌకికు లెఱుగరు. అజ్ఞానులై రౌరవాది నరకముననుండి సంచరించుటయే దీనికి కారణము. నరహరీ, పావనుడైన యగ్నిదేవతను ముట్టినం గాలదే? ఆ యపచారము క్షమ పెట్టినంగావి పాయదు. అఖిలాండ కోటి సర్వము, సర్వేశ్వరు మాయా కల్పితమేమి చేయుదు? నిరపరాధిని. జంతువులఖిలాండ పూరితములైనవి. జరామరణ వ్యాధులచేత నక్కటా యనుచున్నవి. ఈర్ష్య తగదు. (నిర్మలా) స్పదములైన యాత్మలందు గుణావ గుణములు చింతించుట యవినీతి. సర్వభూత దయా వ్యపగత రాగద్వేష మత్సర శమ దమాది గుణము లెన్నండు గలుగునో: స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ"

కొవ్వము వచనమందున్నను, పద్యమందున్నను, నీతి బోధనము దానికి పరమార్థమని మనకావ్యక ర్తలు భావించిరి. కృష్ణమాచార్యులీ సాహిత్య సంప్ర దాయము ననుసరించి కొన్ని వచనములను నీతి ప్రధానముగా వ్రాసి యున్నాడు. ఒకటి చూడబోలును.

"దేవా, తానుగాని దేహమందు తానని దుఃఖ పడుట యవిద్యా క్లేశము. దేహాదు లందభిమానము వలన దుఃఖపడుట యస్మితా క్లేశము. విషయములఁ గోరి దుఃఖపడుట రాగక్లేశము. ఈ పంచ (?) క్లేశములఁ జిక్కినాఁడను. ఈ దుఃఖములను ద్రుంపవే, పరబ్రహ్మ (స్వరూపా!) స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ".

ప్రార్థనాన్వితమై యున్న యీ వచనము సాంసారిక సౌఖ్యములను వీడి క్లేశ రహితమైన భగవద్ధ్యానమే పరమార్థమను నీతిని బోధించుచున్నది.

సామాన్యముగా కావ్యములందును, పురాణములందును, ఫలశ్రుతి చివరన నుండును. కాని, కృష్ణమాచార్యులు రచించిన యీ వచనములందు ప్రారంభమునందే ఫలశ్రుతితో గూడిన వచనము కాన్పించు చున్నది.

"దేవా, ఇంద్రాది దేవతలు నూఱును, హిరణ్య గర్భునిన్నూఱును, కాశ్మీరగిరులు మున్నూఱును, తిలదాంచన గిరులు నన్నూఱును, పతివ్రత లేనూఱ్లును, అగ్రహారంబు లాఱునూఱ్లును, స్త్రీ మూర్తు లేడునూఱ్లును, ఉభయ సోమకు లెనిమిది నూఱ్లును, హేమస్త్రీ గర్భంబులు తొమ్మిది నూఱ్లును, కపిల ధేనువులు వేయిని, కాలచక్రంబులు లక్షయును, తులా పురుషంబులు కోటియును, కన్యకా దానంబులు పదికోట్లును, నివి యన్నియుఁగూడిన మీ దివ్య నామ సంకీర్తన మినినందులకు వేయిలో నొక్క భాగంబునకు సరిగావు. సరిగావు. ఈ సంకీర్తన ఫలం బెవరు వ్రాసిరి, యెవరు చదివిరి, యెవరు వినిరి, వారి కాయురారోగ్యైశ్వ ర్యంబులు కృపచేతువు. అటుమీదట నొకిచ్చిన వైకుంఠంబు కృపచేతువు. మాయతి రామానుజ మునివరము దాతాకు. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధి!"

గ్రంథాంతమున ఫలశ్రుతిని చెప్పుట సామాన్యపద్ధతి. కాని కృష్ణమా చార్యులు ప్రారంభమునందే యట్టిదానిని చెప్పియున్నాడు. (మనకు లభించిన ప్రతినిబట్టి) ఈ వచనము ప్రారంభమందుండుట చేతనే, యీ గ్రంథమునకు కృష్ణమాచార్య సంకీర్తన ఫలము అను పేరువచ్చినది కాబోలు.

ఇట్టీ వచనములు వేదాంతాది భావములతో కూడియున్నను, వీనియందు ప్రధానమైనది భక్తియే. దైవతాంతర, మతాంతర సాధనాంతరమున వర్జించి కేవలము వైకుంఠ వాసునేనమ్మి 'నీవే తప్పనితఃపరంబెఱుఁగ'నవి యర్చించుటయే యించలి సందేశము. సరళమైన భాష– కొన్నిచోట్ల వ్యావహారికమునకు దగ్గరగా నున్నది– ఈ సందేశమును హృదయంగమముగా నందించుటయందు మిక్కిలి సాహాయ్యకారిగా నున్నది. శైలీసారళ్యము దీనిలోని సర్వసామాన్య లక్షణము. ఈ లక్షణమాతని గ్రంథము బహుళ ప్రచారమును బొందుటకు హేతువైనది.

ఈ గ్రంథమున కృష్ణమాచార్యులు వైష్ణవ మత సంప్రదాయమునకు సంబంధించినవి, నేడు ప్రచారమున లేనివి యగు కొన్ని పదములనుపయోగించి యున్నాడు. సంచర్భమును బట్టియో, సంప్రదాయమును బట్టియో, వాని యర్థ మును మనము కనుగొన వలసియున్నది. ఈ శబ్దములు అధికముగా లేవు. అందుచేత నివి అర్థకాఠిన్యమునకు, దుష్కరాన్వయమునకు కారణములు కాలేదు. వీనిని విశేష ప్రయోగములుగా భావించవచ్చును. అవి యిట్లున్నవి.

కువ్వారు : ఈ పదము 'కృష్ణ కువ్వారు స్వామీ,' అని పెక్కు వచనాంతములందు సంబోధనముగా నుపయోగింప బడియున్నది. తన జీవితోదంతమును చెప్పిన వచనమునందు కువ్వారు అనువాని అనుగ్రహము చేతనే తాను కూపమునుండి యుద్ధరింపబడి సింహాచలమునకు వెడలినట్లు తెలిపియున్నాడు. అందుచేత నీతనిని కృష్ణమాచార్యులు తన గురువుగా భావించుకొని యుండవచ్చును. కువ్వారు అనుపదము కుమార శబ్దభవము కావచ్చును. కృష్ణకుమారు– కృష్ణ కుమారుడు– అనుడానిని కృష్ణకువ్వారు అని యీతడుపయోగించినట్లు నేనూహించు చున్నాను. నేటికిని హిందీభాషయందు కుమార్ అనుమాటను కువార్, కువర్ అన్నట్లుగా పల్కుటయు, వ్రాయుటయు నుండుటచే పై ఊహకు ఆధారమేర్పడు చున్నది.

దాతారు : 'రామానుజ మునివరము దాతారు' అని యీ పదమునకు ప్రయోగమున్నది. సంచర్భమును బట్టి వరమును ప్రసాదించినవాడు అనునర్థము వచ్చుచున్నది. ఇది తత్సమమగు దాత అను పదమునకు అర్ ప్రత్యయము (ద్రవిడమున నున్నది) చేర్చగా ఏర్పడిన రూపము కావచ్చును. వైష్ణవులు ద్రావిడ పదములను సంప్రదాయాను గతముగా నుపయోగింతురు.

ద్వారవాకిళ్లు : ద్వంద్వ సమాసముగా కాన్పించుచున్న యీ శబ్దము నిజమునను అరిసమాసమే. అయినను దీని కచ్చటచ్చట ప్రయోగమున్నది.

సమకాలీనమైన వైష్ణవమతావలంబకులు ఉపయోంగించి యుండుటనుబట్టి కాబోలు, ఈ పదము కృష్ణమాచార్యుల గ్రంథమున చోటుచేసికొన్నది.

తళియ ప్రసాదములు : ఇదియు పైసమాసము వంటిదే. ఆనాడే కాక, నేటికిని వైష్ణవ మతానుయాయులు భోజనమను నర్థమున నీ పదమును వాడు చుందురు. కృష్ణమాచార్యులు జన ప్రయోగము నుండియే దీనిని గ్రహించి యున్నాడు.

అడియని, అడియేని : ఇది ద్రవిడ శబ్దము. దీనికి పాదసేవకుడు అను నర్థము కలదు. వైష్ణవుడు తన్నుతాను అడియేని అనుకొనుట నాటికి నేటికి కలదు.

తిరువడి గళ్ళు : తిరు + అడి + కళ్ అని దీనిని విభజించ వలెను. పవిత్రమైన పాదములు అనునది దీని యర్థము. ఇదియు ద్రావిడ మూలమును కలిగినట్టిదే. గురుపాదములను పేర్కొనవలసి వచ్చినప్పుడు వైష్ణవులు తిరువడి గుళ్ళు అని వ్యవహరింతురు.

తొండడు : ఇది దాసుడు అను నరమున నుపయోగింప బడినది. ఇదియు ద్రవిడపదమే. వైష్ణవ సంప్రదాయముతో బాటు తెలుగున ప్రవేశించి యుండును. తొండరడిప్పొడి యాళ్వార్ అను ద్రావిడ వైష్ణవ భక్తుడు ప్రఖ్యాతిని వహించినాడు. (తొండర్ + అడి + పొడి + ఆళ్వార్ = వైష్ణవదాసుల పాదధూళి భక్తుడు).

పసిరిక : ఈ శబ్దమునకు పచ్చని వన్నెగలది యనునది నైఘంటి కార్థము. 'పసిరిక కాయపురుగు' అని కీటక విశేషముగా కృష్ణమాచార్యు లుపయోగించినాడు. పచ్చని వర్ణముగల ఏదేని కీటకము కావచ్చు.

సప్తహితవులు : ఇవి సప్తసంఖ్యలో నున్నవి కాబోలు. వేని నీ గ్రంథ కర్త మనస్సులో పెట్టుకొన్నాడో తెలియదు. ఏడుగడ అను జీవితాధారములు కావచ్చునేమో. సందర్భమును బట్టి యట్లే కాన్పించును.

మోదాటు :[1] దీనికి నైఘంటి కార్థము మృగ్యము. 'భక్తి చిత్తమునఁజేర్చి గ్రక్కున మోదాటె' అనునది కృష్ణమాచార్యుల యుపయోగము. ఈ ప్రయోగ మును బట్టి చూడగా నీ పదకుమునకు 'ముక్తిచెందు' అను నర్థము వచ్చుచున్నది.

---

[1] మొగదాటు = మోదాటు; మొగము = మోము వలె.

అఘాయిత్యము[1]: ఇది అఘ శబ్దమునుండి వచ్చియుండును. అఘాయిత్యమను రూపము నిఘంటువులంచు కాన్పించదు. ప్రామాణికమైన కవి ప్రయోగము లేదు. కాని జనవ్యవహారమునందీ మాటకు సాహసముతో కూడిన పనియను నర్థము కలదు. 'నేను పిన్ననాడు చేసిన యఘాయిత్యము చెప్పుచున్నాడను.' అని కృష్ణమాచార్యులు ఉపయోగించెను. ఇది పైన చెప్పిన వ్యావహారికార్థమునకే ఉపయుక్తమైనట్లు కాన్పించును.

ఇట్టి విశిష్ట ప్రయోగములు, కొన్ని వైష్ణవ సంప్రదాయమును బట్టియు, మఱికొన్ని నాటి వ్యవహారమును బట్టియు, నీ గ్రంథమున ప్రవేశించి యుండును.

తెలుగు భాషలో షచనైక రచన చేయుటలో ప్రథముడైన కృష్ణమాచార్యుల ప్రభావము అతని తరువాతి ఆంధ్ర రచయితలపై స్పష్టముగా కాన్పించుచున్నది. రచనా పద్ధతియందును, భావమునందును, సంప్రదాయము నందును ఈ ప్రభావ మితర రచయితలపై నున్నది. స్తుతివచనములు ప్రాయుట యందీతడే అగ్రగామి యగుట వలన నీసంప్రదాయమును పాటించి రచనలు చేసిన శ్రీ వేంకటేశ్వర వచనములు, శతకోప విన్నపములు, కాశికాధీశ్వర వచనములు మొదలగు వాని రచయితలందరును నీతని యనుయాయులే. కేవలము వచనైన రచయితలనే కాక చంపూ కావ్యకర్తలనుగూడ ప్రభావితులను జేసిన యీతని రచనా పద్ధతి విశేషముగా ప్రాముఖ్యమును వహించుచున్నది. పోతనగారి యీ వచనము కృష్ణమాచార్యుల వచనములకెంత సన్నిహితముగా ననుసరించుచున్నదో పరిశీలించిదగి యున్నది.

"దేవా, సకల పురుషాంతర్యామీ, రూపత్వంబు వలనఁ బరమ పురుషుండ వయ్యెను, నపరిచ్ఛిన్నత్వంబు వలన భూతవాసుండ వయ్యెను, భూతమయత్వంబు వలన భూతశబ్ద వాచ్యుండవయ్యెను, జ్ఞానవిజ్ఞాన పూర్ణత్వంబు గలిగి నిర్గుణత్వ నిర్వికారత్వంబు వలన బ్రహ్మంబవయ్యెను, ప్రకృతి ప్రవర్తకత్వంబు వలన ననంతశక్తివై యప్రాకృతుండ వయ్యెను; గాలచక్ర ప్రవర్తకంబు వలనఁ గాలుండవయ్యెను, గాలశక్తి సమాశ్రయత్వంబు వలనఁ గాల నాభుండవయ్యెను; సృష్టిజీవన సంహారాది ధారకత్వంబు వలనఁ గాలాయవ సాక్షివయ్యెను నొప్పు నీకు ననుస్కరించెదము. (భాగవతము- దశమ- పూర్వ- 680)

---

[1]అఘాయత్వము = పాపము చేయుటకు సిద్ధపడుట.

మొదట సంబోధనము, తరువాత మహిమాభివర్ణనము, చివరన శరణాగతి లేక నమస్కారము- ఇదే క్రమమిచటను పాటింపబడియున్నది. కృష్ణమాచార్యుల వలె పోతనామాత్యుడును విష్ణుభక్తుడు వైరాగ్య భావము కలవాడును నగుటవలన, తనకు పూర్వుడైన కృష్ణమాచార్యుల ననుసరించెననుటలో సందేహము లేదు. సమాన గుణములు కలిగిన యీతడనుసరణీయుడు కూడ.

తాళ్లపాక పెద తిరుమలాచార్యులు కృష్ణమాచార్యుల రచనా పద్ధతిని, సంప్రదాయమును పరిపూర్ణముగా ననుసరించె ననుటకు అతడు రచించి శ్రీ వేంకటేశ్వర వచనములే సాక్ష్యములు. పెద తిరుమలయ్య రచించిన కొన్ని వచనములు సింహగిరి వచనములకు బింబప్రతిబింబ భావము పహించునంత దగ్గరగా నున్నవి. ఈ వచన ముదాహరణీయము.

"శ్రీ జనార్దనా, శ్రీ భూనీళాసమేతా, శంఖచక్ర గదాఖడ్గ శార్ఙాయుధ ధరా, శ్రీ కౌస్తుభమణి శ్రీ వత్సశోభిత వక్షా, పీతాంబర ధరా, మణి కిరీట మకరకుండలా భరణా, వైజయంతీ వనమాలా భరణా, పుండరీకాక్షా, అనేక బాహుదండ శిరః పాణి పాదోరు జంఘావయవా, విశ్వరూపా, అనంతగరుడ విష్వక్సేనాది నాయకా, సనకసనందన సనత్కుమార సకత్సుజాత సల్లాపా, నారద గానప్రియా, నీలమేఘ శ్యామా, చతురానన జనన నాభీసరోజా, గంగానదీ కారణ శ్రీ పాదపద్మా, భక్త వత్సలా, వేదోద్ధారకా, వైకుంఠ పురవరాధీశ్వరా, అసుర శిక్షకా, అమరరక్షకా, జగన్నివాసా, జయజయ నీకుననంత నమస్కారంబులు సేసెద. అవధారు, శ్రీ వేంకటేశ్వరా!" (శ్రీ వేంకటేశ్వర వచనములు- 22వ వచనము)

కృష్ణమాచార్యులు రచించిన 'దేవా, శ్రీమన్నారాయణా, పరబ్రహ్మ స్వరూపా, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా' అను వచనమున కీవచనము ప్రతిబింబముగా నున్నది.

తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనములందును కృష్ణమాచార్యులుపయోగించిన భావములు స్పష్టముగా కాన్పించుచున్నవి. ఇవి తులనాత్మకముగా పరిశీంచదగినవి.

"శ్రీ వైష్ణవులే పరమ సాధకులు. శ్రీ వైష్ణవులే బ్రాహ్మణులు. హరి భక్తిలేని విద్వాంసుని కంటెను, హరి కీర్తనము సేయు నతడె కులజుండు. శ్వపచుండైన నేమి? వీవర్ణంబైన నేమి? ద్విజుని కంటె నాతడె కులజుండు. దృష్టిం జూడగా విద్వజ్జన దివ్యభూషము. సీంహగిరిం దలంచిన నాతండె కులజుండు..."

ఈ భావములు అన్నమాచార్యుల పదములందిట్లు ప్రతిఫలించినవి.

అణురేణు పరిపూర్ణుడైన శ్రీవల్లభుని
పుణుతించువారువో బ్రాహ్మణులు
కొంచెమును ఘనము గను గొననేల హరిడలచు
పంచమహా పాతకుడె బ్రాహ్మణోత్తముడు.

వేదములు చదివియును విముఖుడై హరి కథల
నాదరించని సోమయాజికంటె
ఏదియును లేని కులహీనుడైనను విష్ణు
పాదసేవకుడువో బ్రాహ్మణోత్తముడు॥

పరమగు వేదాంత పఠన దొరకియు సదా
హరిడలచలేని సన్న్యాసి కంటె
మరిగి పసురము దినెడి మాలయైనను వాడె
పరమాత్ముగోలిచినను బ్రాహ్మణోత్తముడు.॥

ఇది వరకు నుదాహృతమైన 'దేవా, పెద్ద తనంబు చేసి మిమ్ము మెప్పించె దనంటినా, జాంబవంతుండు మీ సన్నిధినేయున్నాడే, అను వచనము నందలి భావమీ పదమున నెట్లు ప్రతిబింబించినదియో గమనించదగి యున్నది.

"రామరామ కృష్ణ రాజీన లోచన నీకు
ధీమువంటి బంటన నేతేజమునాది॥

వారిధి డాటి మెప్పించ వాయుజుడనే గాను
సారెజవ్వల మెప్పించ శబరినే గాను
బిరాన సీతనిచ్చి మెప్పించ జనకుండగాను
యేరీతి మెప్పింతు? నన్ను నెట్లుగాచేనో"

ఘనముగ మోచి మెప్పించ గరుడుండనే గాను
కొనగాను సుఖమీయ గోపికంగాను
వినుతించి మెప్పించవేయినోళ్ల భోగిగాను
నవ్వుచుబాడి మెప్పించ నారదుడగాను
అవ్వలి బ్రాణమీయ జటాయువుంగాను॥

అసంఖ్యాక వచనములు వ్రాసి ఆంధ్ర దేశమున విష్ణు భక్తిని వ్యాపింప జేసిన కృష్ణమాచార్యులు తరువాతి రచయితలను ప్రభావితులను చేయుటలో వింత లేదు. ఈ ఉదాహరణములన్నియు, కృష్ణమాచార్యుల యాధిక్యమును తరువాతి వారంగీకరించిరనియును, తన కాలమునను, అనంతర కాలమునను, ఈతనికి, ఈతని రచనలకు విశేష ప్రాచుర్యము, ప్రజాదరము లభించియుండెననియు చాటిచెప్పుచున్నవి.

'సింహగి నరహరి వచనములు' అను పేరుతో నొక తాళ-పత్ర గ్రంథము పదనొకండు పత్రములు కలది-*Govt. Oriental Manuscript Libraray Madras.* లో నున్నట్లు క్యాటలాగు వలన తెలియుచున్నది. దాని కొరకై నేనచ్చట వెదకితిని. కాని దానిని తిరుపతిలోని ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాల యమునకు తరలించినట్లు తెలిసినది. అచట దానిని గురించి కనుగొనగా, నది యచటికి చేరలేదనియే తెలియవచ్చినది. ఇప్పుడది యెచటను కాన్పించదు. దానిలోని ఒక వచనము *Descriptive Catalogue* లో ఉదాహరింపబడియున్నది. అది యిట్లున్నది.

"దేవా, ఏడు రామాయణంబులు, పదునెనిమిది పురాణంబులు, ద్వాదశ స్కంధంబులు, భగవద్గీతలు, సహస్రనామంబులు, మొదలయినవి చదివిరేమి, వినిరేమి, వ్రాసిరేమి, (మీ) సంకీర్తనకు వెయ్యవ పాలింటికి సరిరావు. కడమ సంకీర్తన అనేకసార్లు విన్నారు. ఇందుకు తప్పదు. మీశంఖ చక్రంబుల యూన. మీపాద పద్మంబులాన. నారాయణ నారాయణ యను మంత్రంబనిరేమి, చూది కొండల మీద వట బీజమాత్ర మగ్నిహోత్రుడు ప్రవేశించిన దగ్ధంబై పోదా! (అట్లే పాపము నశించును) శ్రీ వైష్ణవునే బ్రాహ్మణులు శ్రీ వైష్ణవులే యిహపర సాధకులు అదియెట్లన్నను,

శ్వపచోపి మహీపాల విష్ణు భక్తో ద్విజాధికః।
విష్ణుభక్తి విహీనస్తు యతిశ్చాశ్వపచాధమఃII

అనెడు వాక్యంబు లీశ్వరుడానతిచ్చిన వాడుగాన మీ దాసులకుగుల గోత్రంబు లెన్న నేమిటికి ? మాయతి రామానుజముని వరము దాతారు. అనాథపతియైన స్వామీ, సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ !"

ఇదే వచనమును శ్రీ నిడదవోలు వేంకటరావుగారు తమ 'ఆంధ్ర వచన వాఙ్మయ'మను గ్రంథమున నుదాహరించిరి.

ఇక, ప్రస్తుతము ప్రచురితమగుచున్న గ్రంథము తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయమునందలిది. ఇది అరువది యొకటి తాళ పత్రములందున్న గ్రంథము. దీని క్యాటలాగు సంఖ్య డి. 809 ఎం. 444. క్యాటలాగులో దీని విష్ణు నామ సంకీర్తన ఫలము అని వ్రాసిరి. మనకు లభించినంతలో నీ ప్రతియే యొక స్వరూపముతో నున్నది. దీనిని నళనామ సంవత్సర చైత్రశు॥౧ భానువారము నాడు రామయ్య యను వ్రాయసగాడు వ్రాసినట్లుగా అందు చెప్పబడియున్నది. ఇది క్రీ.శ. 24వ మార్చి 1734 తేది యగుచున్నది. అనగా నీ ప్రతి రెండు వందల సంవత్సరముల కన్నను పూర్వపుదన్న మాట.

మనకు లభించిన యీ యేకైక ప్రతిలో అచ్చటచ్చట వ్రాత తప్పులున్నను భావమునకు లోపము కలుగునంతగా లేవు. పదములు పోయిన కొన్నిచోటులందు సముచిత పదములను చేర్చి, పూరించి, ( ) సంకేతముతో వానిని సూచించితిని. కొన్నిచోట్ల శబ్దములుండియు నన్వయము కాకుండినచో [ ] సంకేతమును చేర్చితిని. కొన్ని పదములు రూపాంతరములను బొంది గుర్తించలేనంతటి మార్పును చెందినవి. వానికి సన్నిహితమైన రూపములను గుర్తించి, వ్రాత ప్రతియందలి రూపములను అధోజ్ఞాపికలో చేర్చితిని. సంస్కృత వాక్యములను కూడ విజ్ఞుల సాయముతో పరిష్కరించి యిందు చేర్చితిని. ఇంకను లోపములుండవచ్చును. అయినను పండితులీ గ్రంథమును సమాదరించిరి. మొదటి ప్రచురణ జరిగిన కొద్ది సంవత్సరములలోనే ప్రతులన్నియు చెల్లిపోయెను.

కృష్ణమాచార్యుల యీ గ్రంథము ఆంధ్ర రచయితల సంఘము హైదరాబాదు వారు వహించిన ముద్రణ భావము వలన 1968 సంవత్సరములో ప్రథమముగా వెలుగు చూచినది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి ప్రోత్సాహము వలన అది ఆనాడు సాధ్యమైనది. గడచిన కొన్ని సంవత్సరముల నుండి దీనిని పునర్ముద్రించవలసిన అవసరమేర్పడినను, అది సాధ్యముకాలేదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు చూపించిన శ్రద్ధాసక్తుల కారణముగా ఇది యీనాటికి ఈ స్వరూపముతో తిరిగి వెలువడుచున్నది. ఆ సంస్థ వారికి, అందును, కార్యదర్శియైన డా. ఇరివెంటి కృష్ణమూర్తిగారికి నేనెంతయు కృతజ్ఞుడను. పూర్వము వలెనే ఈ గ్రంథమును సాహిత్యాభిమానులు ఆదరింతురని నా విశ్వాసము.

విజ్ఞానపురి–హైదరాబాదు.
1–1–81.

ఎం. కులశేఖరరావు.

శ్రీ
సింహగిరి వచనములు

1

దేవా, ఇంద్రాది దేవతలు[1] నూఱును, హిరణ్యగర్భ లిన్నూఱును, కాశ్మీర గిరులు[2] మున్నూఱును, తిలదాంచనగిరులు ననూఱును, పతివ్రత లేనూఱ్ఱును, అగ్రహారంబు లాఱునూఱ్ఱును, స్త్రీమూర్తి లేడునూఱ్ఱును, నుభయస్తోమకు లెనిమిదినూఱ్ఱును, హేమస్త్రీ గర్భంబులు తొమ్మిదినూఱ్ఱును, కపిలధేనువ్రతు వేయినీ; కాలచక్రంబులు లక్షయును, తులాపురుషంబులు కోటియును, కన్యకా దానంబులు పదికోట్లును, నివి యన్నియుఁగూడిన మీ దివ్యనామ సంకీర్తన వినినందులకు వేయిలో నొక్క[3]భాగంబునకు సరిగావు, సరిగావు. ఈ సంకీర్తన ఫలం బెవరు వ్రాసిరి, యెవరు చదివిరి, యెవరు వినిరి, వారి కాయురారోగ్యైశ్వర్యంబులు కృపచేతువు. అటుమీదట నాకిచ్చిన వైకుంఠంబు కృపచేతువు. మాయతి రామానుజముని వరము. దాతారు. అనాథపతీ, స్వామీ, సింహగిరి వరహరీ, నమోనమో దయానిధీ.

2

దేవా, వేయి పుణ్యంబులు సేసి నరుండై జన్మించును. దేవా, రెండు వేల పాపంబులుచేసి స్త్రీయై జన్మించును. దేవా, మూడువేల పాపంబులుసేసి యంగడి వేశ్యయై జన్మించును. దేవా, నాలుగువేల పాపంబులుసేసి యొకరింటి దాసియై జన్మించును. దేవా, అయిదువేలు పాపంబులుసేసి యాడుచు పాడుచు నగ్నిలో దుమికెడు కన్యయై జన్మించును. దేవా, ఏడువేలు పాపంబులుసేసి మతచోరుండై జన్మించును. దేవా, ఎనిమిదివేల పాపంబులుసేసి నట్టడవిలో చారపులియై జన్మించును. దేవా, తొమ్మిదివేల పాపంబులుసేసి చోరుండై

---

[1]ధేనంబులు, అని పాఠము. [2]కాస్మిన్నగిరులు, అని పాఠము.

[3]వేయిన్నొక్క, అని పాఠము.

జన్మించి తలగొట్టఁబడును. దేవా, పదిపేల పాపంబులుచేసి పంచాంగముచెప్పెడు బ్రాహ్మణుండై జన్మించును. దేవా, పదునొకండుపేల పాపంబులుచేసి గురు ద్రోహియై, యంధుడై జన్మించును. దేవా, పండ్రెండుపేలు పుణ్యంబులుచేసి, శ్రీమద్భాగవతులై, శ్రీవైష్ణవులై జన్మింతురు. దేవా, ఇది కృష్ణమాచార్యులు చెప్పిన సంకీర్తన ఫలంబు. ఇందుకుఁ దప్పదు. మా యతి రామానుజ ముని వరము. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

3

దేవా, మధ్యాహ్నకాలంబున జన్మించిన మనుజుండు కడు దుష్టుండై జన్మించును. దేవా, అస్తమానంబున జన్మించిన మనుజుండు క్షీణాయుష్కుండగును.[1] దేవా, తదుత్తరంబున జన్మించిన మనుజుండు సూతంపురోగియగును. దేవా, ఆ పిండంబున నొక్కొక్క పాపం బొక్కొక్క వ్యాధిగా సంక్రమించును. దేవా, పూర్వజన్మంబున గృహముల కగ్ని సంధించిన మనుజుండు, వెనుకటి జన్మంబున కుష్ఠరోగియై జన్మించును. దేవా, జననీజనకుల కన్నంబిడని మనుజుండు వెనుకటి జన్మంబున గూబయై జన్మించును. దేవా, ఘనముగా గోవుల సంపాదించి, వానికి నీళ్లును, మేపును పకామర్శింపక యున్న మనుజుండు వెనుకటి జన్మంబున[2] ఫిరంగి వ్యాధివాఁడై జన్మించును. దేవా, ఘనమైన రొక్కంబు సంపాదించి తాను భుజింపక, యొక్కరికి దానధర్మంబు, పరోపకారము సేయకుండిన యతండు, చచ్చి, బ్రహ్మరాక్షసియై, యా ధనంబునకుఁ గావలి కాయుచుండును. దేవా, కూపంబుల బడవేసిన మనుజుండు వెనుకటి జన్మంబున భూతమై జన్మించును. దేవా, చాడి చెప్పిన మనుజుండు వెనుకటి జన్మంబున దానభ్రష్టుండగును. దేవా, తగవున కూర్చుండి పక్షపాతములాడిన మనుజుండు వెనుకటి జన్మంబున బల్లియై జన్మించును. దేవా, ధాన్యంబుమీద కడుతత్పరత్వముండెనేని వెనుకటిజన్మంబున శోణకంబై[3] జన్మించును. దేవా, వావివరుస

---

[1]సయుష్య శషనస్థడు – అన్నట్లుగా నున్నది.

[2]ఒకవ్యాధి అను నర్థమున నిట నుపయోగింపబడినది. నైఘంటికార్థము మృగ్యము.

[3]శోణకమనగా వృక్షవిశేషము – ఈ అర్థము పొసగదు. శోణకము = ఋక్షము – వాచస్పత్యము.

నెఱిఁగి యెఱుఁగక నడచిన మనుజుండు, వెనుకటి జన్మంబున వారకాంతయై జన్మించును. దేవా, తనపురుషుండు దైవంబని యెఱిఁగి, యెఱుంగక యెదుఱు మాటలాడిన కాంత వెనుకటి జన్మంబున గ్రామసూకరంబై జన్మించును. దేవా, హరికీర్తన మరోచకంబని, పరదైవతము కీర్తనము వినిన మనుజుండు వెనుకటి జన్మంబున చెవిటివాఁడై జన్మించును. వివాహంబులు చెఱిచిన మనుజుండు వెనుకటిజన్మంబున సంతానంబుఁ (బొంద) లేకపోవును. దేవా, కులమున నేనే ఘనుండనని గర్వించిన మనుజుండు వెనుకటి జన్మంబున కులహీనుండై జన్మించును. దేవా, రణంబున నేనే పరాక్రమశాలినని గర్వించిన మనుజుండు వెనుకటి జన్మంబున వైశ్యుండై జన్మించును. దేవా, చదువుల నేనే ఘనుండనని గర్వించిన మనుజుండు వెనుకటిజన్మంబున మతిహీనుండై జన్మించును. దేవా, రణమందు పారివచ్చిన మనుజుండు వెనుకటి జన్మంబున పిశాచంబై జన్మించును. దేవా, రణముపొడిచిన మనుజుండు వెనుకటిజన్మంబున రాజై జన్మించును. దేవా, రణమందు తన్నెలిన రాజుకొఱకై చచ్చినమనుజుండు వెనుకటి జన్మంబున నాఁజు కడుపుననే పుట్టి యా పట్టణంబేలును. దేవా, షోడశమహాదానంబులు హరికి పుణ్యంబని చేసిన మనుజుండు వెనుకటి జన్మంబున మోక్షమేపొందును. దేవా, తనకు పుణ్యంబని చేసిన మనుజుండు వెనుకటి జన్మంబుల మాయల, నింద్ర మాయల (జాలంబుల) పదునారింటికి గురియై ముక్తికిం దెరువు చూడనేరడు. దేవా, మూలమంత్రంబునఁ చూలిన (మనుజుండు) తైలమందు, వటపిటశాస్త్రమం దణురేణువుపాటి యగ్ని సంధించిన చందంబగును. దేవా, శ్రీవైష్ణవులే బ్రాహ్మ ణులు, శ్రీవైష్ణవులే పర[మ]సాధకులు. శ్రీవైష్ణవులే శోభిత శుభదాయకులు. వీరి[మీ]కులగోత్రం చెన్న నేమిటికి? మీ దాస్యంచె కారణంబు! మీ దాస్యంబె వివాహంబు! శ్రీకృష్ణకు వ్యాచస్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

దేవా, తనువులు మాయ, తలపోసి తలపోసి చెప్పెదనంటినా, కఱకఱల మోహమిది. ఆశల పాషాణంబిది. అతుకుల జల్లెడ యిది! తన బ్రతుకుకొఱకు పోరాడ పోరాడి యెరులం జెఱచెడు దుర్గంధపు డొంకయిది. నీరుబుగ్గ. ఱూఁట చెలమ. తూంట్లబాన. తొడరి దుర్గంధమునఁ బొలు(చు)ను. మాటలేకాని మఱి యెందుకుఁ బనలేదు, నోఁటను ముఱికి. దంతంబులఁ బూఁచి, నాశికంబున

ఱేళ్ళ.[1] నయనంబుల పీళ్ళ.[2] చెవిలోని గుల్మ.[3] చెట్టల కొంప. మూట గట్టుకొన్న మలమూత్రముల తిత్తి. చీము నెత్తుట జడిపురుగుల జలదారి. చిచ్చుటిరోత. పైత్యపు గోళ. పైగల పంచారంబిది. తోలు గప్పిన డోలు సుమ్మిది. నమ్మిక లేదు! నమ్మిక లేదు! ఇది నాటకములాడెడు బూటకముల బొమ్మ. అమ్మమ్మా! ఈ బొమ్మ యుత్తమ (గుణము) లెంచి చూచెవనంటినా, కామియై, పామై, గ్రామ సూకరమై, చండ్రపిల్లియై, పిల్లినోట యెలుకయై, ఱేతయై, (?) ఱేతలోని క్రిమానై, కత్తికోతలంబడి చచ్చిచచ్చి, పుట్టిపుట్టి, యూగయై, దోమయై, యెగిరెడు పక్షియై, యనేక జీవజంతువుల యోనియందు బుట్టి, బండై, లండై, లండు పనరంబై, యూలోన మీనై, క్రిమానిమీది మర్కటంబై, వెక్కసంపు డేగయై, డేగకాలి తొండయై, గండభేరుండ గజసింహ శరభ శార్దూలంబులై, రాగియై, కంచై, యినుమై, యుక్కునై, పులినోటి రాయియై, చకచకలుగాను, వక వకలుగాను, చక్కళ్ళంబడి, చక్కని కోటయై, గుడి గోపురంబై, కొత్తళంబై, కారమై, వికారమై, మధువై, చేదై, యతిమధురంబై, యలసి సొలసి యంగడి సరుకై, యీవెనుక శోణకంబై జన్మించును. దేవా, యదియు విడుపై నరుండు జన్మించును. అప్పప్ప! ఇంటో యంటో యనుచు తప్పించుకపోను సందులేక, యేనుబది నాలుగులక్షల కోట్ల జీవజంతువుల బోనులోదగిలి, గంగలో నోడ పగిలినట్లు, మహా పాతకంబునం బ(ద)గిలి, కుమ్మరి సానవలె దిమ్మదిరుగుచు, మునుంగుచు, లేచుచు నీవిధంబై యున్నది. హరీ, నాథా, నన్నుకావుమీ! ఈ దేహం బనెడు లంకపై దండుదిగి; చిత్తమనెడు నింద్రజిత్తుపై రణించి, (రావణునిపై రణించి) దుర్బుద్ధులనెడు దుర్మార్గపు రాక్షసుల హతముచేసి, యాశలనెడు రాక్షసుల పేరడంచి, మమత మండోదరినిట్టి దాసిగానేలి, యాచార్యుండనెడు హనుమంతునిం బంపి, యీలంక జొచ్చి, వధించి, జీవుండనెడు సీతనుదెచ్చి మీ పాదారవిందముల భక్తికిహత్తించి దరిజేర్చుమీ! యతిరామానుజముని వరము. దాతారు. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

1, 2, 3 ఈ మాటలు మాలిన్యము అనునర్థమును సూచించినను నైఘంటికార్థము మృగ్యము.

5

దేవా, పెద్దతనంబు నేసి మిమ్ము మెప్పించెదనంటినా, జాంబవంతుండు మీ సన్నిధినే యున్నాఁడే. దేవా, బుద్ధిని నే మెప్పించెద నంటినా, విభీషణుండు మీ సన్నిధినే యున్నాఁడే. దేవా, బంటుదనంబు నేసి మెప్పించెదనంటినా, యంజనాసుతుండు హనుమంతుండు మీ సన్నిధినే యున్నాఁడే. దేవా, తీర్థంబు లాడి మిమ్ము మెప్పించెదనంటినా, గంగాభవాని మీ యంగుష్ఠంబునందే యుద్భవించి యున్నదే. దేవా, ప్రదక్షిణలుచేసి మిమ్ము మెప్పించెదనంటినా, సూర్యచంద్రాదులు మీ సన్నిధినే యున్నారే. దేవా, వేదవేద్యుండనై మిమ్ము మెప్పించెదనంటినా, బ్రహ్మ మీ నాభికమలమునం దుద్భవించి యున్నాఁడే. దేవా, గీత ప్రబంధముల చేత మిమ్ము మెప్పించెదనంటినా, కిన్నర కింపురుష గరుడ గంధర్వ సనకసనందన సనత్కుమార పరమభాగవతులు, నారదాదులు, మీసన్నిధినే యున్నారే. దేవా, సత్యంబుల మిమ్ము మెప్పించెదనంటినా, శ్రీమహాలక్ష్మి మీయురమందే యున్నదే. దేవా, శాంత శమదమాది గుణంబులచేత నోప్పగలిగి యుండెద నంటినా, భూదేవి మీసన్నిధినే యున్నదే. దేవా, విందులు వెట్టి మిమ్ము మెప్పించెద నంటినా, విదుర భరద్వాజులు, శబరి మీ సన్నిధినే యున్నవారే. దేవా, ఏకాదశీవ్రతాదుల మిమ్ము మెప్పించెదనంటినా, చక్రాంగదుఁడు మీసన్నిధినే యున్నవాఁడే. దేవా, భక్తివైరాగ్యంబులఁ జేసి మిమ్ము మెప్పించెద నంటినా, ప్రహ్లాదుఁడు మీసన్నిధినే యున్నవాఁడే. దేవా, వాహనరూపుండనై భరింతునంటినా, గరుత్మంతుండు మీసన్నిధినే యున్నాఁడే. దేవా, మీ పాద పద్మంబులు నాకన్నులఁ జూచుకొని, మీద్వారంబు గాచుక యుండెదనంటినా, ద్వారపాలకులు మీసన్నిధినే యున్నారే. దేవా, నేనా మిమ్ము నుతించగలవాఁడను? ఎనుబదినాలుగులక్షల కోట్ల జీవ జంతువులలో నైనొక నరజీవుండనే! దేవా! మిమ్ము వేయిశిరస్సులు, రెండువేల జిహ్వాలుగల శేషాహి నుతియించి కొనియాడవలె నంతేగాక! యతిరామానుజా, అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

6

దేవా, పరమపదవాసా! మీ నాభి కమలంబున నాది భీకర నారాయణ బ్రహ్మకు కశ్యపబ్రహ్మ జన్మించెనే. దేవా, ఆ కశ్యపబ్రహ్మకు సూర్యుండు

జన్మించెనే. దేవా, ఆ సూర్యునకు రఘువు జన్మించెనే. దేవా, ఆ రఘువునకుఁ గాకుత్సుండు జన్మించెనే. ఆ కాకుత్సునకు మరీచి జన్మించెనే. దేవా, ఆమరీచికి విశ్వామావు జన్మించెనే. దేవా, ఆ విశ్వామావునకు వికుక్షి జన్మించెనే. దేవా, ఆ వికుక్షికి కుక్షి జన్మించెనే. దేవా, ఆ కుక్షికి భానుండు జన్మించెనే. దేవా, ఆ భానునకు ననూయుండు జన్మించెనే. దేవా, ఆ యనూయునకు త్రిశంకుండు జన్మించెనే. దేవా, ఆ త్రిశంకునకు హరిశ్చంద్రుండు జన్మించెనే. దేవా, ఆ హరిశ్చంద్రునకు లోహితుండు జన్మించెనే. దేవా, ఆ లోహితునకు సుదంతుండు(తి)జన్మించెనే. దేవా, ఆ సుదంతు(తి)నకు దూర్వాసుండు జన్మించెనే. దేవా, ఆ దూర్వాసునకు విదురుండు జన్మించెనే. దేవా, ఆ విదురునకు చదురుండు జన్మించెనే. దేవా, ఆ చదురునకు దిలీపుండు, నాతనికి నజుండు జన్మించిరే. దేవా, ఆ యజునకు దశరథుండు జన్మించెనే. దేవా, ఆ దశరథునకు రఘునాయకులు జన్మించెనే. దేవా, ఆ రఘునాయకులకుఁ గుశలవులు జన్మించిరే. దేవా, ఆ కుశలవులకుఁ గుంచభోజుఁడు జన్మించెనే. దేవా, ఆ కుంచభోజునకు శ్రీగోపాలుండు జన్మించెనే. దేవా, శ్రీగోపాలునకు నందగోపాలుఁడు జన్మించెనే. దేవా, ఆ నందగోపాలునకు వసుదేవుండు జన్మించెనే. దేవా, ఆ వసుదేవునకు శ్రీకృష్ణుండు జన్మించెనే. దేవా, శ్రీకృష్ణునకు మన్మథుండు జన్మించెనే. ఆ మన్మథునకు ననిరుద్ధుండు జన్మించెనే. దేవా, ఆ యనిరుద్ధునకు వ్రతముని జన్మించెనే. దేవా, వ్రతమునికి నీలోకముననుండు ప్రజలు జన్మించిరే. దేవా, ఈ సంకీర్తన వినువారలకు వైకుంఠపదవులిచ్చి రక్షింపవే. శ్రీకృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

7

దేవా, శ్రీమన్నారాయణా, పరబ్రహ్మ స్వరూపా, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా, వేదవేదాంతవేద్యా, పురాణ పురుషోత్తమా, పురందర వంద్యా, కపట నాటక సూత్రధారీ, మాయావినోదా, అగణిత మహిమావతారా, సకల కల్యాణ గుణోన్నతా, సకల జగదంతర్యామీ, ఆశ్రిత కల్పభూజా, శ్రీమదయోధ్యాపుర వరాధీశ్వరా, దశరథరాజనందనా, కౌసల్యా గర్భ రత్నాకరా, (కౌసల్యారత్న గర్భాకరా), సోమ భువనతాగ్రజా, (?) సౌమిత్రమిత్రా, శత్రుఘ్న వశీకరా, శరణాగత వజ్రపంజరా, కారుణ్య వారాన్నిధీ, భక్తి ముక్తి ఫలప్రదాయకా, శంఖ

చక్ర గదాధరా, కోదండ దీక్షాగురూ, తాటకా సేవితా, భక్తపరాధీనా, ఇక్ష్వాకు కులతిలకా, పక్షీంద్ర వాహనా, దేవాదిదేవా, తాటక ప్రాణాపహారా, విశ్వామిత్ర యజ్ఞ పరిపాలకా, యజ్ఞకర్తా, యజ్ఞస్వరూపా, యజ్ఞభోక్తా, 'సర్వమ్ విష్ణుమయమ్' జగత్తును ప్రతినికరపరివేష్టితా, పురహర చాపఖండనా, సీతామనోహరా, పరశురామ బాహుబల పరాక్రమ హరణా, అయోధ్యాప్రవేశా, కైకేయి[విఘ్న]కల్పిత పితృవాక్య ప్రతిపాలకా, చిత్రకూటాద్రి నిలయా, కాకాసుర విదళనా, దండకారణ్య ప్రవేశా, విరాధ దైత్యహరణా, సుగీవానుగ్రహా, వాలినిగ్రహా, మాల్యవంత ప్రవేశా, లవణాబ్ధి గర్వాహల్లకల్లోలా, విభీషణ స్థాపనాచార్యా, దక్షిణ సింధురాజ బంధనా, సువేలాద్రిప్రవేశా, రావణసుగ్రీవ మల్లయుద్ధ వీక్షణప్రమోదా, మహోదర మహాపార్శ్వ కంపన వజ్రదంష్ట్ర వజ్రమస్తకశూలా, కుంభనికుంభ కుంభకర్ణ కరచరణ శిరఃఖండనా, మకరాక్ష ధూమ్రాక్ష విరూపాక్షాతికాయ మహాకాయ చండమదగర్వ సంహారా, ఇంద్రజిత్తు తలగుండు గండా, రావణగిరి వజ్రాయుధా, పంక్తి కంధర శిరఃపంక్తిఖండనా, లంకాపాలకా, విభీషణ రాజ్యస్థాపనాచార్యా, జానకీసంయోగా, పుష్పకారూఢా, భరధ్వాజవిందా, నందిగ్రామ ప్రవేశా, భరత శత్రుఘ్న లక్ష్మణసమేతా, అయోధ్యాప్రవేశా, పట్టాభిషిక్తా, లోకపావనా, మైథిలీ సమేతా, ఆనందా, జయజయ శ్రీరాఘవేశ్వరా, మాయతి రామానుజా, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !!

8

దేవా, మధుర నారాయణా, ద్వారపతీ నిలయా, కాళీయమర్దనా (కాళింగ మర్దనా), కంసాసుర మర్దనా, కౌస్తుభా భరణా, శ్రీవత్స లాంఛనా, లక్ష్మీకుచ కుంకుమ పంకిల వక్షస్థలా, శ్రీ యశోదానందనందనా, చాణూరమల్ల ముష్టికాసుర ధేనుకాసుర వనకుఠారా, శకటాసుర ఘోటకాసుర-కుక్కుటాసుర మదభంజనా, మహానాట్యవినోదా, మహా మునిగణ సేవితా, అనురూపా, అక్షయరూపా, అక్రూర వరదా, గజేంద్రవరదా, ప్రహ్లాదవరదా, అంబరీషవరదా, ఆపద్బాంధవా, ద్రౌపదీ మానరక్షణా, పాండవపక్ష పరాయణా, విదురగృహ విమలభోజన గ్రహీతా, వాల్మీకి సనకసనందన సనస్సుజాత, సనత్కుమార కపిల నారదాది పరమ యోగీంద్ర వందితా, రాక్షసకుల ప్రళయాంతకా, గరుడధ్వజా, కమలాసనవందా,

బృందావన లీలావినోదా, వేణునాదప్రియా, శ్రీమదనగోపాలకా, అచలాచలాణు రూపా, అనుపమా, అవ్యక్త గుణానందా, అభవస్వరూపా, ఆదిమధ్యాంతరహితా, అమృతాబ్ధిశయనా, అనంతశయనా, మకరకుండ లాభరణా, కిరీటాలంకృతా, కనకపీతాంబర ధరా, గరుడ గంధర్వ సమస్త దివ్యయుత దివ్యమూర్తీ, దిక్పాల కుల సేవితా, ప్రలంబాసుర భూతకి ప్రాణనిర్జితా, గాంధారీ పుత్రమిత్ర గహన దవానలా, పరమపురుషా, పరంధామా, పరమపావనా, కనక సురాంతకా, శిశుపాల దంత వక్త్ర, బకాసుర కోలాహలా, బాణాసుర బాహుఖండనా, భవరోగవైద్యా, భయ నివారకా, షోడశ సహస్ర స్త్రీమనోహరా, గోవర్ధన గిరిధరా, మత్స్య కూర్మ వరాహ నారసింహ (వామన) రామోరామ బౌద్ధరామ(శ్చ) కల్కి దశావతారా, లీలావినోదా, సర్వేశ్వరా, సర్వతోముఖా, సర్వజీవ దయాపరా, విశ్వంభరా, విశ్వలోకేశా, త్రిభువనవంద్యా, త్రిగుణాత్మకా, త్రిలోకరాధ్యా, మధుకైటభా(ంబుధ) మహాప్రళయ మారుతా, సోమకాసుర హిరణ్యాక్ష హిరణ్యకశిప నిర్ధూమధామా, సకల దేవతామునిజన మోక్షరక్షకా, గురు లఘు క్రమరూపా, కుటిల శిక్షా కారణ రూపా, ఓంకార ప్రదీపా, అనంతనామకీర్తనా, నాదబిందు కళాతీతా, చరణార వింద గంగోద్భవా, ధ్రువరోమశ వ్యాస మార్కండేయ గౌతమ హృదయ జగజ్జ్యోతి ప్రకాశా, జగదేకవీరా, అమిత రవికోటితేజా, భాగవత కల్పభూజా, అజామీళ ఘంటాకర్ణ దశధ్వజాళ్వారుల కృపాసాలోక్య, సారూప్య సాయుజ్య సామీప్య కృపాకటాక్షా, పరమానంద భరితా, అనాథనాథా, దేవతా సార్వభౌమా, అపరిమిత బ్రహ్మాండరోమకూపా, దుష్టనిగ్రహా, శిష్టప్రతిపాలకా, దేవవేశ్యా భుజంగా,(!) అభయప్రమేయ కృపాంతరంగా,[1] ఓం, విశ్వంబులు సృజియించి, బ్రహ్మను అనుభవకర్తనుం జేసి, మీ రంతర్యాములై యందుల నుండుదురు. సూక్ష్మ చరాచరంబైన మీ దాసులఁ గాచెదరు. కరుణాజలధీ, భూకాంత లక్ష్మీ సమేతా, సుభగణవందితా, (మా)యతి రామానుజముని వరము, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

---

[1]ఇచటికి ఒకవచనము ముగియుచున్నది. కాని తరువాతి వచనము చిన్న ధగుడచేతను, అది సంభోధనతో ప్రారంభము కాకపోవుటచేతను, పైదానియందే దీనిని చేర్చితిని.

9

దేవా, శ్రీరామానుజ సిద్ధాంతంబునకు ద్వైతాంతరమే హాని. చిత్రస్వరూపంబునకు కావ్యమే (?) హాని. పదభక్తికి మోహ విలంబమే హాని. వితత విద్వాన్మత్యమునకు* (స్వర) కళంకమే హాని. స్వామీ, సింహగిరి నరహరీ, మీ దాసుల కాచార్య కటాక్షము లేకుండుటయే హాని. ప్రాణహాని సమయమందు భగవద్భక్తి మజివక విష్ణుపురాణములు, హరికథలు దలంచి, యితరము దలంచక సంసార మోహభ్రాంతి విడిచి సింహగిరి (నరహరిం) దలంచి పరమపదమున కేగుమా చిత్తమా, స్వామీ సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

10

దేవా, శమదమాది గుణంబులు కలిగిన బ్రాహ్మణుం డుత్తముండు. శమదమాది గుణంబులు గలిగిన క్షత్రియుం డుత్తముండు. శమదమాది గుణంబులు గలిగిన వైశ్యుం డుత్తముండు. అతండే ముఖ్యుండు. ఎట్టి పురాణ వాచనలు (వాదనలు) విన్ననేమి? సకలమెఱిగి యెఱుగక మార్గమునందు సంచు గలిగి యితరముగా నాచరించెడు జంతువున కేదిగతి? అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

11

దేవా, విష్ణుభక్తిలేని విద్వాంసుని కంటె హరికీర్తనము సేయునతఁడె కులజుండు. శ్వపచుండైన నేమి? ఏ వర్ణంబైన నేమి? ద్విజునికంటె నతఁడె కులజుండు. సంధ్యా (వందనాది) నిత్య కర్మానుష్ఠానంబులు దప్పక నడిపిననేమి? సకల ధర్మంబులు సేసిననేమి? మా సింహగిరి నరహరి దాసులకు దాసులైనం గాని లేదు గతి! స్వామీ! సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

12

దేవా, నిర్గుణ వస్తువైన మీ మహత్వం బెన్న నగోచరంబు. శతబ్రహ్మ కల్పంబులు చనిన మీఁదటఁగదా రోమజుని కొక్క రోమంబు ఛేదంబగుట! ఇట్టి

---

*వ్రాతలో 'విత్పన్నత్యము' అని కనిపించుచున్నది.

రోమజులు నూటెనమండ్రు చనినమీఁదటఁ గదా, మీనజుని కొక్క యహంబు గడచుట! అట్టి మీనజులు నూటెనమండ్రు చనిన మీఁదటఁగదా, పాద మహాముని కొక్కపాదంబు విమృష్టంబగుట! అట్టి పాద మహాములు నూటెనమండ్రు చనిన మీఁదటఁగదా, మహా ప్రళయంబగుట! అట్టి మహాప్రళయంబు చనిన మీఁదటఁగదా, రుద్రుండు తాండవంబు నటియించుట! అట్టిరుద్రులు చనిన మీఁదటఁగదా, వీకార్ణవోదకమై వటపత్ర శయనుండైన కృష్ణ కృష్ణానతార లీలలం జీఁకటి యౌట! అట్టి చీఁకటి చనినమీఁదటఁగదా యష్టభుజ నారాయణావతార మనంతకోటి రవి ప్రకాశమై వెలుంగుచుండుట! అట్టి యాదిదేవుండవు నీవగుట! అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

13

దేవా, (నిన్ను) నెఱుంగని వాని వ్రతోపవాస వర్ణాచారములు విఫలములు, జ్ఞానరహితుండైన నరుండు దాను కర్మియైన నేమిఫలము? మా సింహగిరినరహరి నెఱుగనివారి జ్ఞాన మజ్ఞానమగును. ఎఱుకచే, మరపుచే మీమూర్తి ధ్యాన విశేషంబు నకు సోపానంబులు. ప్రథమ మన్యదేవతా నిరసనము. ద్వితీయము విషయనాహిత్యము. తృతీయము భగవద్దాసుల కైంకర్యము. చతుర్థము మీమీఁది విశ్వాసము. పంచమము సత్యము. షష్ఠమమాశా నిర్ముక్తి. సప్తమము రహస్యము. పరమాణువు రాఘవభాష్య విశేష సుధామృత సంజీవ నిష్ఠ పరమ విభూతి విశ్వమై జయాధికారంబు గలిగి 'అహింసా పరమోధర్మ' మనెడు నర్థంబు దెలిసి, సర్వ జీవ దయాపరుండై చిత్తములోని జీవుండు చక్రాంకితుండై (యుండవలయు). వ్రతోపవాసంబులు సేసిననేమి? షోడశమహాదానంబులు సేసిననేమి? దేహత్రయ గుణంబులు వదలక, కులాభిమాన విద్యాగర్వంబులు కుదురుకొనక, యింద్రియ మోహాంధకారంబు నివారించక యున్న దేహి దుర్మతి. ద్వయము బ్రహ్మజ్ఞాన మూర్తిలోను, మా సింహగిరి నరహరి పదధ్యాసమందును దొరుకును. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

14

దేవా, 'ఆకాశాత్పతితమ్ తోయమ్ యథాగచ్ఛతి సాగరమ్'. అందుల కపోహ యనియెడు జలంబు నంటియు నంట నటులుండ వలెను. 'సర్వదేవ

నమస్కారః కేశవమ్ ప్రతిగచ్ఛతి' అనియెడు స్మృతులుండగా, దైవతాంతర మంత్రాంతర సాధకాంతర ప్రయోజకాంతరముల భజింప నేటికి? సంధ్యాంత మందే దేవుని జప సమ ధ్యానాత్మలోను బరతత్త్వము నిలిపి పరమరహస్యమైన మార్గమున జగదీశ్వరునిం జేరి, జరామరణాదులకు లోనుగాక జయమందరే? 'శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే' అనియెడు స్మృతుల శివమనియెడు మంగళ వ్రతములు శ్రీహరియందు సర్వపరిపూర్ణమై యుండగాను, ప్రకృతింబొందక ప్రపన్నులైన పరమ భాగవతులంగని, 'సర్వమ్ విష్ణుమయం జగత్' ని శ్రుతి స్మృతులు మొరవెట్టుచున్నవి. 'నారాయణాద్బ్రహ్మ జాయతే, నారాయణా ద్రుద్రో జాయతే' యని సర్వలోక రక్షకుండని, త్రిమూర్త్యాత్మకమని, సుగుణ ధారి, యేకస్వరూపంబని, యేకైక స్థితి లయ కారణంబని, వేదశాస్త్ర పురాణం బులు, సత్య స్వరూపంబులు నిలుపుచున్నవి. ఓ వేదోద్ధారా,.....* ఓంకార స్వరూపా, ఓ విశ్వరూపా, అజ్ఞానమనెడు నంధకారమును బాపి, జ్ఞాన మనెడు సులోచనములను ధరింపఁజేసి, 'తద్విష్ణోః పరమంపదమ్' ను వారలం గనుంగొనఁ (జేయవే!) శ్రీరామానుజా, దాతారు, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

15

దేవా, మీ దివ్యజ్ఞాన మెఱుఁగు వారు పరమజ్ఞానులు. పరమానంద స్వరూపులు. వైకుంఠపుర నివాసులు. వారే పరమ పావనులు. కోటి యజ్ఞ కర్తలు! సర్వ దర్శనంబుల సకల శాస్త్రంబులు జదివిన ఫల మదియే. అనాథ పతీ, స్వామీ, సింహగిరి నరహరీ, మీ కైంకర్య పరులకు వందనము చేయుటయే పదివేలు. అనంతములైన ఫలములు కలుగును. ఆచార్యహీనుండై ద్విజుండు కులాచారము విడిచి, యనామకుఁడాలి వలన సుఖమంది నట్టిదే, యితర దేవతా ప్రపత్తి చేసినవారి (ఆచారము). యతి రామానుజ మునివరము. దాతారు. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

16

'దేవా, అనంత పద్మనాభా, వాసుదేవా, నారాయణా, గోవిందా, ముకుందా' యనియెడు నిఱువది మూడక్షరము లెఱిఁగిన మహాత్ములు కలరొకో భూమిపైని?

---

*ఇచట నాలుగుపంక్తుల స్పష్టముగా నుండుటచే వదలబడినవి.

సర్వాంతర్యామి సాక్షియని శ్రుతి చాటుచున్నది. బ్రహ్మాండము మీయందున్నది. 'ఏకో విష్ణు ర్నారాయణః' అను నక్షరములు సహస్రముఖములై చాటుచున్నవి. యతి రామానుజ ముని వరము. దాతారు. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

17

దేవా, శ్రీరామానుజ సిద్ధాంతమును బోలు మఱి సిద్ధాంతము (లేదు). పరమాచార్యులంబోలు మఱి యాచార్యులు లేరు. పరమ భాగవతుల బోలు మఱి సమ్మోదపరులు లేరు. వారి కైంకర్య పరుల బోలు మఱి కైంకర్య పరులు లేరు. 'అస్మద్గురుభ్యోన్నమః' అను మంత్రమునను సరి మంత్రంబు లేదు. పరమ రహస్యంబునుం బోలు మఱి రహస్యంబు లేదు. పరమ నాంచారి*బోలు మరి జనని లేదు. అనాథపతి, స్వామి నరహరి బోలు మఱి దైవంబు లేదు. స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

18

దేవా, పరమ రహస్యకారియగు పురుషాకార ప్రపన్నుని తప్పులెన్నుదురు. లోకికు లెఱుగరు. అజ్ఞాన్యులై రౌరవాది నరకమున నుండి సంచరించుటయే దీనికి కారణము. నరహరీ, పావనుడైన యగ్నిదేవతను ముట్టినం గాలదే? ఆ యపచారమునకు క్షమ పెట్టినం గాని పాయదు. అఖిలాండకోటి సర్వము సర్వేశ్వరు మాయాకల్పిత మేమి చేయుదును? నిరపరాధిని. జంతువు లఖిలాండ పూరితములైనవి. జరామరణ వ్యాధులచేత నక్కటా యనుచున్నది. ఈర్ష్య తగదు. (నైర్మల్యా) స్పదములయిన యాత్మలయందు గుణావగుణములు చింతించుట యవినీతి. సర్వ భూత దయా వ్యపగత రాగద్వేష మత్సర శమదమాది గుణంబు లెన్నండుగలుగునో; స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

19

దేవా, మీ పాద తులసియందుఁ జవి గలిగినవార (జవి నెఱిఁగినవార) మృతాది రుచులఁ దృణీకరింతురు. దేవా, మీ పాదయుగళ పరీమళ మెఱిఁగిన

---

*నాంచారు అను తమిళ పదమునకు రూపాంతరము-ఒకదేవత-లక్ష్మీదేవి.

వారికి, చందన ఘనసార పల్లవము లసహ్యములు. దేవా, మీ సౌందర్యమును దర్శించిన కన్నుల కితరములైన రూపములు చూడఁ బాపములు. దేవా, మీ యసంఖ్యాక కథామృత పరీమళము[1] ఘనతరముగా గ్రోలిన జను లితర కథల నెఱుంగరు. దేవా, సర్వగంధా, సకలబాంధవుండవై యిటువలె నిఖిలేంద్రియ భోగ్యమై రఁజింపవే. స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

20

దేవా, [2]అంతట నంధుండైన బాలుండు కులాధారుం డాయెనని, తన జననీ జనకులు, తన బాంధవులు, గోత్రాది వరులును, సహోదరులును, పిత్రపితామహ ప్రపితామహులును, (!) జనుదెంచి, యాశ్చర్యపడి, యప్పుడు కుచ్చారుం జూచి యిట్లనిరి. 'ఓ మహాత్మా, ఈ బాలుని భవిష్యద్వర్తనంబు లెఱింగి రక్షించి దివ్యదృష్టి నొసంగి పరమ భాగవతోత్తమునిగాఁ జేసితిర'ని యానందభాష్పములు గురియుచు, తమ కుమారుండగు కృష్ణమాచార్యుని కౌగిటఁ జేర్చికొని, పునఃపునరాలింగనము జేసి, యచట నున్న మహాత్ములఁ గనుంగొని, ఓ మహాత్ములారా, ఈ బాలునికి జాతక కర్మాన్నప్రాశన చౌలోప నయనాదులైన బ్రాహ్మణ కర్మము లాచరించవలెనని కుచ్చారు సన్నిధిని సకలముఁజేసి, 'ఆత్మావై పుత్రనామాసి' యన్న శ్రుతి చాటంగాను, నావిధంబు డలంచి లౌకిక కర్మము లాచరించిరి. దేవా, ఈ వ్యామోహములేల కల్పించితివి? దేవా. ఈ చాతుర్లక్ష గ్రంథమునే విఘ్నము సేయక నీడేర్పుము. దేవా, ఆచారం బెఱుంగ, అనాచారంబుగాఁ దిరుగాడుచుండుదును. జ్ఞానములేని పంచేంద్రియ వ్యవహారిని. దేవా, మీ నామావళి నుచ్చరించు భాగవతులు ధన్యాత్ములు. జాయమీశ స్వరూపులు, మూఢాత్ముండైనను నిలిచి (మీ నామావళి) వినెనేని, వాని దురితసమూహములెల్లం దొలంగును. శాంతులైన మహాత్ములు వినిరేని సకల కోరికలు సిద్ధించును. సాలోక్యము కలుగును. ఏకచిత్తంబున వినువారు యముద్వారంబుఁ జూడక వైకుంఠంబుఁ జేరుదురు. నమో నారాయణా, నీ ప్రభావంబున నీ పంచమ

---

[1]మీ యసంఖ్యాక పరీమళ కథామృతము – అని పాఠము.

[2]ఇందలి విషయమునుబట్టి యీ వచనము మధ్యలో ప్రారంభమైనట్లు కాన్పించును. కాని వ్రాతప్రతియందు దాని కాధారము లేదు.

వేదంబయిన యీ సంకీర్తనము నంతఃకరణంబున వినువారు సాయుజ్యంబు పొందుదురు. అనంతంబులు మీ నామములు. తెలిసియుఁ దెలియరావు. దేవా, 'ఓం తచ్ఛమ్యో రావృణీమహే, గాతుమ్ యజ్ఞాయ, గాతుమ్ యజ్ఞపతయే' అని పురుష సూక్తంబున నభిషేకంబులు సేసి మిమ్ముఁ గానలేరు. పురాణంబులు, శాస్త్రంబులు చదివిననేమి ? మీ గుణంబులు తెలియక, మీ దాసుండుగాక మిమ్ముఁ గానలేఁడు. దేవా, జననీ జనకుండవు నీవె. కులగురుండవు నీవె. ఆచార్యుండవు నీవె. ఆప్తజన బాంధవా, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ :

21

దేవా, మీరు జగదంతర్యాములై మీ గుణంబులు భూలోకంబునఁ బ్రసిద్ధముఁ జేసితిరి. దేవా, ఈ లోకంబున, శేషాచలంబున వేంకట నామధేయుండవై తిని. ధనాపేక్షాపరుండవై విహరించితివి. జన భోగంబునకు పురుషోత్తముండవై, జగత్తు(నకు) నాథుండవై మహాభోగంబు లొరగించితివి. దేవా, లోకంబులోని ధర్మా ధర్మంబులకుఁ బరమ భాగవతోత్తముల పాలికి సింహాచలంబున నిలిచితివి. దేవా, భూలోకంబున వైకుంఠంబను (శ్రీరంగంబున) నుభయ కావేరీమధ్యంబున విభీషణ వరదుండవై, శ్రీరంగశాయి వైతిని. ఈ విధంబున జగంబునఁ జతుర్విధ రూపంబులఁ(?)దాల్చి విహరించుచున్నాఁడవు. మీ మహిమ పరబ్రహ్మ మని తెలిసితిని. నా భయంబు లడంగెను. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ :

22

దేవా, విశ్వంభరా, విశ్వపతీ, విశ్వమయా, విశ్వరూపా, విశ్వాత్మకా, విశ్వజనకా, శాశ్వతైశ్వర్యా, కలావతంసా, త్రిమూర్తీ, మత్స్య కచ్ఛప వరాహ వరమృగ విప్ర భూపతిరామ రామ కృష్ణ బౌద్ధ తురగ సమారంభ సహస్ర లీలా విలాసా, అనంతనామా, స్తోత్రాతీతా, దైవ దాసప్రియ ధర్మోపదేశా, నిర్మల తీర్థ స్వరూపా, దుర్మద దానవ విదారణా, భానుకోటి ప్రకాశా. పరమపద వికాసా, భాసుర సమర ప్రపూర్ణా. సకల భువనాధ్యక్షా, నిత్యస్వరూపా, సత్యవాక్య స్థాపనాచార్యా, శరణు శరణు : సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

23

దేవా, శ్రీమన్నారాయణా, పరమబ్రహ్మ స్వరూపా, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా, వేద వేదాంత వేద్యా, చతుర్దశ భువనాధీశ్వరా, పురాణ పురుషోత్తమా, పుండరీకాక్షా, పక్షీంద్రవాహనా, శంఖచక్ర గదా శార్ఙ్గ ఖడ్గాద్యనేక దివ్యాయుధధరా, మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన పరశురామ శ్రీరామ రామకృష్ణ బుద్ధ కల్కి సర్వేశ్వరా, సర్వాంతర్యామీ, సకల భూతాత్మకా, సన్నామార్తకా, సంసారాంతకా, ప్రేత మస్తక ప్రతాపా, (?) చాణూర మల్ల యుద్ధ కారా, రాక్షసగిరి వజ్రాయుధా, కుక్కుటాసుర బకాసుర శకటాసుర ధేనుకాసుర విదళనా, భూతకీ ప్రాణాపహారా, శ్రీలక్ష్మీ కుచకుంకుమాంకితా, గోపీ జనప్రియా, గోవర్ధనగిరిధరా, వేణునాదవినోదా, శిశుపాల శిరచ్ఛేదనా, కాళీయ మర్దనా, కౌస్తుభాభరణా, శరణాగత వజ్రపంజరా, యశోదానంద వర్ధనా, పక్షీంద్ర వరదా, ప్రహ్లాదవరదా, ధ్రువవరదా, అక్రూరవరదా, అంబరీషవరదా, ద్రౌపదీ మానాభిరక్షకా, పాండవ పక్షపాతీ, అక్షయ సంపన్నా, విశాలవక్షా, పురందర వంద్యా, విదురునింట విందా, ప్రణుత వాల్మీకి వరధ్యానా, అప్రమేయా, ఆది మూర్తీ, ఉరగశయనా, ఈషణత్రయ, భువనత్రయ భక్తి ముక్తి ఫలదాయకా, శ్రీ వైకుంఠనాయకా, శ్రీ రాఘవేశ్వరా, శ్రీకృష్ణ కుప్పారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

24

దేవా, తొల్లి రత్నబేహారులు బావలు మఱదులు సముద్ర తీరమునందుండిరి. అందు కొందఱు రుద్రభక్తులు. ఒక్కడే మీ దాసుడు. అత్త డన్నోదక తాంబూల గంధానులేపన వస్త్రములు మీకు సమర్పణ సేయక తాను నొల్లండు. అధ్వానమందు విడువని వర్షముచేత నష్టదినంబులు మీ కోవెల లేకుండగాను నత డుపవాసమే యుండెను. ఆ బావ మఱదులు హాస్యము చేయఁదలఁచి గుడారు కంబముఁ దుండించి, యాతుండుఁ గొంత దవ్వు కొనిపోయి యచట ప్రతిష్ఠచేసి తిరుమణి తిరుచూర్ణమువెట్టి, గంధ పుష్పధూప దీపములిచ్చి, వారు మీ దాసునికడకు వచ్చి, 'యష్ట దినంబులనుండి యెట్లుపవాసమున్నా'వని నను, మీ దాసుం డేమనుచున్నాఁడు—'ఈ యధ్వానమందు పెరుమాళ్ కోవెల

లేకుండగాను నా కన్నపొనాదులుగా'వనెను. 'మే మొక పెరుమాళ్ల కోవెల చూచి వచ్చితి'మని తాము చేసిన గుడారు కంబముఁ జూపిన, మీ దాసుండు చూచి, మీ భావమెఱింగి యాతండే భావనారాయణుండని దండము సమర్పించెను. తళిగ వడ్డించెను. మీకు సమర్పించి తాను ప్రసాద పడ్డ వెనుకను నా బావమఱదు లేమనుచున్నారు—'మేము గుడారు కంబము నాటి పతిష్ఠ చేసివచ్చితిమి. అది మీ పెరుమాళ్లు కాదు. గుడారు కంబ మంతే'యని హాస్యము చేసినను, నా దాసుండు దత్తరపడక 'యాతఁడు భావనారాయణుఁడు. మీరు భావముచేసి నిలిపితిరి. మీరే తిరిగి తెచ్చిన నేను చక్రహస్తుండఁ గాకపోయెద'ననిన, నా సమయమున రుద్రభక్తు లుప్పొంగి తాము స్థాపితముచేసిన గుడారుకొయ్యఁ దిగిచి చూచినను, రాకున్నను యోజనము లోతు త్రవ్వి, తిగిచి, ఖండించఁబోయినను (దానిని) తాము కన్నులగానక, భ్రమించి, తమ గుడారమునకువచ్చి యాదాసునితో నేమనుచున్నారు—'నీవు పరమాత్ముండవు. నీ హృదయమున నాతఁడున్నాఁడు. మేము పోయి గుడారు కంబము దిగిచినను, దానిని నారాయణుఁడు కూర్మరూప మున మోసి యున్నాఁడు. నీవే మా యాచార్యుఁడ'వని దండము సమర్పించి కడకుఁ జనిరి. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

25

దేవా, ఒక చోరుండు బ్రాహ్మణులకనేక హింసలు చేయుచుండెను. కొంత కాలమునకు జ్ఞానము వొడమి యాతఁడు బ్రాహ్మణసభకుఁబోయి 'యనేక హింసలు నేసిన పాతకుండను. నాకుఁ బ్రాయశ్చిత్తము జేయుఁడ'న్న బ్రాహ్మణు లేమనుచున్నారు—'నీవు తొల్లిఁ బొమ్మిదినూట దొంబది తొమ్మిది విప్రవధలు చేసిన పాతకుండవు. నీకు ప్రాయశ్చిత్తము లేదుపో'మ్మనిన, చోరుఁ డప్పుడు మహో గ్రుండై మండి, గృహంబు వెలుపట నిలిచి తన(భార్యతో) నేమనుచున్నాఁడు—'నేను విప్రవధఁ జేయు తుమ్మిదుడ్డు తే'మ్మనిన నప్పుడా యింతి యేమనుచున్నది—'నీవు నాపతివి. నేను నీసతిని. దానమెఱుఁగవు. ధర్మమెఱుఁగవు. మనకుఁ బ్రాయశ్చిత్త మెట్లు కలుగును? మనమింక హింసలుమాని మన గృహంబునం గల ధన ద్రవ్యాదులు దానధర్మంబులు నేసి, మనము సత్పసంతానములఁ బడయుదము. అట్లుగాక ప్రాయశ్చిత్తము లేద'ని యాయింతి హరుసింపచినిను, చోరుండంతేకానిమ్మని, 'నీవును నేనును గూడుకొని బ్రాహ్మణ సభయున్న స్థలమునకుంబోయి, యా

బ్రాహ్మణుఁడే క్రమమునఁ జెప్పిన నాక్రమమునఁ జేయుద'మని, యిద్దరును బ్రాహ్మణ సభయున్న స్థలమునకుం బోయి, దండంబువెట్టి, 'మే మనేక హింసలు చేసిన పాపాత్ములము. మాకుఁ బ్రాయశ్చిత్తముఁ జేయుఁడనిన, నా బ్రాహ్మణోత్తము లేమనుచున్నారు— 'వినుము చోరా, నీచేత దానము పట్టరాదు. ప్రాయశ్చిత్తము లేదు. నీవు సహస్రవిప్రుల వధ చేసిన వాఁడవు. నీచేత సప్తవర్షముల నుండి రక్తమునఁ దోగిన తుమ్మదుడ్డు(నకు) మూఁడుశాఖలు మొలచిన నీకుఁ బ్రాయశ్చిత్తము చేసెదము పొ'మ్మనిన, నా చోరుండప్పు డాగ్రహముతో, 'నరువది యేండ్లు మంటి రత్నమునఁ* దోగినను తుమ్మదుడ్డునకు త్రిశాఖలు మొలుచునా?' యని తన యింతిఁగూడి సంభాషించి, తాను విప్రవధ చేయు నరణ్యమునకుఁ బోయె. దేవా, ఆ యరణ్యమున నొక సుంకరి కలఁడు. అందొక శ్రీవైష్ణవుఁడు తన తిరుకల్యాణ మాపొడ్డెయని లగ్నము నిశ్చయించుకొని రాఁగా, నా సుంకరి 'శోభన ద్రవ్యాదులకు సుంకము వచ్చును, పెట్టి పొమ్మ'నిన, నా వైష్ణవుఁడప్పు డేమనుచున్నాఁడు—'ఓయీ సుంకరీ, ఇంత కాలమునకు వివాహము కలిగినది. అంకిలి సేయకోయీ, నేకు పుణ్యమగును. లగ్నము తప్పిన ఫారా కన్యనీయరు'. అని మహా దైన్యపడినను, మటియును బోనీయక నాసుంకరి నిర్బంధము సేయఁగాను, వారిద్దరి మాటలువిన్న చోరుండు దగ్గరకువచ్చి, 'ఓయీ సుంకరీ, వేయికల్లలాడి వాచా దుర్భాషలు పలికి యొక వివాహము చేయవలె' ననినను, 'నీ వైష్ణవుని సుంకముపెట్టక పోఁజాలను. ఇందుకు నీకేమిపని? నీవేమెఱుంగుదువు? పొ'మ్మనిన, నాచోరుండు సుంకరి తలనెలగ వధసేసి, యా వైష్ణవుని తిరుకల్యాణమున కంపెను. అప్పుడు చేసిన ధర్మమున, క్రితము చేసిన యధర్మములు పరిహృతము లాయెను. దేవదుందుభులు మ్రోగెను. పుష్పంబులు గురిసెను. ఆ దుడ్డునకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు త్రిశాఖలై మొలిచిరి. ఆ శాఖ లేమనుచున్నవి—'ఓం చక్రో చక్రః। ఓం అచక్రో చక్రః। జితక్షిచిత్తై వేదానామ్।' అని ఋగ్వేదమందలి పలుకులు పలుకంగాఁ జూచి యా చోరుండాశ్చర్యపడెను. (అప్పుడా చోరుండు సభకురాఁగా,) ఆ సభనున్న బ్రాహ్మణ సమూహంబులును తుమ్మదుడ్డుం జూచి, యా శాఖలు వేదము పలుకఁగా విని మహాశ్చర్యపడి, 'యోరి చోరుఁడా, నీవు సహస్ర విప్రవధ చేసినవాఁడవు. నీకీ పుణ్య మెందువలనఁ గలిగె'నని యడిగినను, నాతఁ 'డయ్యా షోడశమహా

---

*'మన్నుతోఁగూడిన రత్నమునందు' అని యర్థము కావచ్చును.

దానంబులు సేసిన వాఁడను గాను. సర్వ హింసాపరుఁడను. ఒక వైష్ణవుఁడు తిరుకల్యాణమునకుఁ బోగా, శోభన ద్రవ్యాదులకు సుంకము వెట్టుమని సుంకరి నిర్బంధము సేయఁగా, (నేను) వారిద్దరి మాటలువిని దగ్గరకుం బోయి 'యోయి పుణ్యాత్మా, వేయి కల్లలాడి యొక వివాహము చేయుమని రన్న'ను నన్నాతఁడు దుర్భాషలాడెను. ఆ సుంకరి తల(సెలఁగి) వధచేసి యా వైష్ణవుని తిరుకల్యాణ మున కంపిన ఫలము కలిగిన పుణ్యంబునను మీకు షోడశమహా 'దానంబులు సేసెదను. నాకుఁ ప్రాయశ్చిత్తము చేయుఁడన్నను, నా బ్రాహ్మణులా చోరుని యింటికిఁబోయి దానములు వట్టి ప్రాయశ్చిత్తము చేసిరి. అటువలె బ్రహ్మహత్యాది పాతకంబులు నాశనమాయెను. దేవా, ఇది మీ మహిమకాదా! మీ దాసుల కెవరికైన నేమి? తిరుకల్యాణము సేసిన వారల కనంతములైన పుణ్యములు కలుగునయ్యా! ఇది పూర్వ భాగవత సంకీర్తన. ఇందు యజుర్వేద సామవేద ఋగ్వేదాథర్వణ వేదము లున్నవయ్యా! ఇది మహా రహస్యమే దేవా! దేవా,! శ్రీకృష్ణా! సింహగిరి నరహరీ! నమోనమో దయానిధీ!

26

దేవా, ఆదిదేవుండవు, సకల బ్రహ్మాండ నాయకుండవు నీవని 'ఏకో విష్ణర్మహద్భూతం' బనిరే. దేవా, సమస్త విస్తార మూర్తివని భావమం దెఱింగిన వారైరి. జాతి వర్ణములతోఁ బనిలేదు. మీ భక్తుండైనఁ జాలునని 'శ్వపచోపి మహీపాలఃʼ అంటిరి. సకలజీవులను జతుర్వేద ధరములంటిరి. దేవా, ఆత్మ జ్ఞానములేని యాత్మలకు 'ఆత్మజ్ఞానం జాయతే' యని తెలిపితిరి. దేవా, వేష ధారణయే చాలదు. ఆత్మభక్తియే చాలదు. జ్ఞానమాత్మ భక్తివంటిదని తెలిపి 'వేషాన్న విశ్వాస ప్రజానామ్' అంటిరి. దేవా, బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రు లందు పురుషసూక్తంబుండునని తెలిపితిరి. దేవా, కేవల జ్ఞానము దెలిసి, దూషణము కూడదని యందుకు దూషణ యంటిరి. దేవా, మీ భక్తుండైయుండి శూద్రభక్తుల దూషించుట దోషంబని తెలిసి యందుకు,

'మద్భక్త శ్శంకరద్వేషీ, మద్ద్వేషీ శంకరప్రియఃʼ
తావుభౌ నరకం యాతఃʼ యావచ్చంద్రదివాకరౌ.'

అనియెడు వాక్యములు తెలిసి, యందుకుచ్చారణ తారక వేషములకు శూద్రుం డైనను జాలునని 'శూద్రాశ్చ భగవద్భక్తా విప్రా భాగవతా స్మృతా' అంటిరి.

దేవా, దూషకానుష్ఠాన దూషక రహితుం డుత్తముండు నిరపేక్ష నిశాంతంబంటిరి. దేవా, సకల జగదంతర్యామివి, సకల భూతాంతర్యామి వగుదువు. 'సిద్ధం కేశవా పురుషలోకేశమ్' అంటిరి. దేవా, మీ భక్తులు మిమ్మొచ్చట కొనియాడు దురో యచ్చట మీరు వసించి యుందురని తెలిసెను. అందులకు నాఒహంవ సామి వైకుంఠే' అంటిరి. దేవా, 'సదాచార్య కటాక్షేణ భజ సిద్ధిమ్.' ఆచార్యులే నరహరి. (మీ) సాక్షాత్కార మెందున్న నందుల ప్రేమఁజూచిన బీజాక్షులు, సతులవ్రులనఁ ప్రేమఁజూచి రక్తమాంస క్రిమికీటక శల్యాదులఁగాసరు. ఇవియన్నియు నెటింగిన మహాత్ములకు సర్వహేయము. ఎఱుంగని తామసులకు సర్వము ఖాగము. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

27

దేవా, అకార ఉకార మకారములుం గూడఁగా ప్రణవము. ఇందు బీజాక్షరి గాయత్రి. ఇచ్ఛాశక్తి క్రియాశక్తి జ్ఞానశక్తుల మహా మహిమను నరుఁడెఱుంగ వశమే? 'అనంతావై వేదాః' అని శ్రుతి పలుకుచున్నది. శాస్త్రములు లోకోప వాదములు. అడియేని దాసస్ తొండండను శబ్దములు మీ దాసానుదాసులకు కారణమైనవి. మీ పాదములాన. ఈ యర్థము తప్పదు. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

28

దేవా, మీ చరణ యుగళ సేవ నేకులజుండైన నేమి? హృదయ కమల కర్ణికార మధ్యమందు రత్నసింహాసనస్థునింగాఁ జేసి, పురుషసూక్త ప్రకారంబున నావాహనార్ఘ్య పాద్యా చమన స్నాన వస్త్రోపవీత సుగంధ పుష్పాక్షత ధూప దీప పరీమళ నైవేద్య తాంబూలాది షోడశోపచారముల నర్చనచేసి, కంకణ కేయూర కౌస్తుభా భరణాలంకృతునిగాఁ జేసి, మకరకుండల మణిమయ కిరీట హార ఝణ ఝణాత్కార నూపురాది భూషితునింగా వామాంక స్థిత కమల ముఖావలోకన కుతూహల తుష్టమానునిగా ధ్యానము సేసి, ఓం నమో నారాయణా యేతివాక్య ముల చేత వందనము చేయునతండు పరమ భాగవతోత్తముఁడని శ్రుతివాక్యములు చెప్పెడుంగావున నట్టివానికి మీరు, మీకతండు దక్క నితరులు గలరె? కృపాం బుధీ, అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

29

దేవా, మీ యురంబున నిరవై వెలింగెడు శ్రీమహాలక్ష్మియు, కౌస్తుభ మాణిక్యము, మీ నాభి కమలమందున నవబ్రహ్మలు నింద్రాగ్ని యమ నైర్ఋతి వరుణ వాయు కుబేరేశానాదులైన యష్టదిక్పాలకులును, నష్టదిగ్గజంబులును, భుజంగములును, సప్త కుల పర్వతంబులును, సప్త మహర్షులు, సప్తజలనిధులు, సప్తవాయువ్వులు, ధరణియు, గగనంబును, దీపంబును, నురుములు, మెరుపులు, మేఘంబులు, దివి భువి పాతాళ దేవ దానవులయందున్న చరాచరాద్యఖిల జంతు జాలములు మీ నాభి కమలోద్భూతుని వలన లిఖితంబు గావే. శ్రీకృష్ణకువ్వారు. స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

30

దేవా, ఉదకమనలము, మారుత మాకాశము, జీవాత్మ, భూతాత్మ; యని యెడు భేదస్వరూపంబు లేక త్రిగుణానందమైన యిట్టి యాలయమై, జీవుండవై, దశ ప్రాణుండవై, దేహమునకు మనసునకు మానసోల్లాసమైన మునిజన నాధుల మనంబులఁ జేరుదువు. జిహ్వా చాపలంబునకు, మదన మాయాంధకారమునకు, సుజ్ఞాన దీపమన 'నారాయణ పరమ్ స్థిరమ్' అనియెడు దానంబును గొంటిని. రోగ దారిద్ర్యంబుల చెంపలు గొట్టితిని. ఈ యపకారాదుల మనిచి, చంద్రకాంత పర్వతముమీద నిలుపు సింహాసనమట్లు నీవు నాలోపలం బాయకుండవే! అనాథ పతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

31

దేవా, నిర్మలమైన మీ భక్తుల నెఱుగక కర్మాదులం బొందెదరు. ఇతర దైవాదుల శ్రుతులందులఁ దగిలి నిషేధమును బొందెదరు. నారాయణుండే పరబ్రహ్మమని తర్కవాదముల యందు దలంచి చూచిన దైవాదులు మఱి లేరు. ఏక స్వరూపంబైన వాఁడు, ఏకోదకంబైనవాఁడు, బలిని మెట్టిన వాఁడు, వటు రూపమును బూని త్రివిక్రమావతారమున నవతరించిన వాఁడా బ్రహ్మాండములు తానే యగునఁట. ఒక పాదంబున భువనంబులెల్లఁ గొనెనఁట. మూఁడుమూర్తు లేకమూర్తి యైననాఁడు, నడుగులో రుద్రాదులడఁగిరో, దైవాదులు మునిగిరో, పాతాళముఁ జొచ్చిరో, భస్మమైపోయిరో, జయ విజయులుఁ హిరణ్యాక్ష హిరణ్య

కశిపులు, రావణ కుంభకర్ణులు, శిశుపాల దంతవక్తులు, శ్రీవల్లభుని చక్రముచేత హతమగుట నెఱుంగరా? ఇతర దైవాదులిచ్చిన పదవులు నిత్యములగునా? శ్రీనాథుం డియ్యఁడా పదవులు! బలి విభీషణులకు, నంబరీష ధ్రువాక్రూరులకుఁ, బ్రహ్లాదనారదులకు, నహల్యా ద్రౌపదీత్యాది పుణ్యాంతల కిచ్చిన పదవు లభివృద్ధిఁ బొందుచున్నవి. శ్రీకృష్ణ కువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

32

దేవా, మీకు మొఱవెట్టి విన్నపము చేయుచున్నాఁడను. సంసార మోహ బంధములఁ దగులు వడితిని! కర్మానుకూలంబులం చెరగొంటిని. కాంతలమీఁది కోరికలు డాసెను. కామాంధకారము గన్నులఁ గప్పెను. కర్మవారిధి గడువదయ్యెను. అపర కర్మములకు లోనైతిని. అజ్ఞాన జడుండనైతిని. అధమాధముండనైతిని. అందని ఫలముల కట్టులు సాచితిని. దుష్ట దురాచారుండనైతిని. మూఢుండనైతిని. చపలుండను. అతిపాతకుండను. మహాపాతక విశ్వాసఘాతుక పంచమహా పాతకుండను. అరణ్యమునఁ దిరిగెడు మృగంబువలె తన నీడకుఁ దానదరి పడుచు, నజ్ఞానం బనియెడు చీకటిం దప్పిఁగొనుచు, నాచార్య కృపకుఁ జేరనీయక, భాగవత కైంకర్యము కీడేరక, మోక్షార్హుండఁగానేర నైతిని. కామాతురుండ నైతిని. కూపములోఁ బడిన శిశువువలెఁ గూయుచున్నాఁడను. తల్లిలేని బిడ్డవలె కలవరించు చున్నాఁడను. తైలములోని కుక్కిక చంచం భాయెను. ఉరిఁబడ్డ మెకంబువలె నుపాయ మెఱుఁగనున్నాఁడను. పసిరిక కాయి పురుగువలె తేలలేక సంసార బంధంబులఁ దగులువడి, విలక్షగుణాదుల కెదురు గాననేరక వితరణచెడి విరజానది దాటు నుపాయంబు చాలక వారకాంతలఁ రుచులం ధగులుచు, ప్రాక్కృతము చెలిమి విడువలేక, లజ్జాభిమాన కులాభిమాన దేహాభిమానంబులు ఖండించనేరక వారకాంతల వలనం జిక్కి వడితిని. నా కేది యుపాయము? చెప్పవే దైవమా! నీ వుత్తమ సాత్త్వికుండవు. సర్వజీవ దయాళుండవు. పవిత్రుండవు. వాలి నిగ్రహుండవు. విభిషణ ప్రతిష్ఠాపనా చార్యుండవు. రావణగిరి వజ్రాయుధుండవు. ద్రౌపదీ మాన రక్షకుండవు. పదునారువేల గోపస్త్రీ ప్రియుండవు. తాటక ప్రాణాపహారా, లక్ష్మీమనోహరా, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా, ఆదిపురుషా, పురాణ పురుషోత్తమా, వేద వేదాంత స్వరూపా, పరబ్రహ్మ స్వరూపా, పరతత్త్వ పరమాపకాశా, పరమపద

నివాసా, శరణాగత రక్షామణీ, శరణాగత చింతామణీ, పరంజ్యోతి (యైన) సింహాచలనాథునకు విన్నపము చేయుచున్నాఁడను. ఎనుబది నాలుగు లక్షల జంతురాసుల దొంతులను జన్మించి యనేక యోని ముఖముల వెడలితిని. ఆ కథ లను సుఖదుఃఖ జనితుండనై యనుభవించితిని. యమని వశంబున నెంతకాలము వ్యర్థయాయెను జన్మము : తర్క వాదంబులనియెడు కూపంబుల మునుగుచుఁ దేలుచు, మగుడ జన్మాదుల జన్మించుచు నూరికిం బాటకుం జోటికి నెడతాకుచును, నంతమున నరజన్మంబున జనియించి, యంధుండనై, కొన్ని వర్షంబు లనుభ వించితిని. కొన్ని దినంబులు కామ క్రోధ లోభ మోహ మద మత్సరంబుల నభిమాన హీనుండనై (యుంటిని. కొన్ని నాళ్ళిదుటివాని నెఱుఁగ నేరక, తన్ను తా నెఱుంగక, నిన్ను నెఱుంగక, నీమతం బెఱుంగనేరక, భాగవత ద్రోహుండనయి, పరమాచార్య కృపచేత నేర్పులేక, యాచార్య శేషము దొరకక, యజ్ఞాన జంతువునై, యగోచరంబైన పాపంబుల విహార వ్యాపారచిత్తుండనయి, పంచేంద్రియాదుల బంధించనేరక, పంచ తురంగంబులఁ బట్టనేరక, నైదుభూతంబులకు నొడంబడికగా, నవద్వారంబుల బంధించనేరక(యుంటిని.) (అప్పుడు) జన్మాంతర కర్మాంతర పవిత్ర పరమ వంద్యులైన మీ స్వరూపులైన పొతకమూరి భాగవతులు నారాయ ణయ్య, ఓబళయ్య, యచ్యుతయ్య, యనంతయ్య, శ్రీ చెన్నమయ్యంగారలు, శ్రీ కృష్ణమాచార్యు లేక దశావతారంబైన మహామహుఁడు గాను, చాతుర్లక్ష గ్రంథ స్వరూపుండనంగాను, నతని సందర్శన సేవ దొరకునో యని యపేక్షించి, ఎంచెరుమానార్ల స్వరూపులైన స్వాములు, పరమపద నివాసులు, పరమపద రాజులు, కాషాయ వస్త్రములు ధరించి, కమండలముల తోడ, దండెయుఁ దాళంబులతోడ, భాస్వర నామంబులతోడ, లలాటంబుల తిరుమణి శ్రీచూర్ణములు ధరియించి, యా దివ్యస్వరూపులు సింహాచలంబున కేతెంచిరి. ఆ సింహాద్రి జగదీశ్వరుండంగ రంగ వైభోగ దాయకుండు. శ్రీరంగశాయి. శ్రీ పరమపద నివాసుండు. శ్రీ జగన్నాథుండు సింహాద్రి యప్పుడు (నివసించు) తిరుపట్టణ మందు, సూర్య సోమవీధుల శ్రీ పొతకమూరి భాగవతులు కృష్ణమాచార్యుల తిరుమాళిగను గానలేక నెమకులాడుచున్న సమయంబున పదునొకొండవ యవతారుఁడు లేఁడొకో ! దశావతారుండైన మహాత్ముండు లేఁడొకో ! చాతుర్లక్ష గ్రంథ స్వరూపుని సందర్శనము తమ కేవేళ దొరుకునొక్కో ! తమకగోచరంబైన కన్నుల కరవెప్పుడు తీరునోక్కో ! తమ జన్మంబు లెప్పుడీడేరునొక్కో ! ఆ మహా

త్ము ని తిరువడిగళ్కె*చట నుండునొక్కొ! అతని తిరువడిగళ్లు సేవించు భాగ్యము తమ కెప్పుడు దొరుకునొక్కొ!' అని తమలోతాము సంభాషణ చేసి, యనున యింపఁగాను, నా సమయమందున కృష్ణమాచార్యులు తనకు ప్రియకాంతయైన జగన్మోహనాంగి యను వారకాంత కుచభరంబుల మీఁద హస్తంబులు వహించి, తనువెఱుఁగక, నవ రత్నఖచిత కంకణము(ధరించి), పసిడి కుందనపు పావాలు పాదంబుల మెట్టికొని, క్రొన్నెల నామంబు కొసర కస్తూరిబొట్టు దీర్చికొని, యుదయ కాలమందు చెక్కిళ్లవెంట చెమటకారంగా, కనకపీతాంబరంబైన పచ్చడపు చెరఁగు తిరుముఖారవిందమునకు మఱుగుచేసికొని, నఖములు చెక్కిళ్ల సందడింపు చు(ం)డఁగా), నాతుల బింబాధరముల రుచులుగొన్న యధరములు కెంపులై కనపడఁగా, నొకరూపున నరకేసరియై, యొక రూపున నాదివరాహంబై, యొకరూపున కూర్మావతారుండై, యొక రూపంబున కృష్ణమాచార్యులుగానే జనియించి, చాతుర్లక్ష గ్రంథ సంకీర్తనలు చేయుచున్న కృష్ణమాచార్యులు, చీని చీనాంబరములు ధరియించిన యనేక చెలికత్తెలైన వారకాంత లిరుపార్శ్వంబుల కైదండ నీయఁగా, నా కాంతా వైభవంబులకుఁ జొక్కుచు, నా మహాత్ముండు మదోన్మత్తుండై నవ్వుచు, నా సల్లాపంబులకు సంతోషచిత్తుండై తామస గుణంబులు వేంచేసిన సమయంబున, పొతకమూరి భాగవతులు పొడగని, కృష్ణమాచార్యులం గూడి సంభాషణచేయఁ దొడంగిరి. 'ఓ మహాత్మా, కృష్ణమాచార్యుల తిరుమాళిగ యెచటనున్నది మాకుం జెప్పు'మనిరి. అప్పుడు కృష్ణమాచార్యులు విభ్రాంతుఁడై, కడు నింద్య(మయ్యె)నని తనలో తలపోసి తలపోసి, చింతాక్రాంతుండై, 'యడియని యజ్ఞాని గుణకథ లడుగుచున్నారు. ఈ మహామహులతో నెటువలె సంభాషణ చేయుదును? ఎటువలె బొంకుదును? ఎటువలె విన్నపము సేయుదును? నే నజ్ఞాన చిత్తుండను. నాకేది యుపాయము? దేవా, వీరి స్వరూపములఁ జూచిన నాళ్వారుల స్వరూపులై యున్నారు. నేనేమి చేయుదును? చెప్పవే దైవమా!' అని యప్పుడు కృష్ణమాచార్యులు దుఃఖజీవుండై కన్నుల జలంబులు భూకాంత మీదం బడంగాకు, దనహస్తంబులఁ దన చెక్కిళ్లు తటతటఁ దాటించుకొని, మూర్ఛాక్రాంతుడై, కొంతవడిం జింతిల్లి, తెలివిఁగాంచి, యంతటను బొతకమూరి భాగవతులఁ గూడి సంభాషణ చేయఁదొడంగెను. 'ఓ మహాత్ములారా, (మీరు) కృష్ణమాచార్యుల తిరుమాళిగ నడుగుచున్నారు. (అ)యాచార్యుని పాదసేవకుండను

---

*తిరు + అడి + కళ్ = పవిత్రమైన పాదములు.

నేను, మీ కా మహాత్ముని సందర్శనము శీఘ్రమే దొరికింతును. మీ మహత్త్వ మాతనితో నానతీయుఁడు. ఆ యాచార్యునకు నమ్మిన హితుండ. మీ రెచట నుండి వేంచేసితిరి? మీ యాచార్య లెవ్వరు? మీ దైవం బెవ్వరు? మీ నామధేయంబు లేవి? ఆనతీయుండు, అ మహాత్ముఁడున్న తావునకు పనివినియెదను.' అప్పుడు పౌతకమూరి భాగవతు లన్వయించి (యిట్లనిరి). 'పదునొకండవ యవతారుండగు కృష్ణమాచార్యుల సందర్శనము మాకేవేళ దొరకునో? మా పూర్వాచార్యుల నామములు విన్నపము సేయుదుము. ఓ మహాత్మా, వినుము. మా పూర్వాచార్యు లుత్తమ సాత్త్వికులు. సప్త సాగరములకును, స్థావర జంగమాదులకును, సకలాచార్యులకును, పదునాల్గు భువనములకును, పదుగు రాళ్వారులకును, పదముగ్గురు భాగవతులకును, పరమపద నివాసుచే పరంజ్యోతి యైన స్వామికి పట్టు, ప్రమాణ స్వరూపజ్ఞాని తిరుమలాచార్యులు, మాకు పరమా చార్యులైన మహాత్ముండు. జన్మాదులు మగుడ రాకుండను మంత్రోపదేశం బానతిచ్చిరి. ఆ యాచార్యులు పరమ పదముం గనిరి. శ్రీ రామానుజ పాద సేవకులము. నారాయణయ్య, యాబళయ్య, యచ్యుతయ్య, లక్ష్మయ్య, శ్రీ చెన్నమయ్య మా నామధేయములు. కృష్ణమాచార్య లేకాదశావతారంబైన మహాత్ముఁడనంగాను, చాతుర్లక్ష గ్రంథ స్వరూపుఁడనంగాను, నా యాచార్యుల సందర్శనము మాకు దొరకునో దొరకదో యని, శ్రీయహోబిలము నుండి సింహా చలమున కేతెంచితిమి'. అనిన విని కృష్ణమాచార్యులు సంతోషమున వెరగంది, 'యీ పౌతకమూరి మహాత్ముల మహత్త్వము వినియుంటిమి. పటముపన్నించి, శ్రీ యహోబలేశుని, పటముచాటున నాట్యమాడింతురఁట! అట్లు గనుక, వీరి తిరువడిగళ్లు సేవింపవలయునని యపేక్షించి యుంటిమి. నా భాగ్యవశంబున నిచ్చటికి వేంచేసిరి. కృతార్థుండనైతిని. నా జన్మము సఫలమాయెను. కాలము కడఁగంటిని. మా పరమాచార్యులైన పౌతకమూరి మహాత్ముల వలన విరక్తిని బొందవలయు'నని (యెంచి) యంతట వారకామినుల మీఁది మోహము విడిచి, 'వైష్ణవలు దాసులతోడి సరసజ్ఞత చాలించవలయును. ప్రాకృతపు చెలిమిని పరిహరించవలెను. సంసారము నిస్సారము.* — తలమీసములు వపనక్రియ చేయించి, యాడుకట్టుగట్టి, యహంకార మమకారంబులు వీడి, యుత్తమ సాత్త్వికంబు గైకొనియెదను. నరహరి దాసానుదాసులకు దాసుఁడను. తొత్తును.

---

*ఇచట స్వల్పమైన గ్రంథపాతము.

తొండడను బంటును. స్వామి శ్రీపాద సేవకుండ నని కృష్ణమాచార్యులు దృఢ చిత్తుండై, శుచిర్భూతుండు గావలెనని యెంచి యప్పుడు, పొతకమూరి భాగవతులను దోడ్కొనివచ్చి, 'ఇవిగో కృష్ణమాచార్యుల ద్వార వాకిళ్లు. ఇచట మీరు వేంచేసి [కూర్చుండుఁడు] యుండుఁడు. ఆ మహాత్ముండీ సమయంబున సంధ్యానుష్ఠాన జపతపాది నిత్యకర్మల ననుసరించునో తెలిసి విన్నపము చేసెద'నని, పోవునప్పటి పోయి, తా పెడ ద్వారంబున వెడలి, క్షవరకునిం బిలిపించుకొని, తల మీసములు బోడించుకొని, స్నానమాచరించి, శిఖా యజ్ఞోపవీతములు ధరించి, కటి సూత్రమున కాషాయవస్త్ర మాడుగట్టుగా ధరియించి, లలాటంబున తిరుమణి తిరుచూర్ణములు ధరియించి, దండెయు చిటితాళంబులు సంధించుకొని, సంకీర్తన వాక్పూజలు సేయునంతట, పొతకమూరి భాగవతులఁ బిలువ నవధరించినఁ, దన సన్నిహిత కైంకర్యపరులు వోయి 'పొతకమూరి మహాత్ములారా, కృష్ణమాచార్య సందర్శనము మీకు శీఘ్రమున దొరుకును. ఈవేళ వేంచేయుం'డని పిలిచిన, సంతోషచిత్తులై, యంతఃపురమునకు వేంచేసి, కృష్ణమాచార్యుల తిరువడిగళ సేవించి, యడియేని దాసులమని యాచార్యుని పాదయుగళమునకు సాష్టాంగ దండప్రణామములు సమర్పించిరి. తమ ఫాలప్రదేశమునఁ గృష్ణమాచార్యుల తిరువడి గళ్ళద్దుకొని, 'యోమహాత్మా, మా జన్మంబులు పునర్జన్మంబులుగా నీడేర్చితిరి. అడియేలకు జన్మ పవిత్రంబాయెను. మీ సేవ ప్రసాదించితిరి. మిమ్ముఁ గనెడు భాగ్యము చేసితి'మని, కృష్ణమాచార్యులఁ బొతకమూరి భాగవతులు స్తోత్రము చేయఁగా, నపుడు కృష్ణమాచార్య 'లడియేని తొత్తును. తొండఁడను. జీలంబెండును. అపచారద్రవ్యము మూటఁగట్ట వద్దు. ఓ మహాత్ములారా, మీవలన నడియెడు సర్వవిముక్తిం బొందఁగలిగెను. అడియేని జన్మంబు పునర్జన్మం బాయెను. మీ దాస్యము నాకుఁ దొరకెను. ఓ మహాత్ములారా, లెండు'. అని పొతకమూరి భాగవతులను కృష్ణమాచార్యులు లేవనెత్తి స్తోత్రము చేసెను. అంతటఁ బొతకమూరి భాగవతులు లేచి, కృష్ణమాచార్యుల సందర్శనము చేసి నిలుచుండి, వారి ముఖారవిందంబు బొడగని, తమలోతా మెండొరులఁ జూచికొని పరమరహస్యముగా భాషించి, 'యితఁడె యాతఁడో' ననియుఁ 'దప్పదని'యు నిశ్చయించి, 'మనము కృష్ణమాచార్యుల సేవింపవచ్చిన ఫల మింతకు వచ్చెఁగదా: ఇతని శృంగార వైభోగములు మనవలన విఘ్నంబాయె'నని పొతకమూరి భాగవతులు తమ దవడలు తట తటఁ దాటించుకొని, యీ యపచార దోషము లెన్నండు తొలంగునో యని దుఃఖించుచుఁ, గృష్ణమాచార్యులతో సంభాష

ణము సేయ దొడంగిరి. 'ఓ మహాత్మా, ఇటువంటి వికల్పము నీకేమికి? నీవు పదునొకండవ యవతారుండవై చాతుర్లక్ష గ్రంథనామ సంకీర్తనలతో వాక్పూజలు సేయను కృష్ణమాచార్యులై యవతరించినావు'– అనగా, 'నడియని భాగ్యవశంబున నిచ్చటికి వేంచేసితిరి. కనుక నేను కృతార్థుండ నైతిని. మీరిచ్చట సింహాద్రినాథుని సన్నిధిని స్వామిని తాండవ మాడించవలెను. మీ మహత్వము సింహాద్రి యప్పుడు వినవలెను'. అనిన బొతకమూరి భాగవతులంజలిచేసి, 'యడియేల కధికారంబు లేదు. మీయానతి క్రమమున నటులే విన్నపము చేయుదు'మని, జగదీశ్వరుని పటము గట్టించి, శ్రీయోబళ నాథుని సంకీర్తన వలన స్వామిని తాండవ మాడించిరి. తాండవ వినోదుండై, నాట్యప్రమోదుండైన శ్రీయోబళ నాథునిఁ బొతకమూరి భాగవతులు తెరచాటునఁ దాండవమాడించి నప్పుడు కృష్ణమాచార్యులు భీతిఁ జెంది 'మిమ్ము నెఱుంగ లేక మీతో సంభాషణ చేసితిని. నేను మూఢుఁడను, కఠిన చిత్తుండను. ప్రహ్లాద నారదాదులైన పరమ భాగవతులు మీతో సంభాషణ చేయవలె. నేను నరజంతుఁడను. సర్వాపరాధములు క్షమించుఁడ'ని పొతకమూరి భాగవతులకు కృష్ణమాచార్యు లంజలి చేసి, సంకీర్తన వాకమీజలచే దండంబు సమర్పించెను. 'మీ సంకీరన పూజలు చాలింపుఁడని' పొతకమూరి భాగవతులను కృష్ణమాచార్యులనుచరించెను: పొతకమూరి వైష్ణవులు దండెలు తాళంబులు ధరణిపైదించిరి. 'అయినను, మా నేరుపులు గౌరములు, మీ తిరువడిని చేపట్టుడ'ని పొతకమూరి భాగవతులు కృష్ణమాచార్యులకు దండము సమర్పించిరి. అప్పుడు కృష్ణమాచార్యులు దండెయుఁ జిఱు తాళంబులు సంధించుకొని, పొతకమూరి భాగవతుల సన్నిధిని యడియేని విన్నంచునని, యాలాప వర్ణనలతో 'నమోనారాయణా'యని (విష్ణు) నామ గుణకథలు వచన భావంబునఁ గీర్తించెను, ఘుమ ఘుమ ధ్వనులు ప్రమోయఁగాను దండెమీటుచుఁ, దాళంబు లుగ్గడించుచు, పంచమవేద స్మృతులుగా, చాతుర్లక్ష గ్రంథ సంకీర్తన వాక్పూజలును చేయంగాను, సింహాద్రి నాథుండు నిజరూపంబున లీలావినోదుండై, బాలత్వంబునఁ బురబాలురలోన బాలుండై, కృష్ణమాచార్యుల తిరుమాళిగ సన్నిధినుండి యాడుచుఁ బాడుచు వచ్చి, శ్రీ కృష్ణమాచార్యుల తొడలమీఁదఁ గూర్చుండెను. ఆ శిశువుం జూచి పొతకమూరి భాగవతులు వితాకులై లేచి మెల మెల్లన సంభాషణ సేయం దొడంగిరి. 'కృష్ణమాచార్యులకు సంతాన ప్రీతి కలదని విందుము. ఆ బాలుఁడు గా బోలు'నని కడు వేడ్కతోఁ దమలోఁ దామన్వయించిరి. ఆ సమయమునఁ గృష్ణమాచార్యులు 'తికువళియందున్న యీ బాలుండెవ్వండొకో? నిత్య-కృత్యంబుగా స్వామి ద్వార సన్నిధిని

సంకీర్తన విన్నపము సేతును. ఈ బాలుని స్వరూపి మెన్నడును సేవింపలేదు.' అని పౌతకమూరి భాగవతులు వేంచేసిన సమయమందు సింహాద్రి యప్పని సంకీర్తన చేయుచున్నప్పుడు నపరత్న పంచరత్న సంకీర్తనలఁ జెప్పఁగాఁ, దొడలమీఁదఁ గూర్చుండియున్న బాలుండు, గంటమును, నాకులును జేతఁబట్టుకొని వ్రాయ దొడంగెను. అంతటఁ బౌతకమూరి వైష్ణవుల యనుజ్ఞను గృష్ణమాచార్యులు సింహగిరి నరహరి సంకీర్తన పూజలు చాలించి, స్వామికి దండ ప్రణామంబులు సమర్పించి, వైష్ణవుల సమీపించి, 'పెద్దలు బడలితిరి. అడియని గుడిసె కడకు వేంచేయుఁడు. మీసేవ యడియనికి ప్రసాదింతురు గాని. మీ ప్రసాద తీర్థము, తళియ ప్రసాదము నడియనికిఁ గృపసేతురుగాని. శీఘ్రమే వేంచేయుఁడని, పౌతకమూరి వైష్ణవుల వెంటఁబెట్టుకొని తిరుమాళిగెకు వేంచేసి, బాహ్యరంగమునఁ పటము గట్టించి, పటముచాటున పౌతకమూరి భాగవతులను బంతి గట్టుఁడని, యంతరంగమునకు వేంచేసిరి. అంత రంగమునఁ బటము పన్నించి, పటము చాటున సింహాద్రి జగదీశ్వరుని తిరువారాధన, యారగింపుఁడని తళియనిడి, భగవానుండారగించిన మీఁదటఁ బౌతకమూరి భాగవతులకు తళియ ప్రసాదమును, శ్రీ పాదతీర్థమును నిచ్చి, 'స్వాములారా, యడియని కైంకర్యమును గైకొనుఁడ'ని కృష్ణమాచార్యులు పౌతకమూరి భాగవతులకుఁ దండము సమర్పించెను. పౌతకమూరి భాగవతులు లేచి, కృష్ణమాచార్యుల కినుమడి ముమ్మడిగా దండములు సమర్పించిరి. తిరుగ బంతి గట్టిరి. తిరువాయి మొడి చదివిరి. అష్టాక్షరి నుచ్చరించిరి. ద్వయమును బఠించిరి. తిరు మంత్రమును చిన్నపము చేసిరి. కృష్ణమాచార్యులు కృపచేసిన శ్రీపాదతీర్థ తళియ ప్రసాదము లడిమేలకు మహా ప్రసాదమాయెనని తెరలెత్తి తమకించిరి. అంతట బాలుని సందేహము గలిగి* తమలోఁ దాము తెరలెత్తక నిలుమనిరి. కృష్ణమాచార్యుల చేరంచిలిచి, 'యో మహాత్మా, సింహాద్రినాథుని ద్వార సన్నిధిని మీరు సంకీర్తన పూజాన తీయు సమయమున మీ శిశువు తిరుమాళిగ యొద్దనుండి యాడుచును బాడుచును మీదరికి శీఘ్రమే వేంచేసి మీ తొడల మీదకెక్కి కూర్చుండెను. ఆ బాలుని సల్లాపంబుల సద్దు తిరుమాళిగలో వినవాడు. అతఁడెచ్చటికి వేంచేసినాఁడు? అతని నిచ్చటికి వేంచేయు మనుండు. ఆతని శ్రీపాదములకు దండము సమర్పించ వలయునని యపేక్షించి యున్నారము'ని కృష్ణమాచార్యులఁ గూడి విన్నపము

---

* 'బాలుని సందేహము తెలిసి' అని వ్రాతయందున్నది.

చేసిరి. అప్పుడు కృష్ణమాచార్యులు పొతకమూరి భాగవతుల సందేహమును దెలిసి, 'యీతండు మా శిశువు కాఁడు. మీ శిశువుండని వింటిమి. అడియనికి నటువంటి యధికారములేదు. అడియనికి మీరు(?) శిశువును గృపచేసి యేడవ వర్షంబు వెడలు సమయమందే మీ సాయుజ్యమున నీడేర్చుకొండిరి. ఆ బాలుకిని, మాకును బనిలేదు. మీ రహోబలేశని పటము చాటునఁ దాండవ మాడించఁగాను మీ నాట్య వినోదమున నుదయించెను. ఆ పరమ పవవాసుఁడు వేంచేయఁబోలును! భగవానుని మీ వలన నీ విధముగాఁ గంటిని! భాగవత కృపఁ కానము! భగవానుని కృపకానము! మీరు మా పరమాచార్యులై యన్నియుఁ దెలిపితిరి. తెరలెత్తుఁడు స్వాములారా!' అని కృష్ణమాచార్యులు దండము సమర్పించెను. అప్పుడు పొతకమూరి వైష్ణవులు గడు సంతుష్టినొంది యుప్పొంగి కృష్ణమాచార్యులను గొని మాడిరి. "ఓ మహాత్మా, నీవుదక్క దైవములేదు. నీవే కృతయుగమున, నివే త్రేతాయుగమున ద్వాపరయుగ కలియుగములకు కృష్ణావతా రుండవై జనియించినాఁడవు,[1] నీవు మహాత్ముండవగుదువు. మీ మాహాత్మ్యమును మేము గనుగొంటిమి. మీ యనుజ్ఞ వల్లను శ్రీపాద తీర్థ తళియ ప్రసాదములను బ్రసాదించుఁడని యా యాచార్యుని తిరువడిగళ్ళకు నొరగి యంగుష్ఠ ప్రమాణంబు పట్టుకొని దండ ప్రణామంబు సమర్పించిరి. 'మీ శ్రీపాద తీర్థమును, తళియ ప్రసాదమును, మా జన్మవిమోచనముగా భజించిమి. అడియేలకు నేట్లానతిచ్చెదరు? మగుడు శ్రీయహోబిలమునకు పని వినవలెను. అప్పన నవధరించుఁచుడ'ని యాచార్యులకు విన్నపము చేసిరి. అప్పుడు కృష్ణమాచార్యులు వైష్ణవ్రలతో, 'నోమహాత్ములారా, చాతుర్లక్ష గ్రంథసంకీర్తనలకు కొదువ లక్షయేబదివేలు విన్నపము సేయవలెను. ఆ నాటికి మీసేవ దొరుకునో? దొరకదో? అని చింతించఁగాను, నీ సమయ మందున మీరు వేంచేసితిరి. మీ సేవ కలిగెను. గనుక నెవ్వరికి వెరవను. కొదవ గాకుండను చాతుర్లక్ష గ్రంథ సంకీర్తనల బాక్పూజలు మీవలన మీ భండార ములకు (?) విన్నపము సేతును.[2] మా పిత్య పితామహులు నరకమునుం గొంతఁ గాంచిరి. మీ (వంటి) దయాకర వలననే నరక హేతువు వీడ్కొని సాయుజ్యమును బొందిరి. మీ ద్వారముల సన్నిధిని నా కధికారము (గలదు). అదే నిత్య నివాసముగాను, మఱి మరవకుండను పరమ పదము కృప చేయుఁడు.

---

[1] కృష్ణమాచార్యులు విష్ణుమూర్తి యవతారమని భావము కాబోలు.

[2] అనగా నీ సంకీర్తనలు వ్రాసి భండారమునఁ బెట్టింతునని యర్థముకాబోలు.

పరమ పదమునకు సాలోక్య సామీప్య సాయుజ్యములు మాకుండును. అంతరంగ బాహ్యరంగముంకు మీ యనుజ్ఞ పసాదించుఁడు. నూట యెనుబది తిరుపతులును, మీ దివ్య లీలావినోదములు. ఇఁక మీఁదట మీ తిరునాళ్లను, తిరుమేనను, మీ తిరువక్త్రమునకు ననున్నుగ్రహించుఁడు. ఇంతే నావిన్నపమని, పౌతకమూరి భాగవతులకు సాష్టాంగ దండ ప్రణామంబులు సమర్పించి 'యో మహాత్ములారా, వేంచేయుండ'ని యనినప్పుడు, పౌతకమూరి వైష్ణవులు హస్తంబులఁ దమ దవడలు వాయించుకొనుచు, 'మాకాచార్యాపచారంబు లేలమోపు గట్టెవవు? ఓ మహాత్మా' యని, కృష్ణమాచార్యుల కినుమడి ముమ్మడి దండములు సమర్పించి యాతని యానతినందు కొని మగుడ శ్రీయహోబలమునకు వేంచేసిరి. కృష్ణమాచార్యులు పౌతకమూరి వైష్ణవుల పిడ్కొని సింహాద్రినాథుని నగరికి నేతెంచి, సింహాద్రి నాథుని సందర్శించి దండప్రణామంబులు సమర్పించి, యీ మాయాప్రపంచ మెఱుంగలేను. పుట్టించుచుగిట్టించుచు యమునిచేత దెబ్బలకు లోనుజేతువు. యముని చేత నన్ని (బాధల) ననేక వేలేండ్లనుభవించితిని. నాకు మీరులేరో? నేను లేనో? సుఖదుఃఖంబులఁ బొంది, దుఃఖజీవుండనై మీ దయకులోనై మిమ్ముఁగాన లేక, పంచ మహా పాతకంబులలో మునుగు చుండంగాను, మా పరమాచార్యులైన పౌతకమూరి భాగవతులు వేంచేసి మిమ్ముం గనిపించిరి. వారి మహత్వము వలననే వెనుకటి కర్మములు పిడ్కొంటిని. నీవు బొంకుల కంచమవు. లంక చెఱుపు మర్కటుంబవు (!) నిన్ను నమ్మలేను! నీ చాతుర్లక్ష గ్రంథ సంకీర్తన పూజలకు లక్షయేబదివేలు కొదువ. ఆ సమయమందు మీ ఋణం బెట్లుండునో? ఇప్పుడే నాకు సాయుజ్యము కృపసేయుము. సర్వాపనాథములు పౌతకమూరి పరమాచార్యుల కృపవలననే మీతిరువడి ననుగ్రహింపుఁడు. ఇంతేనా విన్నపము. వినన వధరింపుఁడ'ని క్షీరాబ్ధిశయకుని వేడుకొనెను. క్షీరాబ్ధి వటపత్రశయనుండు భూకాంత సమయ ప్రభస్తుండై సింహాద్రి జగదీశ్వరునకు విన్నవించె.* పౌతక మూరి భాగవతుల యనుజ్ఞ వలననే యీ యపచారాపచారములు. మాతిరువడిపై కొలిచిన మీకు సాయుజ్యమునిత్తును. (అట్లుకాదేని) సర్వమునకు సర్వమైన యెందులకును నవధరించినట్టి నాయురమున వెలింగెడు (శ్రీకాంతకును) భూకాంత కును దప్పదును. సాలోక్య సామీప్య సాయుజ్య పదవులిత్తును. సమయ మొనరింతును. ఇందుకు దప్పితినా, పదుగు రాళ్వార్లకును, పదముగురు భాగవతులకును దప్పదును. (మీకు) పదవి గనిపింతును. ఇందుకుఁ దప్పితినా, పౌతక

---

* సింహాద్రి, జగదీశ్వరుడు– కృష్ణమాచార్యులు కావచ్చు.

మూరి భాగవతులకుఁ దప్పుదును. ద్వార వాకిళ్ల సన్నిధిని చతుర్భుజంబులోను, శంఖచక్ర గదాశార్ఙ్గఖడ్గాద్యధికారంబిత్తును. సర్వమును తిరునాళ్ళను, దిరుమేనకు, దిరువక్త్రంబు డెలిసి యవధరింతును. ఇందుకుఁ దప్పితినా, పరమ పదవాసుని పరంజ్యోతియైన స్వామికిఁ దప్పుదును. సర్వమునకుఁ దప్పనని, సిహోంగిరి నాథుఁడు శ్రీకృష్ణమాచార్యులకు నభయ హస్తముఁ గృపచేసెను. అనుజ్ఞ ప్రసాదించెను. అప్పుడు కృష్ణమాచార్యుల విన్నపము నవధరించెను. 'నేడుగదా నేను భాగ్యము సేసితి'నని వారి సాగరము లుబ్బినట్టి విధమనుభవించెను. మహా మేరువు శతయోజనములో పెరిగినట్లు కృష్ణమాచార్యులు పొంగెను. 'నేడుగదా, పరమా చార్యులైన పొతకమూరి నారాయణయ్య, యోబళయ్య, యచ్యుతయ్య, యనంతయ్య, లక్ష్మయ్య, శ్రీ చెన్నమయ్యగారల వలన పిత్రపితామహులకును, ప్రాకృతులకును, గనిమని సేవించిన యార్యపెరియలకును, శత్రుమిత్రులకును, పరమపద మిప్పించితిరి. కనుక వారి మాహాత్మ్యము వలన పరమపద మొక వరముఁ జేసితిని. పరమపద నివాసునిఁగడు గుత్తఁగొంటిని. పరంజ్యోతి నామనంబున నిలిచెను. నేడుగదా పరమ భాగవతుల శ్రీపాద పద్మంబులో సేవింపఁగలుగుట! నేడుగదా దాసానుదాసులకు దాసుఁడనగుట! నేడుగదా, సింహాద్రినాథుని వాకిళ్లు గాచెడు భాగ్యము గలుగుట! నేడుగదా, యతి రామానుజముని వరదస్వామి సింహగిరి చునియెడు దివ్యౌషధము నాహృదయమునకు దొరకుట! నేడుగదా, నూట యెనిమిది తిరుపతులను వెలయం గలుగుట! నేడుగదా మీతిరుమేను నవధరింపఁ గలుగుట! నేడుగదా కృష్ణమాచార్యులఁగాచి రక్షింపగలుగుట! ఆర్తజన బాంధవా! అనాథపతీ! సింహగిరి నరహరీ! ఇంతేనా విన్నపము! నమోనమోదయానిధీ!

31

విష్ణూ, ముకుందా, అనంతా, భగవాన్, అచ్యుతా, నారాయణా, హరీ, మురారీ, శ్రీరామా, నిరంజనా, పరమా(త్మా), పరిపూర్ణా, పరమేశ్వరా, పరవాసు దేవా, నిర్మల స్వరూపా, పరమపురుషా, పరంతపా, పరంధామా, పరబ్రహ్మ, అనుమీనామంబులోపల యష్టోత్తర శతనామంబులు శ్రీయఃపతి ముఖ్యనామంబులు. కేశవా, నారాయణా, మాధవా, గోవింవా, విష్ణూ, వాసుదేవా, అనిరుద్ధా, సంకర్షణా, హృషీకేశా, విశ్వంభరా, వైకుంఠవాసా, వేదాంగా, వామనా, అహల్యా శాపవిమోచనా, చక్రధరా, జనార్దనా, పరంధామా, వేదాత్మకా, కపిరాజా, యజ

పురుషా, అను మొదలుగాఁ గల నామంబులు శ్రీ కేశవుని యుపనామంబులు. శ్రీకృష్ణా, త్రివిక్రమా, పుండరీకాక్షా, ఉపేంద్రా, నారసింహా, పీతాంబరా, శారధరా, శౌరీ, దైత్యారీ, వనమాలీ, విష్వక్సేనా: మధుసూదనా, తీర్థనాథా, శేషశయనా, అంబోనిధీ, వేదోద్ధారా, యజ్ఞవరాహా, ఆదికూర్మా, లంకేశ్వరా, హంసనయనా, సప్తాంగా, అనునీ యిరువది యొక్క నామంబులు మొదలుగాఁగల క్రియా నామంబులనంతములు. 'అగాధో .అర్థో విష్ణు' వనెను. 'వేదాక్షరం శివయంతి' యనెను. 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' యనెను. ఆ శ్రుతివలన హితపురాణ రహస్యములు చెప్పిరి. అకారాది సర్వ వర్ణముల కర్థములు (మీ) నామములే. రాజస తామసములు దైవములకుఁ గలిగెనేని, యర్థాంతర రూపవర్ణము లంతర్యామి ప్రతిపాదకములు.* ఇతర దైవతముల యందు వేదార్థములు గావు. అది యెట్లన్న శంఖం బింద్ర జితేంద్ర చంద్ర కౌమందూక రూపములందున్నను నర్థములు వేరైనట్లు. బ్రహ్మ విష్ణు మయం జగత్,. శ్రీకృష్ణ కువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

32

దేవా, ద్వ్యయమున కధికారి యెంతటివాడు ? కోపము శాంతము నిర్గజ నింద్రియ జయాపరుడు గావలెఁగాక ద్వ్యాధికారి.[1] తన్ను దానెఱుంగక చూషించు కపటాచార డాంబిక పరుండు దాఁగాక ? వికార చూషణ రహిత హృదయాభిమాన పరుండు దాఁగాక ? కీటకాంకుర జన్మంబున హతుండు దాఁగాక ? భాగవతాపచారంబును దాఁ బొందక ? అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ :

33

దేవా, శ్రీరామ మంత్రోచ్చారణంబున వాల్మీకి పురాణ పురుషోత్తము డైన యాదినారాయణమూర్తి దివ్య శ్రీపాద పద్మంబులం జూచి యపేక్షించి

---

*అర్థము స్పష్టముగా లేదు.

[1]వైష్ణవు లుచ్చరించు రెండు వాక్యముల మంత్రము ద్వ్యయము. దానిని జపించువాడు ద్వ్యాధికారి.

నపుడే రామ మంత్ర రహస్యమునఁ గృతార్థుండయ్యె. అది గాక, శ్రీ జగద్ధరి తుండైన దేవుండొకండెయని వ్యాసులు 'సత్యమ్ సత్యాత్మకమ్ దేవమ్ : సత్య వాక్య దృఢ వ్రతమ్ : సత్యః పునః పునః సత్యము ధృత్య భుజ ముచ్యతే : వేదశాస్త్రోత్పరమ్ నాస్తి : నదేవః కేశవాత్పరమ్॥' అనిన శ్రుతి వలన భాష్య కారులు విజ్ఞానులు. అత్యంత విభవమున పరాశర పుత్రుండు చాటిన లక్షణము బ్రహ్మంబని వశిష్ఠుడు తాత్పర్యంబునఁ బరంగె. దుర్వాసుండు 'మాధవ శ్రీధర' వాసుదేవుండు (?) 'హృషీకేశ' బ్రహ్మ రుద్రాదులు 'సంకర్షణ గోవింద' మంత్రములను, విశ్వామిత్రుండు పురాణ పురుషోత్తమమును, శ్రీ కశ్యపాదులు దామోదరమును, శాండిల్యుడు శ్రీ నాభమును, గౌతముండ నిరుద్ధ త్రితయమును, నారదుండు శ్రీ నారాయణ మంత్రమును, పుండరీక కణ్వాదులు త్రివిక్రమమును, మాండవ్యుడు జనార్దనమును, నాత్రేయుండు శ్రీకృష్ణ మంత్రమును, సనక సనందన సనత్సుజాతులు వామన మంత్రమును, జమదగ్ని శ్రీరామ మంత్రమును, శుక్రుండు శ్రీ నారసింహమును, బృహస్పతి [నమో] నారాయణమును, నుపా సించిరి. వీరు మొదలైన పుణ్యులు సహస్ర నామంబులను, మఱియును మహా త్మ్యలనంతంబులు గూడి యనంత వేదముల నియెడు వేదవేద్యం డనంతబులం బ్రబలి యుండునని, యనంత కోటి రవి ప్రకాశంబైన దేవుని యనంత నామంబులఁ గొనియాడిరి. వాల్మీకి ఋషి పుంగవుండు భరద్వాజున కెఱింగించె. నీవు నృసింహ మంత్రంబు పఠించి పరమ పుణ్యుండ వైతివనెను. భరద్వాజుండును నుత్తర విహారమున కుతూహలుఁడై ఋష్యశృంగుని సేవించి యతనిచే సకల పుణ్యంబులు వినఁదలచి (పోయి) శ్రీవత్స మహా ఋషీశ్వరుండును, భృగుండు నగునాతనికి నేత్రమున తారకు (నకు) దండ ప్రణామంబు సేసి మునీశ్వరునితో, 'భృగుఁడెవ్వఁడు ? ఆది మూలంబేది ? అతఁడు దేనికొఱకు భూలోక భువర్లోక సువర్లోక (బులం దిరిగె ?) కైలాస వాసునినేల శపించె ? బ్రహ్మనేల శపించె ?[1].....వాసుదేవుని శరీరంబున కెరగిన శిశుపాల దంత వక్త్రుల[2].....స్వామి నిజమంటపంబున కేగి దేవదేవుని భావించి పరిపరి గుణంబుల సేవించి, సకలలోక వృత్తాంతంబులు విన్నవించి, జగద్భర్తుని నామామృత రసమును సేవించినవాఁడై, యాత్మ సంతోషంబున వారిమీద పాదంబులు సాచి మఱచి నిద్రించిన, పాదంబున నమరిన నయన పంక్తి సహస్రముల (హరి) నీరు గావించె.

---

[1], [2], ఇవి గ్రంథ పాతములు– కొన్ని వాక్యములు పోయినవి.

భృగుండు నిద్ర మేల్కొని నివ్వెరగంది, చిక్కితినని, శ్రీకాంతుని శరణు జొచ్చినఁగాని పనులు తీరవని తెలిసి. యాదేవు పాదపద్మంబుల కొరగి, భీతుండై, మహాత్మా, నిన్నుబాధించి. తన్నితి. లోపమూలంబిని. నానేరమెంచకు. ననుఁ గృపఁ జూడు. నీ బంటునైన నేను నీచమతులైన మునులకెల్ల నాత్మలోపత మూలంబు నీవని నీచరిత్రము జెప్పి, కనులఁ గప్పిన కర్మపాశము తోడను స్తోత్రంబు లుచ్చరించేసెద. అచ్యుతానంతుని దివ్య శ్రీపాద పద్మంబుల నమరిన తీర్థ ప్రసాదంబుల భువిదారుల కెల్లఁ బుణ్యంబుల నీవ దయ దనుపు(ము). అమరేంద్రవంద్యా'. అని యాది మూర్తిచే నలరిన వేడ్కలెల్ల సమకూడ నానంద మంది, జిహ్వా శుచిగా శ్రీ జగన్నాథుని పాదతీర్థములఁ గాని పాపములు వీడరావని మునులకెల్ల నెఱిఁగించి పుణ్యులంజేసె. ఇది యుత్తర...[1] యతిరామానుజా, అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

34

దేవా, (ఏక) శిలానగరమనియెడు నొకపట్టణమందు నగసాల వరమ సేవ్యుండుత్తముండు. (అతఁడు జీవయాత్ర) సమాప్తంబు సేసె. అంతట నాతని ప్రియపత్నియైన సతి, శవంబునకు విమానంబుగావించి చిత్ర విస్తారముగా శృంగా రములు తన ప్రాణవిభుని దేహంబున నొనరించి, కనక మయ ప్రాకార పట్టణ వీధియందు[2] సమాధికెక్కించు కొని, నమాధిక్రియకుఁ బోయెడు కామిని, శ్రీకృష్ణ మాచార్యులఁ గనుంగొని, సాష్టాంగ దండప్రణామంబు సేయఁగాను, నంతనేను, 'దీర్ఘాయుష్మంతురాలకై యుండు'యని యాశీర్వాదము సేసితిని. ఆయింతి 'నాకెక్కడి దీర్ఘాయుష్యము? ఓమహాత్మా! నాపతికై లాసమున కేఁగెను. నేను సమాధికిఁ బోవుచున్నదానను.' అనిన నేను మహాశ్చర్యమంది, మీదాసుని వాక్యము వృథపోవచ్చునాయని 'ఓన్నమోకారాయణా, శ్రీమన్నారాయణా,' యని దండె యుఁ జిటి తాళంబుల ఘుమఘుమ ధ్వనులతో మీ దివ్యనామ సంకీర్తన చేయఁ గాను, గొంత తడవునకు శవమునకు ప్రాణము వచ్చి దిగ్గనలేచి, శ్రీకృష్ణమా చార్యులకు దండము వెట్టి, 'యోమహాత్మా, మీ మాహాత్మ్యంబునకు కైలాస వాసుఁడు (కరుణించె). నీనిమిత్తంబున శ్రీకృష్ణమాచార్యులు వైకుంఠపతినిఁ

---

[1]— ఇచట గ్రంథపాతము.

[2]'కనకమయయ పట్టణ ప్రాకార గగనమధ్య వీధియందు' అనిప్రాతప్రతి.

దారుచున్నాఁడు. నీవు శత వర్షంబులు లోకమందు భోగభాగ్యము లనుభవించుమని యానతిచ్చి శివ కింకరులచేత మరలఁ దోపించఁగా వచ్చితి'నని విన్నవించెను. శ్రీకృష్ణమాచార్యుల కరుణించిన కరుణా కటాక్షవీక్షణముల నోదేవా, యీజీవిని రక్షింపఁ జేసితిరి. మీ మహత్వంబు నుతింప నేనెంతవాఁడను? ఆశ్రిత రక్షకుండవు. అనాథపతీ, స్వామీ, సింహగిరి వరహరీ, నమోనమో దయానిధీ!

35

దేవా! అన్నమయంబుల వలనఁ ద్రిగుణాత్మకంబైన పంచేంద్రియంబులు దయించు. వంచేంద్రియంబుల కాలయంబై సప్తహితవులు నివాసంబై విషయాతుర మమతలఁదగిలి జీవుండు సకలాశాబంధకుండై యుండు. కావున పుత్రైషణ దారైషణ ధనైషణంబని యెడు మాయయాత్మ. తిరుమంత్రాపేక్షలను, నరిషడ్వర్గంబులను జేఁజిక్కించుకొని బడలదు. చావున కెక్కడి కులము? తనువు చేమనము, మనముచే ధనము, ధనముచే కనకము. ఇట్లు జనులకుఁ దమో గుణంబులు దమించుఁగాన ననుదినము మీపద ధ్యానమునందగిలి యుండఁదగును. మేమాయ, నిర్మలోదకంబునఁ బ్రతిబింబంబు గానవచ్చిన క్రియ మనంబునఁ గాన వచ్చును. దేవా, ఘనతరంబగు నాచార్య కరుణా విశేషంబు వలన నష్టాక్షరి మంత్రోపదేశంబు సేసినను, సూర్యప్రకాశంబు చేతఁ, జీకటి పాసిన క్రియ, నాసంసారార్ణవము లీదఁదలచితిని. శ్రీకృష్ణ కుర్యాచ, స్వామీ సింహగిరి నరహరీ, నమోనమోదయానిధీ!

36

దేవా, ఇఁక నేనేమి చేయుదును? దైవమా, నాపూర్వ కర్మంబు లన్నియుం గూడుకొని సతులై, సుతులై, సహోదరులై, బంధువులై, మహిత శత్రువులై యనేక తెఱంగుల నన్నుజెనఁగొని పోనీయక వేపుచున్నవి. నేనేమి చేయుదువో దైవమా! కామములై, కోధములై, మోహములై, మదములై, మాత్సర్యములై, చలములై, విద్యుద్విడంబంబులై, త్వక్చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణంబులై, యనేక తెఱంగుల నన్ను బోనీయక వేపుచున్నవి. దైవమా, ఇట్టి నాదుష్కర్మంబులన్నియుం బెడఁబాపి, దాసాను దాసునిగాఁ జేసి రక్షింపవే! అఖిల జగన్నాథా, అఖిల జగదానంద మూర్తీ, జగజ్జీవనా, జగన్నివాసా, అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

37

దేవా, త్రిమూర్తులాదిగా నీవిశ్వమజాండము లోపలిది. ఈ రీతి ననంతము లైన బ్రహ్మాండ కటాహములే మేని యణువులు. ఇవియే దిగ్వలయంబులై యిన్నింటిలోపల వెలుగొందు. ఓ సింహగిరి నరహరీ, తేజో మహితమై మీమహిమలిట్లు బ్రహ్మాండములై పరగుచు నాదిమ బ్రహ్మమై రజింల్లు. పరబ్రహ్మమై శోభిల్లు. తారక బ్రహ్మమై వర్ధిల్లు. ఇది నిర్గుణమై పరమాత్మమున నణగు. ఇది సగుణమై విరాట్పురుష రూపంబుతో నుండు. ఇది గుణ సంయుక్తమై త్రిమూర్త్యాత్మకము దానగు. అట్టి నారాయణ మూర్తియై యఖిలాత్మ తానగు. అట్టి యనంత వేదాంతముల కునికి. అట్టి యపవర్గ మోక్షమునకు, మనుష్య ముక్తి కైలాస వైకుంఠ బ్రహ్మలోక గీర్వాణములు మాసింహగిరి నరహరి యిచ్ఛావిహారములు. స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

38

దేవా, నిత్యపదంబైన మీ దివ్యనామ సంకీర్తనఁ బఠింపనేరక సర్వదేవతలు సాక్షియైన భర్తను విడచి పర పురుషుం గోరు వ్యభిచారిణి విధంబున నున్నవాఁడను. నన్నుగృతార్థుఁ జేయవే! అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

39

దేవా, స్వస్తి. సమస్తలోక విస్తారకా, శ్రీ పురాణ పురుషోత్తమా, శ్రీలక్ష్మీ కుచ కుంకుమాంకిత వక్షస్థలా, గాంభీర్య ధైర్యా, సనకసనందన సనత్కుమార కపిల నారద మునీంద్ర వందితా, ప్రహ్లాదార్జునాంబరీషప్రియా. రుక్మాంగద గజేంద్ర సేవాలాలితా, భృగు భరద్వాజ మాండవ్య మార్కండేయ గౌతమ సనకాది మునిగణ సేవితా, శ్రుతిప్రియ పూజితా, బ్రహ్మాది సురముని హృదయ స్థితా, త్రిమూర్త్యాత్మకా, నైర్ఋత వరుణ వాయు కుబే రేశాన్యాది దిక్పాలేశ్వరా, లక్ష్మీనారాయణా, యమునోత్పల లోకసాకారా, బింబాసమ నవరత్న ఖచిత పాంచజన్య భవ్య జ్వాలాభిరామా, అర్కమణి గణాంకిత సందర్శన గరుడ ధ్వజా, అనంత శయనా, క్షీరాబ్ధి శయనా, అనేక దైత్య నిర్జిత దోర్దండా, మత్స్య కమఠ వరాహ నారసింహమూర్తీ, వామన జామదగ్న్యరామ దశరథరామ రామకృష్ణ బుద్ధ

కల్యావతారా, కార్త్యవీర్య సహస్ర బాహుఖండనా, విలువిద్యా విక్రమ ప్రియానుగ్రహణోత్తా, గంగా ప్రవాహోద్బాధిత లోక జాతశ్రేష్ఠా, జ్వాకరాళ వైశ్రవణ తదీయ రచితార్థ రాక్షస ప్రళయాంతకా, హేమ సుచరిత్రా సమేతా, సకల రక్షణ సంపూర్ణా, హలాయుధ ధరా, దేవకీ వసుదేవ ప్రియాత్మజా, యశోదానంద వర్ధనా, కుక్కుటాసుర భస్మాసుర శకటాసుర ధేనుకాసుర ప్రలంబాసుర గర్వమదదర్వీకరా, బల భద్రానుజా, బృందావన లీలా వినోదాబ్ధి రామాభిరామా, సకలాంధకార మార్తాండా, (రుక్మిణీ) మనోవల్లభా, సత్యభామా మానస సరోవర రాజహంసా, జాంబవతీ ముఖ సంపూర్ణ చంద్ర చంద్రికా చకోరా, మిత్ర విందా ప్రమేయా, షోడశ సహస్ర గోపస్త్రీ హృదయానుకూలా, అనాది బ్రహ్మచారీ, పాండవ పక్షపాతీ, గాంధారీ పుత్రమిత్ర దవానలా, సకల సన్నుతా, ఆపదోద్ధారకా, శ్రీకృష్ణా శరణాగత వజ్రపంజరా, దివిజ బ్రహ్మాది వంద్యా, ఉగ్రనఖ త్రిపుర భేతాళా, కరి నిర్వాపణా, దుష్ట నిగ్రహా, శిష్ట ప్రతిపాలకా, ధర్మరక్షకా, అశ్వపుర ఘట్టన నిపుణా, అనంతావతార లీలావినోదా, శంఖచక్ర గదాశార్ఙ్గ కోదండ సకలాయుధ ధరా, పద్మవనమాలికా ధరా, వేద వేదాంత వేద్యా, కుసుమిత మకర (తోరణా) పత్రాలంకారా, శ్రీ పుండరీకాక్షా, శ్రీ నృసింహమూర్తీ, శ్రీ సహస్రనామా, శ్రీ యనంతనామ ప్రసన్నా, శ్రీ మద్భగవాన్ శ్రీనివాస సర్వేస్వర శ్రీ లక్ష్మీసమేత శ్రీ కృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

40

దేవా, జయజయ, పరమపురుషా, పరమ పదనివాసా, పరంధామా, పరతత్త్వ ప్రకాశా, అచలాచలా, అనుపమా, ఆదిపురుషా, అపరంపరా, అవ్యక్తా, అగణిత గుణానందా, అమరేంద్రనంద్యా, అభయ స్వరూపా, అఖిల బ్రహ్మాది జనకా, విశ్వంభరా, విశ్వతోముఖా, శాశ్వత సచ్చితానందా, ఏకరూపా, త్రయ రూపా, పంచరూపా, అష్టరూపా, దశరూపా, శతరూపా, సహస్ర రూపా, అక్షయ లక్ష విచక్షణ ప్రమోదా, విచక్షణాలంకారా, నమో, విభీషణ మోక్ష కారణాయ, శ్రీ కృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

41

దేవా, మీ దివ్యమంగళంబైన ద్వయ తిరుమంత్రాచార్య కృపాకటాక్షము వలనఁ బుట్టిన మనుజుండు క్రితమున దుర్జనుండయిన నేమి? అతండె మీ దివ్య

పదంబును బొందును. అది యెట్లన్నను; సకల లోహముల ఖండించెడు లోహమును, వేదశాస్త్రములు వ్రాసెడు లోహమును పరుసవేది సోకినట్లు. పెద్దలైన ప్రపన్నుల మేదినీ సురుల నాచార్యులఁ తల్లిదండ్రుల నవమానము సేసి తిరస్కారము లొనరించిన దుర్మాంధ్రుండనంత కోటి బ్రహ్మకల్పంబులందు క్రిమి కీటకాదుల సంగతి నొక్కడే చరించుచుండు. అది యెటులన్న వినుఁడు. తొల్లి యింద్రమహారాజు మహాత్ముల తిరస్కార రూపంబునఁజేసి కుంజరయోనియందు జనియించి, మహాకుటిల పడి మజి యెట్లు ఖరవంశంబున ముక్తుండాయెను? ఇది మీ లెఱుఁగరా? సకల జగద్విదితము. శ్రీకృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

42

దేవా, మీ ముఖారవిందంబున వెలసిన బ్రహలోకాధికార పరుండై యనంత కోటి వేదశాస్త్ర పురాణేతిహాస వర్ణంబులు వర్ణించి, యూహించి యనేక యిడుమలం బొరలుచుండె. మీమాయ దలంపనెవ్వరి వశము? దేవా, నిత్యవినోదా, నిత్యకల్యాణా, భోగ భాగ్యసంపన్న దేవతా మూర్తివి. దేవదేవోత్తమునుండవు. విధాన కల్పుఁడవు. దేవకీ పుత్రుఁడవు. నిర్మల చతురుండవు (చరితుండవు). పారిజాతాపహార పరమ పురుషుండవు. పరంజ్యోతి, పరబ్రహ్మ రుద్రాదులు మీపాద యుగళంబులు కానంగ రాని మాయాప్రకాశంబవై విహరింతువు. దేవా, కాశిలోన తారక బ్రహ్మ రామ మంత్రముల రుద్రుండు మిమ్మునుతియింప (దోషంబుల) దొలంగె. ఆ కాశిలోన పార్వతీదేవి సహస్రనామము లొనర్చి భక్తిఁ జిత్తమునఁ జేర్చి గ్రక్కున మోదాపె* ఓం, రామరామ రామరామా, అనాద్యఖిల లోకారాధ్యా, నిత్యజగత్రాణా, నిత్యనిర్వాణా, సత్యవ్రతాధీనా, ఆత్మబంధుజనరక్షకా, పరమాత్మా, వినుము. తల్లివి తండ్రిని దాతవు నీవు. భ్రాతవు నీవు. నీవంటి తేజోమణి నాకుఁగలుగంగా పాశబంధము పీడెను. మోక్షసాధనంబులు మునిగణ వర్గజాలంబుల కుపదేశించిన నుపనిషద్వాక్యంబుల మిమ్ముఁగానంగలేరు. మీకథలెల్ల మీనయనంబులు. సూర్యచంద్ర మండలంబులఁ బ్రకాశంబులై యుండును. మీతిరు మేనుదీప్తుల, ఋషులు, ద్వాదశాదిత్యులు నవబ్రహ్మలు నేకాదశ రుద్రులు చతుర్దశ భువనంబులు నింద్రాది దేవతలు ననేకముఖంబులై యుందురు. దేవా,

---

* మోదాటు-ఈ పనము కష్టము కాన్పించదు-ముక్తిఁజెందు కావచ్చును.

మీదిరుమేనఁ గలిగిన దివిజులకు మాయ మహా ముఖంబులై తోఁచు దేవా, మీమాయా దివ్వస్వరూపంబులై నట్టి తేజోమణి రవి ప్రకాశంబున రవి నిద్ర మేల్కనంది దివిజులకుఁ గనిపించె. మీమాయలు గానక దేవా, తిరుగుచుంరురు. ఇంద్రాది దేవతలు తిరిగి మీయండుఁ గలిగిరి. శ్రీకృష్ణాయని స్తోత్రముఁ జేయఁ గలిగిన మతి తక్కిన దైవతంబుల మీదం గానరు. బ్రహ్మరుద్రాదులు మిమ్ము వర్ణించలేరు. అనాథ నాథాయని స్తోత్రంబు సేయ నీ జన్మంబు గలిగెను. మీనామ సంకీర్తనము వలన మిమ్ము, గంటిని. మీదాసులఁ గంటిని. చాతుర్లక్ష గ్రంథ సంకీర్తనములలో నొక్క సంకీర్తన పలికిన వారికి పలికించిన వారికి విన్నవించిన వారికి, లఖించిన వారికి, సాలోక్యసామీప్య సారూప్య పదవ్రలిత్తురు. దేవా, మీరు నాకిచ్చిన వైకుంఠం చిత్తురు. మీయాన మీచరణంబులాన. తప్పదు తప్పదు. సుకృతమే సాక్షి అనాథపతీ. స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

43

దేవా, *నేను భూప్రదక్షిణము సేసి, లోకములు సూచి, మాతాపితామహా లకు పుణ్యక్షేత్రంబులఁ గృష్ణార్పణ బుద్ధిగామదాన ధర్మంబులు సేసి, శ్రీ యహో బిలమును, శ్రీరంగంబును, వేంకటాచలంబును, కాశీక్షేత్రంబును, ద్వారకంబును, నయోధ్యయును, శ్రీ పురుషోత్తమును జూచి, దేనా, మీ గృహంబున కరుగుదెంచిన కవాటంబులు మూయ మీకుఁదగునా? అజ్ఞానిని. అపరాధిని. సర్వేశ్వరా, నీవెతప్ప నితఃపరంబెఱుఁగననినఁ గవాటంబులు దెఱచిన, స్వామి సన్నిధికింజని స్తోత్రంబు సేయం దొడంగిన స్వామి ప్రత్యక్షమై, నీవునా సన్నిధిని దాసుఁడ వలెఁగాక పొడగనవా యని యానతిచ్చిన, దేవా, (నీవు) జననియు జనకుండవు. దేవా, శిక్షవు నంతటి తప్పు చేసినాను. తెగ సంజ్ఞ చేయవచ్చునా యనిన స్వామి తిరోహి తుండాయెను. కృష్ణమాచార్యులు తన గృహంబునకుఁ బోయెను. కృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

44

దేవా, మీ దివ్యనామ సంకీర్తన మెవ్వండాయె నేమి, చేయఁగా విని, యిది హీనము. ఇది హెచ్చు. వర్ణంబులు గావని నిషేధించిన వారరువది వేలేండ్లు

---

*ఈ రెండు వచనములకు మధ్యమున కొలది సంస్కృత వాక్యములతో నున్న ఒక చిన్న వచనము (3 పంక్తులు) కలదు. అందేమియు విశేషము కాన్పించదు.

నరక గోళంబునుం బొందుచుండి యటమీద పిశాచత్వము బొందుచుందురు. దేవా, మీ దివ్యనామ సంకీర్తన మెవ్వరు నుతియించిరి. వారెపో మీ పరమ భాగవతులు. వారెపో యనేక శ్రుతులు పలుకుచుందురు. దేవా, అభ్యసింప రానివి రెండు. ఆచార్య కటాక్షంబొకటి. అటుమీద (మీ) దాసుండగుటొకటి. దేవా, బహుచింతా సంతతమై చరియించెడు వాయువువలెనే యొక మార్గమనక నీ మనసు బహు రతింబొందు. అనేక వికృతులం బొందు. చిత్తమా, కైవల్యమునకై నుతింపనే. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

45

దేవా, (శ్రీ) పర్వతంబునకుఁ బోయి శైవులగుదురు. తిరుపతులఁ జూచి వైష్ణవులగుదురు. శక్తిమతంబును జూచి కుశాలులగుదురు. ఇటువంటి మనస్సంచలనమునఁ గదా రౌరవాది నరక గతియై యిహపరములు లేకుండుట! ఆత్మజ్ఞానులైన జనులే మతాభిమానులు. శాస్త్ర వైరాగ్యములలో బాధలు చెప్పంబడు. వానినే యవలంబనము చేయుదురు. ఈ మత మమత్వాదులం దిరిగెడు నట్టి కాముకులందు నేనేముందు. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

46

దేవాఁ కోశమున నొంటరిగాఁ జిక్కి యా కోశమునఁ జేరిన కోకిలం జూచి కాకులు దాని నటునిటుఁ జన నీకఁ జిక్కింపఁ జేసిన క్రియను, జిక్కువడి యున్నాఁడను. సంసార తరంగములు మునుఁగు పరచిన తెలివిఁ బొందని జంతువును. ఋషాది నానా విధముల (జంతువులు) నారపీమవలె నన్నులమి పట్టి యున్నవి. ఆ కర్మలనవరతము హరిభక్తిం దేలనీయవు. ఈ జంతువును కర్మముల నణంచి సుకర్మిని జేయుమయా, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

47

దేవా, బహువిద్యలు (గల) వారినిగాఁ జేసి బహు రూపంబులఁ బొందఁ జేయకుము. ఏ వర్ణమైన నేమి? మీ దివ్యనామగుణ సంగతి గలుగఁజేసి, మీ దాసాను దాసునిగాఁ జేయవే. కరుణాంబుధీ, శ్రీకృష్ణకువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

48

దేవా, గరుడని చేతఁబడి యున్న భుజంగము క్రియను, కర్మముల నగపడి యున్నాఁడను. నిరంతరము దుర్విషయాటవిలోఁబడి వెలువడు త్రోవఁ గానక చిక్కి యున్నాఁడను. దేవా, సుజ్ఞానంబను తెలివినిఁ బొందక (యున్న) యీ దుష్టనకు నజ్ఞానంబను నడవిని ఛేదించి పరమజ్ఞాన మార్గము కరుణించవే. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

49

దేవా, ఎనుబది నాలుగు లక్షల జీవరాసుల యోని ముఖములందు జనియించిన యాది జీవుండవట! ఆ మీద మీగుణ కథనము తెలిసికొనుట నా మీదట నాచార్యుల కృపఁజేయుట, నీ సుదర్శన పాంచజన్యంబులు ధరించుట, నా శ్వేత మృత్తికా చూర్ణ ధారణంబగుట, నావిరజానదిం దాటఁ జింతఁ జేయుట, నాచరమార్థంబనియెడు తెప్పఁగట్టి యాద్వయ మనవరతంబును సంధించుచు, నంబు జావతారుండగుట, నామీద నిజపుర ప్రవేశంబగుట, మీ సందర్శనంబు గలుగుట, మీచున తా నైక్యంబగుట, నీ యనంతకోటి సూర్యప్రకాశముతో ప్రజ్వరిల్లెడు (మూర్తి దొరకుట) నిట్టి ఫలంబు లొకటొకటియై తోచెడు దేవా, అఖిలాత్మకర్తవై, సింహగిరి పతివై, యనేక జన్మార్జితమైన పాపిని కరుణించవే. పరమపదమం దెన్నడు దొరకునో మీ చరణారవింద మకరందము! దీనబాంధవా, సింహగిరి నరహరీ, నన్నవలోకింవుము దయానిధీ!

50

దేవా, దేహయాత్రకు మిగిలిన యర్థ సమర్పణ ముఖమ్యుగాదు. తన్నుడిగి చేయు సమర్పణం బుత్తమాధికారంబు. అనాథపతీ, సింహగిరి (నరహరీ,) శరుండను. అవలోకింపుఁడు దేవా, జగదీశ్వరుం డితఁడేయని నిగమము లెల్లను నీ యనంతకోటి సూర్యప్రకాశముతోఁ బ్రజ్వరిల్లెడు. (మిమ్ము గుఱించి) చెప్పఁగా నెఱుంగక, దేవతాంతర మతాంతర సాధనాంతర ప్రయోజనాంతరంబులం గోరెడు వాఁడు ద్విజుండుగాడు. శ్రుతి ప్రమాణము చాటుచున్నది. అటుగాన నానాథపతి స్వామీ, సింహగిరి నరహరీ, మిమ్ము నెఱుంగని ద్విజున కేదిగతి? ఎఱింగింపవే దేవా, ప్రాణము లిహమునఁ జరియింపుచు, దేహాత్మ డెందముల వసియించి, భుజియించి [నవనిపూత] భువన [పాలన]

రక్షకుండయిన పురుషో త్తముని కృపకు దూరమగుట గాన నిహమున కష్టుండు గాఁడు. మాంస భక్షకులే రాక్షసులు. అటుగాన హింసచేయరాదు. - ఇందుకు సాక్షి యధార్థము. నాయనా; మా సింహగిరి నరహరి సకలాంతర్యామి యగుట, సకల భూతాత్మకుండగుట, సకల పరిపూర్ణుండగుట, సకల జీవ దయాపరుండగుట, సత్యమే సాక్షి. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

51

దేవా, పరమ పురుషా, దేవా, దయాపరా, పరమ ధర్మనికరా, దుఃఖ విమోచనా, మంగళాకారా, దోష నిగర్హణా, నిరవంద్యా, నిరవధికా, నిత్య నిరంజనా, నిర్వికల్పా, నిరాలంబా, నిరాశ్రయా, నమో, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

52

దేవా, సత్యద్విజుండు చండాల సతివలన సంతతిఁ బడసి నటువలెను, ప్రపన్నురాలు గాని భార్యనేల దలంచిన యట్టివారెల్ల(ను). అనాథపతీ, స్వామీ సింహగిరి, నరహరీ. పరో.....రు*. కాన సింహగిరి దేవా, పరమపద వాసుని దయను, భూలోకంబునఁ బుట్టవలసి, సంతూరను జనియించి. (దుష్ట నక్షత్ర) వ్యతీపాత యోగంబునఁ జనియించి యండెనని, తన్నురోసి తన జననీ జనకు లంధకారంబైన కూపములో వైచిన, రోదనము చేయుచుండఁగాను, నొక సన్యాసి శిరోమణియైన కువ్వారేతెంచి, యద్భుతంబని నన్నుదిగిచి మక్కములోఁబెట్టి, యీ బాలుండు పురుషాకారంబు గలవాఁడు. ఇతని నేవిధమున నైనను బోషింప వలయునని తలంచి, కొన్ని వర్షంబులు పెంచి, యంతట సంతూరు విడిచి సింహాద్రిస్వామి సన్నిధికిం జను నప్పుడు నన్ను మఱువకుమని పలికిన, కువ్వా రప్పుడు స్వామి సన్నిధికిం జనెను. త్రిరాత్రంబులు శిశువుఁజూచి సింహగిరీశుం డైన స్వామి తనమీద దయ-దప్పెనోయని యున్న సమయంబున, బాల రూపం బున వచ్చిన స్వామి, క్షీరంబులు దెచ్చి యుపయోగింపుమనినఁ, బుచ్చుకొని లోపలికేగి హస్తముల నయనములు దుడుచుకొన్న సమయంబున నంధత్వము మాసె. (అతఁడా)శ్చర్యపడి నిద్రించు సమయంబున స్వామి తన స్వప్నంబున

---

* ఇచట కొద్ది గ్రంథపాతము.

వతారావతారంబునఁ బ్రత్యక్షంబై, నా సన్నిధిని సంకీర్తన నామోచ్చారణంబులు, నుపనిషద్వాక్యంబులును, పరమ భక్తి భరిత చాతుర్లక్ష గ్రంథ సంకీర్తనములు చెప్ప మనెను. 'నేనెక్కడ? నామోచ్చారణం బెక్కడ? జడుండను, మూఢుండను'. అనిన, స్వామి యుపదేశము చేసిరి. తాను పురోహితుని గృహంబునకుం జని తనకు సంకీర్తన నామోచ్చారణంబు సేయ ముహూర్తము వెట్టు మనిన. విప్రుఁడాలస్యము చేసె. స్వామి తన వాక్యములు నిలుపుకొని వికృతి సంవత్స రంబున జన్మంబును (బొందుటయు), పరాభవ సంవత్సర ఆషాఢ శుద్ధ ద్వాదశి నాడు చిటి తాళంబులను బూని సంకీర్తన చేయుచుండఁగాను, నంతట కువ్వారేతెంచి యాశ్చర్యపడెను. 'మీ సందర్శనంబునఁ గృతార్థుండ నైతి'ననిన, కువ్వారు 'నామోచ్చారణంబు సత్యంబు' ననఁగా. 'నన్నేలినస్వామి నిన్ను రక్షించుంచుఁ గాక'. శ్రీ కృష్ణ కువ్వారు స్వామీ, సింహగిరి వరహరీ, వమోనమో దయానిధీ!.

53

దేవా, [యమునా] గోదావరి యావల శ్వేతద్వీపమందు(!) మా మేన మామ శ్రీ రంగాచార్యులు గలరు. వారి (కుమా ర్తె) యందు తిరుకల్యాణము గా బోవుచున్నాఁడను. ఇది మీకు విన్నపము సేయు చున్నాఁడను. తిరుకల్యాణము నకుఁ బనివినవే దేవా, అని మీకు విన్నపము సేసిన, 'వేను వేంచేసెదనోయి కృష్ణమాచార్యా' యని యానతిచ్చిన, 'ఓం నమోనారాయణాయ మీరేల వేంచేసె దరు? ప్రహ్లాద వరదా', యటంచు మీకు విన్నపము చేసిన, 'నట్లుగాదోయి, కృష్ణమాచార్యా, నీవు పదునొకండవ యవతారుండవు. లీలా వినోదముతో నీతిరు కల్యాణము చూడవేడుక యయ్యెను. నేనును వేంచేసెదను.' అని యానతిచ్చిన 'నన్నే కానిండు. ఓంనమోనారాయణాయ. ఇది మీరెఱుంగుదురో యెఱుంగరో! మిమ్మెవ్వఁడు నమ్మవచ్చునా? ఓ నమోనారాయణాయ. జగన్నాటక సూత్రధారివి కావా? సుగ్రీవుని చేపట్టి వాలిని మర్దించిన వాఁడవు గావా? మిమ్మెవ్వండు నమ్మునే? ఓం నమోనారాయణాయ. మిమ్మునమ్మరాదు.' అనిన, 'కాదోయ్, నేవచ్చెదను. లక్ష్మి తిరుకల్యాణము నాడు సురాసుర యుద్ధమాయెను. వేద శాస్త్ర ఘోషంబై యుండెను. రుక్మిణి తిరు కల్యాణమునకు శిశుపాల యుద్ధ మయ్యెను. ఏ తిరు కల్యాణమున వేడుక చాలదాయెను. నీతిరు కల్యాణము చూడ వచ్చెదనోయీ, కృష్ణమాచార్యా.' ఆ క్షీరసాగర మధ్యమందున్న

వైనతేయుని నీవిధమున స్తోత్రము చేసితిని. "భద్ర బదంతే జ్వలతో ద్యపా అపస్సమాః। మధ్యమ కేశవా ఓహవాం। పాత తసోమధ్యానాత। అఖిలాండ జాతజాం।' ఆ క్షీరసాగర మథ్య మందున్న వైనతేయుండు పనివిని యెను. దేవా, వైనతేయు నెక్కి మీరును వేంచేసితిరి. దేవా, మామామ శ్రీరంగాచార్యులు నాతిరుకల్యాణ మేవిధమున జేయుచున్నాడు విన నవధరింపుము. కృష్ణార్పణముగా దానములు గావించెను. వైష్ణవులకు మధుపర్కములు సమర్పించెను. నాయింతికి నాకును నిష్టాన్నమును భుజింప జేయుసప్పుడు మీరు వేంచేసి, 'యిదియేమి? కృష్ణమాచార్యా, మీరే భుజించుచున్నారు! నేను మహా యలపై యున్నాడను. తళియ వడ్డించవోయి కృష్ణమాచార్యా,' యని యానతిచ్చిన మీకును తళియ వచ్చెను. (మీరును) నేనును భుజియింపంగాను నచ్చటికి శ్రీ రంగాచార్యులు వేంచేసి, 'యిదేమి కృష్ణమాచార్యా, ఇతడు చరముండై యున్నాడు. మీకును యజ్ఞోపవీతములు లేవు. ఇతడు వైష్ణవుడని తళియ వడ్డించితిని. వైష్ణవులకు మధుపర్కము లిప్పించితిని. శూద్రునకు మృష్టాన్నమును భుజింప బెట్టితివి. నీవువెలి.' అని మామామ వెలిబెట్టి నన్ను తిరుమాళిగ నుండి వెళ్ళం ద్రోచెను. దేవా! మిమ్మునెవ్వండు నమ్మును! దేవా, ఓం నమోనారాయణాయ. తిరు కల్యాణమునకు విఘ్నము చేయవలసి వేంచేసినారు గాక! మిమ్మునెవ్వండు నమ్మును? ఓం నమోనారాయణాయ. ఆచార్యులును నిదేగతి నిన్నుమేమెల్ల, మనిన విని, 'ఓయి కృష్ణమాచార్యా, నీకింత ప్రలాపం బేమిటికి? మానుమని'న, నట్టిదే కానిమ్మని ఓం నమోనారాయణాయ యంటిని. ఆ రాతిరి (మీరు) శ్రీ రంగా చార్యుల స్వప్నమందు బోయి, కృష్ణమాచార్యుల యింతిని మాయన తిరుమాళిగకు వేంటఁబెట్టుకొని వచ్చి దిగవిడువు మన్నమాటకు (నాతఁడు) దండము సమర్పించెను. శ్రీ రంగాచార్యులు తమ తిరుమాళిగకు వేంచేసిరి. ఇదియే నా విన్నపము ఓం నమోనారాయణాయ. ప్రహ్లాద వరదా, మీకన్న నధికులు లేరు. నాకన్న నథములు లేరు. నా యింతిని నాకు నంపించితిరి. వెలియన్న మాటకు దండము సమర్పింపఁ జేసితిరి. మీ కగపడి యున్నాడను. నాకంత మెన్నడు, విషమాటవిలోఁబడి వెడలెడు త్రోవఁ గానక చిక్కియున్నాడను. సంకీర్తనమిది. (ఇందు) పరమ రహస్యమున్నది. ఇందు ఋగ్వేదమున్నది. యతిరామానుజ మునివరము. దాతారు. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

54

దేవా, విప్రవధలనేకంబు లొనర్చి సురాపాన సువర్ణఘాతుకాది మహా పాతకంబులు సేసిన యతండైనఁ గాని, యేక నిమిషంబున మీ దివ్యనామ సంకీర్తన చేసిన యతండే నారాయణ శ్రేష్ఠుండు కాకుండునా? ఇతరులు మెచ్చవలెనని మనస్సు వేఱొక్కచో నిలిపి మిమ్ము నుతిచేసెకాని జారిణిని పతివ్రత యన వచ్చునా? అట్లే యిచ్చివారు. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ!

55

దేవా, నేను చిన్ననాడు చేసిన యఘాయిత్యము[1] జెప్పుచున్నాఁడను. దేవా, ఒక కోమటి పిన్నవాఁడును, నేనును, కోటి కోడి పుంజుల జూదమాడగాను, నా కోమటి పిన్నవాఁడు రొంబది లక్షల పైకాలకు పందె మొడ్డెను. నేనును మీ తళియ ప్రసాదములపై పందె మొడ్డితిని (!) ఇట్లు నా కోమటి పిన్నవాని కోడియు, నా కోడియు నే విధమున యుద్ధము చేయుచున్నవి. దేవా, 'ఘటిత ముఖవరచధిత సంధిత కౌసుభాంశు... మకుట కఠోర వందిత కుంభినీ జయశోభితమ్। కనక ఘన పీతాంబరాచ్యుత కౌస్తుభా జయశోభితమ్। గీత డోలక ఆదిజం। కిణి కిణింకిణి। కిణి కిణిం కిణి। కిణికిణింకిణి। కిణి కిణింకిణి।...'[2] దేవా, అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, ఈ గీతంబు విధంబున యుద్ధము సేయుచుండఁగాను, నా కోమటి చిన్నవాని కోడి తన్నెను. నాకోడి మృతమాయెను. కోమటి చిన్నవాఁడు తనకోడి గెల్చెనటంచు తిరు వీధులను పౌరుషంబు లాడఁగాను, నేను కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యంబులతోడి [రొంటి] మదోన్మత్తుండనై యాకోమటి చిన్నవాని తిరుకుచ్చునట్టి మాటితిని. ఆ కోమటి చిన్నవాఁడు మృతుండాయెను. 'దేవా, వాని ప్రాణవాయువులు వానికిచ్చెదవా యియ్యవా?' అనిన నతని ప్రాణ వాయువులీకున్నను జూచి, 'దేవా, మీరు శబరి యెంగిలి తిన్నది చెప్పుదునా?

---

[1] అఘాయిత్యము అను మాటకర్థము కాన్పించదు. సాహసముతోఁ గూడిన పాపకార్యము అనునర్థమున జనవ్యవహారమునఁ గలదు. 'అఘత్యము'నకు రూపాంతరము కావచ్చును.

[2] గ్రంథపాతము వలె కాన్పించును.

అతని ప్రాణవాయువు లిచ్చెదవా యియ్యవా ?, అనని నతని ప్రాణ వాయువు లీయకున్నను జూచి, 'దేవా, మీరంధకాసుర తాటకాసుర విదళితాసుర, ధేనుకాసుర సోమకాసుర కంసాసుర (వధల) లోపల నప శబ్దంబులు భాషించినవి చెప్పుదునా ? ఇతని ప్రాణ వాయువులిచ్చెదవా ? ఈయవా ? అనిన నతని ప్రాణవాయుపు లీకున్నం జూచి, 'నీకు చాతుర్లక్ష ప్రగంథ సంకీర్తన కాయను మా తల్లి కడవాఁడవా ? నీవు మాకెన్నాళ్ళ ఋణస్థుఁడవో ? నీకు నేనెన్నాళ్ళ ఋణస్థుడనో !' యటంచు మీకు విన్నపము సేసిన, నా కోమటి పిన్నవాఁడు దిగ్గన లేచి కూర్చుండి, యండెలు మువ్వలు మోయఁగాను తన గృహంబునకుఁ బనివినియెను. దేవా, నీవాకార సుకృతివి. ఇది పూర్వభాగ సంకీర్తన (?). ఇది దాన సంకీర్తన (?) ఇది వరమ రహస్యము. శ్రీ కృష్ణ కువ్వారు స్వామి, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

56

దేవా, దినదినంబులు దుర్భాష లాడిన నాజిహ్వకు మీ దివ్యనామ సంకీర్తనం బొకటి చాలదా ? పంచమహా పాతకములు శతకోటి మి[హ]తంబాయె. చూది కొండకు సహస్ర భాగమనలము చాలదా దహింప ? శ్రీకృష్ణ కుస్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

57

దేవా, పరంజ్యోతి పరతత్త్వంబైన యాది నారాయణ శ్రేష్ఠుండు లోకంబుల విహరించుచు, నుత్పత్తి స్థితిలయంబులు సేయుచుండి, యొకనాడు లక్ష్మీ భూకాంత నీళలతో వినోదించుచుఁ, దారక బ్రహ్మంబైన రహస్యంబులు దెలుపుచు సుఖ గోష్ఠిని వైకుంఠవాసుండై యున్న సమయంబున, భూలోకంబున ధర్మా ధర్మంబులు (భేదము) లేక ననేక జనులు దేవతార్చన నమస్కారంబులుడిగి దుర్బలులై, వర్ణాశ్రమంబులు లేక; చండాల గోష్ఠిం జరియించుచు, గోవధయు, విప్రవధయు, ధనచోరత్వంబునను, మద్యపానంబునను, దెగించి శక్తి మయంబై వివిధములుగా విహరించుచున్న యుగంబు జూచి, యింద్రుండును, దేవతా సమూహంబులను, యక్షులను, గంధర్వులను, పన్నగులను, వాసుకి పుండరీక యాజ్ఞవల్క్యాలను, భరద్వాజ గౌతమ వశిష్టగార్గ్య దీప్తిమంత నారదాదులైన ముని గణంబులఁ జూచి, 'యుగధర్మము విపరీతమాయెను. రక్షకుండును, శిక్ష

కుండును నైన పుండరీకాక్షుఁడున్న యెడకుఁబోదము రమ్మనుచు, నజాండంబు నకుఁ జని బ్రహ్మను గూర్చుకొచి, కైలాసంబునకుఁ జని శంకర ద్వారంబునకు వచ్చి కమలజుండు శంకరునితో నిట్లనియె. 'యుగ యుగంబుల స్వామి యవ తారంబులెత్తి యోంకార రూపంబునఁ జరియించెడు గానఁ బుణ్యంబిది, పాపంచిది యని యెఱుంగక జను లధోగతిం బడుచున్నారు. ఇందులకుఁ గి ర్తయు భో క్తయు నైన పురుషో త్తమునికి విన్నపము చేయుదము రండనుచు బ్రహ్మయు, శంకరుం డును వైకుంఠంబునకుఁజని, చక్రధారులును, ఫాలప్రదేశంబున తిరుమణి శ్రీచూర్ణ జపమాలికా శోభితులైన పుణ్యులును, వేదశాస్త్ర పురాణ నామోచ్చారణంబులం బొదలెడు వారలును, శమ దమాది గుణంబులఁ బ్రీతిఁ బొందియున్న వారలును, విష్వక్సేన గరుడ జయవిజయ కుముద కుమూఢాక్షులు ?)ను జేరి, యుభయ పార్శ్వంబుల సేవచేసి విహరించుచున్న వైకుంఠపురంబు చేరిరి. శ్రీకృష్ణ కువ్వారుస్వామీ, దేవా, ఓం నమోనరహరీ, యనుచు పరంధాముని నగరివాకిటకుఁ జనుదెంచి, నారదుఁడు వీణియ మీటి యాలాపన చేసి యాడుచుఁ బాడుచు నున్న సమయంబున నాది శేషశయనుండై యుండి లక్ష్మినిఁ జూచి యిట్లనియె. 'నా దాసులైన వారలు నన్ను జేర్కొనుచున్నారు. శ్రీ వైష్ణవులను మన్నన చేయవలె. పోదము రమ్మనుచు దేవ సంఘంబులున్న కడకుఁ జనుదెంచెను. శ్రీ కృష్ణ కువ్వారు స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ.

58

దేవా, ఒకపరి మిమ్ము నెఱుంగుదుమయ్యా, ఒకపరి మిమ్ము నెఱుంగ మయ్యా, జ్ఞానిని జేయుమయ్యా, అజ్ఞానిని జేయకుమయ్యా. పుణ్యంబిది, పాపం బిది, స్వర్గంబిది, నరకంబిది, యాచారంబిది, యనాచారంబిది, విధేథంబిది, యనిషేథంబిది, వరుసయునిది, వర్తనంబిది, వివేకంబిది, యవివేకంబిది యని యనేక కర్మ తంత్రంబులు ఫలించి యసంఖ్య కోట్లం బుట్టింపుచు, పెరిగింపుచు, నణగింపుచు, బహుమాయల బహునాటక సూత్రధారివై, యాశాపరుండవై, కుల ఱుండవై, నిర్జీవుండవై, జీవంబులన్నియు నీవై యేకమై, యనేకమై, యాకాశంబవై యనాకాశంబవై, నిలకడయై, బయలై, వినోదించుచు, నింద్రజాల మహేంద్రజాల విద్యలం బచరింపుచు, పశు పక్షి నరమృగ క్రిమి కీటక పిపీలికాదుల ప్రాణంబులు నీవైయున్న, నీ మహత్త్వము దెలియ బ్రహ్మరుద్రాదులును, బ్రహ్లాదనారద పరాశర పుండరీక వ్యాసాంబరీష శుకశౌనక భీష్మదాల్భ్యం రుక్మాంగద విభీషణాది

పుణ్యానిమాం పరమ భాగవతులు మిమ్ము నుతియింపలేరు. మిమ్ము నుతియించ నేనెంతవాఁడను ? అధమాధముఁడను. నరపశుఁడను. నీవు గాచి రక్షింపవే. అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

59

దేవా, అంకిలి యనియెడు తెవ్వలింటికిఁ దిప్పు. అసత్య కృతమే ముప్పు. తగవు ధర్మము నడిపినదే యొప్పు. అనాథపతీ, స్వామీ, నరహరీ, మిమ్ముఁ దలంపనిదే తప్పు. సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ !

60

దేవా, హిరణ్యనాభి కమలంబునఁ దామస గుణంబున సరస్వతీ (పతియు) నేనును (?) బుట్టితిమి. ఈ విధంబునఁ గారణకర్తలైన మాయందు విశ్వ ప్రపంచంబు పుట్టింపఁ దలంచి. పంచశతకోటి యోజన పరిమాణంబును, కోటి యోజనంబుల యౌన్నత్యమునుం గలిగి హిరణ్మయంబుగా నొక్క మండలంబు గల్పించె. అయ్యండంబు బ్రహ్మాండభనం బరగె. అందాకాశంబు కల్పించె. ఆకాశంబున వాయువు, వాయువువలన నగ్నియు, నగ్నివలన జలంబును, జలంబు వలనఁ బంచమహా భూతంబులును గిల్పించె. అందాకాశం(రం)బునకు శబ్దం బొకటి గుణంబయ్యె. వాయు తేజములను గుణద్వయంబు పుట్టె. తేజంబునకు శబ్దస్పర్శ రూపంబులను గుణత్రయంబు కల్పించి. జలంబువలన శబ్ద స్పర్శ రూప రస గంధంబులునుం గలిగె. ఇట్టి మహా పంచభూతంబులకు సావధానంబులుగా స్వర్గ మర్త్య పాతాళంబులను జగత్రయంబుల నిర్మించె. స్వర్గంబున దేవతలును, మర్త్యంబున మనుష్యులును, పాతాళంబున రాక్షసులును, నుండ నియమించె. తదీయాంతర్గతంబు లయిన భూలోక భువర్లోక సువర్లోక మహర్లోక జనలోక తపోలోక సత్యలోకంబు లనియెడు నేడు లోకంబులను, నతల వితల సుతల మహాతల రసాతల తలాతల తాపాళ లోకంబు లనియెడు నేడు లోకంబులును, చతుర్దశ భువనంబులును ప్రవర్తిల్లుచుండె. ఆ చతుర్ముఖునకు నాలుగు వదనంబుల యందును, ఋగ్యజుస్సామాథర్వణంబులను నాలుగు వేదంబులు ప్రవర్తిల్లుచుండె. వాని యంవనంతంబులై వేదంబులు ప్రభవించె. అంతనయ్యజునకుఁ బ్రపంచ నిర్మాణ సాహాయ్యులై మరీచ్యత్రి) భరద్వాజ విశ్వావస్వంగీరస పులస్త్య పులహక్రతు దక్ష వశిష్ట నవబ్రహ్మలుదయించిరి. మరియు విశ్వ

దేవతలును, విశ్వకర్మ నారద సనకసనందన ససస్సుజాతాశ్విన్యాది దేవతలుద యించిరి. మరియు వరుణుండును, ధ్రువుండును, సోముండును, నహుషుండును, నజయుండును,మృగుండును, మృగవ్యాహుండును, సనిలుండును, నను నెనమండ్రు వసువు లుద్భవించిరి. స్వాయంభువ, స్వారోబిషోత్తమ తామసరైవత చాక్షుస వైవస్వత సూర్యసావర్ణి బ్రహ్మసావర్ణి రుద్రసావర్ణి ధర్మసావర్ణి, యింద్రసావర్ణి, యను పదునలుగురు మనువు లుదయించిరి. అందొక్కని మన్వంతరమునకు మనుపదంబున నుండ నియమించి, మను సాహాయ్యులైన ధాతయు విధాతయు నుద్భవించిరి. మరియు శంకరుండును, స్థాణుండును, శర్వుండును, మృగ వ్యాధుండును, నేకపాదుండును, జక్షకుండును, నహర్బుధ్న్యుండును, పినాకియు, బావకేశ్వరుండును, గపాలుండును, ననపేతుండును, ననరుద్రు లుదయించిరి. వానియందు గణపతియు, షణ్ముఖుండును, నుదయించిరి. శ్రీ మహావిష్ణువునకు మన్మథుండును, మోహనస్తంభన వశీకరణ సంతాప నాకర్షణోచ్చాటన ప్రపంచ పంచ బాణ నిరంచిత సకల ప్రపంచితు లుదయించిరి. అంత మరీచి పుత్రుండయిన కశ్యపప్రజాపతికి, దక్షపుత్రియైన యదితికి, సూర్య ఖగత్వష్ట వివస్వత మిత్ర విధ్యాంశుమతి గభస్తిపద్మ విష్ణ్వింద్ర వరుణులను ద్వాదశాదిత్యు లుదయించిరి. తదనంతరంబు నత్రికి ననసూయకు చంద్రుం డుదయించె. (దక్ష ప్రజాపతికి) గూతులైన యశ్వని భరణి కృత్తిక మొదలైన యిరువదియేడు తారకంబులు చంద్రునికి భార్యలైరి. మఱియును, నింద్రాగ్నియు నైర్ఋతి వరుణవాయు కుబేరే శాన్యుల నష్టదిక్పాలురను సృజించి వారిని యష్టదిక్కులను నియమించి, సరస్వతి సభాపతి, రయమతి గానతి దాంతి దాంతియును (?) నలకయును, నీశాన్యమును నష్టవరంబులు వా(రికి ప్రసాదించితివి).* అనాథపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ ;

---

* ఈ అసంపూర్ణ వచనముతో నీ గ్రంథము సమాప్తమగు చున్నది.

BLANK PAGE

50

Check List

Book Number	GV/2018/184	Date	19-3-2021
Front Cover	YES	Back Cover	YES
Blank Pages	CT, IV, 49		
Missing Pages	NO		
Prepared	G. Soudhai	Scanned	K. Yameema
BOOK SIZE	H 8.6 W 5.5	Pages	83